

గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


దేశ భవిష్యత్తు కోసమే ఇష్టా సాంస్కృతిక ఉద్యమం

తెలంగాణకు బిజెపి సర్కార్ ద్రోహం

లోపలి పేజీల్లో


సంపుటి 08, సంచిక: 176 | సోమవారం | 26-05-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




05

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకమైంది

- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ



05

ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు



05

ఢిల్లీని ముంచెత్తుతున్న భారీ వర్షాలు

- నీటమునిగిన కార్లు, బస్సులు
- 180 విమానాలపై ప్రభావం, 49 విమానాలు దారిమళ్లింపు

ఉక్రేన్–రష్యా మధ్య భారీసంఖ్యలో బందీ సైనికుల మార్పిడి 02



- చర్చలకు సిద్ధమని మావోయిస్టులు చెబుతున్నా కేంద్రం అవకాశం ఇవ్వకపోవడం దారుణం
- మతాలు, ప్రాంతాల పేరుతో మనుషుల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతున్న బిజెపి సర్కార్
- కాషాయ పార్టీని అంతం చేయాల్సిందే
- ఎర్రకోటపై జెండా ఎగురవేతే లక్ష్యంగా వామపక్ష పార్టీలన్నీ ఏకమవ్వాలి
- సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మహాసభల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- అన్ని వర్గాలకు అండగా నిలిచేది సిపిఐ మాత్రమే : ఎమ్మెల్సీ నెల్లికంటి



# అర్హులకు పథకాలందేలా సిపిఐ పోరాటాలు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి

ఎర్రకోటపై ఎర్రజెండా ఎగుర వేసే లక్ష్యంగా స్వల్ప విభేదాలతో వేర్వేరుగా కొనసాగుతున్న వామపక్ష పార్టీలన్నీ ఏకమై ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. శ్రామిక, కార్మిక, కర్షక వర్గ నిరుపేదల పక్షాన ఫలితాలు సాధించే వరకు పోరాడుతూ గత వందేళ్ల కాలంగా ప్రజల మదిలో నిలిచి పోయింది కేవలం కమ్యూనిస్టులు మాత్రమే అని ఆయన తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం దిగజార్చిన ఆర్థిక పరిస్థితులు, తప్పులను సరిదిద్దలేని ఊబిలోకి కాంగ్రెస్ ప్రభుత్వం ఇరుక్కుపోయింది. అన్ని పథకాలు అర్హులందరికి దక్కేలా సిపిఐ శ్రేణులు పోరాటం చేయాలన్నారు. ఇసిఐఎల్‌లోని బంజారా ఫంక్షన్ హాలులో సిపిఐ సహాయ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మేడ్చల్ జిల్లా 4వ మహాసభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్‌లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు తామే హిందువుల ప్రతినిధిగా పేర్కొంటూ వివిధ వర్గాలు, మతాలు, ప్రాంతాల పేరిట మనుషుల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టటం ద్వారా ఓట్లు దండుకొనే రాజకీయాలతో పదేళ్ల పైబడి కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న బిజెపి ప్రభుత్వం

తరువాయి 12లో

## సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శిగా ఉమామహేష్



సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శిగా ఉమామహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సిపిఐ జిల్లా 4వ మహాసభలో ఆయన ఎన్నికను ప్రకటించారు. కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన ఉమామహేష్ గతంలో జిల్లా పార్టీ సహాయ కార్యదర్శిగా పని చేశారు.



# నాలుగు రోజులు భారీ వర్షాలు

రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 26న ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే

తరువాయి 2లో



# ఈసెట్ పరీక్షలో 93.87% ఉత్తీర్ణత

ఫలితాలు వెల్లడించిన రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

పాలిటెక్నిక్, బిఎస్సి, మ్యాథ్స్ విద్యార్థులు లేటరల్ ఎంట్రీ ద్వారా బిటెక్, బి ఫార్మసి కోర్సులలో చేరేందుకు నిర్వహించిన 'ఈ సెట్' పరీక్షలో93.87 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి ఆదివారం ఫలితాలను విడుదల చేశారు. టిజి ఈసెట్ పరీక్ష మే 12న నిర్వహించారు. ఈ పరీక్షకు 19,672 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా, ఇందులో 18,928 మంది (96.22 శాతం) పరీక్షకు హాజరయ్యారు. బిఎస్సి మ్యాథ్స్ విభాగంలో మొదటి ర్యాంక్ బి.సంతోష్‌కుమార్, రెండవ ర్యాంక్

తరువాయి 2లో

# విద్య, వైద్య రంగాల్లో భారీ మార్పులు తెస్తాం



- వైద్యరంగ అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండ
- వైద్యులు వృత్తి నిపుణులే కాదు.. సమాజ శ్రేయస్సుకోసం పనిచేసే సేవాతత్పరులు
- ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ముగిసిన 'తానాకాన్' 11వ రాష్ట్ర సదస్సు

ప్రజాపక్షం/కరీంనగర్

తెలంగాణలో ప్రధానంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. వైద్యరంగ అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆదివారం గత రెండు రోజులుగా కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నిర్వహించిన 'తానాకాన్' 2025 (తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్) పదకొండవ రాష్ట్ర సదస్సు

తరువాయి 2లో



# ఏం చేద్దాం!

- బిఆర్‌ఎస్ చీఫ్ కెసిఆర్‌తో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ భేటీ
- ఎమ్మెల్సీ కవిత లేఖ, ఆమె వ్యాఖ్యలపై చర్చ
- కాళేశ్వరం కమిషన్ నోటీసులపైనా మంతనాలు
- తండ్రికొడుకుల భేటీపై వెల్లువెత్తుతున్న ఊహాగానాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావుతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం భేటీ అయ్యారు. ఇటీవల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ,అనతరం ఆమె చేసిన వ్యాఖ్యలు,వాటి పరిణామాలు, ఇతర రాజకీయ పార్టీల స్పందనతో పాటు తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవమైన జూన్ 2న చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించినట్టు తెలిసింది.అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కమిషన్ అందజేసిన నోటీసులు తదితర అంశాలు చర్చకు వచ్చినట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.అయితే జూన్ 1న అమెరికాలో జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు కెటిఆర్ ఈ నెల 28న అమెరికాకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో జూన్ 2న చేపట్టాల్సిన కార్యక్రమాలు, వాటి బాధ్యతలు తదితర అంశాలపై కూడా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. కాగా కెసిఆర్‌తో కెటిఆర్ భేటీ కావడం పట్ల రకరకాల ఉహాగానాలు వినిపిస్తున్నాయి.



# హజ్‌యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్

హజ్‌యాత్ర నిమ్మితం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్, నాంపల్లిలోని హజ్‌హౌస్ వద్ద హజ్ యాత్రికుల బస్సులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం బాగుండాలని, రాష్ట్టంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను అని అన్నారు. జీవితంలో అందరికీ హజ్ యాత్రకు అవకాశం రాదని, ఆ అల్లాహ్ దయ వల్లనే అవకాశం వచ్చిందని తెలిపారు. హజ్ యాత్ర సజావుగా సాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# నంబాల మృతదేహం ఇంకా మార్చురీలోనే



మరణం తర్వాత కూడా వీడని చిక్కుముడి

భౌతికకాయం అప్పగింతపై తీవ్రస్థాయిలో చర్చ

ప్రజాపక్షం/ఖమ్మం

డెబ్బైఐదేళ్ల నంబాల కేశవరావు 55 సంవత్సరాల పాటు సాయుధ పోరాటంలో పలు కీలక బాధ్యతల్లో పనిచేస్తూ అనేక హింసాత్మక ఘటనలకు నాయకత్వం వహించారు. అదే సమయంలో పలుమార్లు నంబాల కేశవరావుపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. ఈనెల 21న ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు మరో 20 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం విధితమే. ఇప్పటి వరకు 22 మృతదేహాలను బంధుమిత్రులకు అప్పగించారు. నంబాల మృతదేహం అప్పగింతపై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతుంది. నంబాల ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారు కావడంతో మృతదేహాన్ని శ్రీకాకుళంకు తరలిస్తే

తరువాయి 2లో

# కొచ్చి తీరంలో 'హై' అలర్ట్



సముద్రంలో మునిగిన 640 కంటైనర్ల నౌక

13 కంటైనర్లలో ప్రమాదకర రసాయనాలు

కొచ్చి : ప్రమాదకరమైన సరుకులతో కూడిన 13 కంటైనర్లతో సహా 640 కంటైనర్లతో కూడిన లైబీరియన్ నౌక ఆదివారం కొచ్చి తీరంలో మునిగిపోయింది. దీంతో చమురు బహిర్గతమవుతుందోనన్న భయాలు వ్యక్తమయ్యాయి. అవి లీకైతే సముద్ర జలాలు తీవ్రంగా కలుషితమయయ్యే ప్రమాదం ఉండడంతో అధికారులు కొచ్చి తీరంలో హై అలర్ట్ ప్రకటించారు. శనివారం నౌక తీవ్ర వంపు తిరిగిన తర్వాత 24 మంది సిబ్బందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఇండియన్ కోస్ట్ గార్డ్‌తో కలిసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నందున ఇప్పటివరకు ఎటువంటి చమురు చిందటం జరగలేదని రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. లైబీరియన్

తరువాయి 2లో

# అహీం సంస్థపై పోలీసుల డేగ కన్ను

వరంగల్‌కు పాకిన 'ఉగ్ర' లింక్

నసీర్, సమీర్‌లను మూడవ రోజూ విచారించిన పోలీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

పేలుళ్ల కుట్ర కేసులో పట్టుబడిన నసీర్, సమీర్‌లు మూడో రోజు విచారణలో సంచలన విషయాలు వెలుగు బయటపడ్డాయి. వరంగల్‌కు చెందిన ఫరహాన్‌తో నసీర్, సమీర్‌లకు ఉగ్ర పరిచయాలు ఉన్నాయని విచారణలో తేలినట్లు తెలిసింది. ఫరహాన్ స్థానికంగా అహీం అనే సంస్థను నిర్వహిస్తున్నాడని, ఈ సంస్థను అడ్డుపెట్టుకుని దాని చాటున ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అహీం అనే సంస్థపై ఆరా తీసేందుకు నాలుగు పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. ఫరహాన్ కుటుంబ నేపథ్యం, స్థానికంగా అతని కార్యకలాపాలపై

తరువాయి 12లో

# పెద్ద కుమారుడిని బహిష్కరించిన లాలూ

తేజ్ ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి ఆరేళ్లుపాటు తొలగిస్తున్నట్లు ప్రకటన


ఇకపై మా కుటుంబంలో స్థానం లేదని వెల్లడి



**పాట్నా :** ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ తన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను ఆదివారం పార్టీ నుండి బహిష్కరించారు. అంతేకాకుండా అతనికి కుటుంబంతో ఎటువంటి సంబం ధం ఉండదని ప్రకటించారు. తేజ్ ప్రతాప్ యాదవ్ శనివారం సాయంత్రం సోషల్ మీడియాలో

తరువాయి 12లో

# ఖాకీవనంలో కలుపుతీతే లక్ష్యం



లంచగొండుల పట్ల దూకుడు పెంచిన ఎసిబి

రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతున్న పోలీసులు

అయినా మారని తీరు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఖాకీ వనంలో కలుపుమొక్కలను ఏరివేసేందుకు అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) దూకుడు పెంచింది. అవినీతికి పాల్పడిన పోలీసులపై వస్తున్న ఫిర్యాదుపై ఒక్కింత ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కొంత మంది పోలీసులు అవినీతికి పాల్పడుతూ పోలీసు శాఖకే చెడ్డపేరు తెస్తున్నారు. వీరి పట్ల డిజిపి డాక్టర్ జితేందర్ కూడా కఠినంగానే వ్యవహరిస్తున్నారు. అవినీతికి పాల్పడుతున్న వారిలో కానిస్టేబుల్ స్థాయి నుంచి డిఎస్‌పి స్థాయి వరకు ఉండడం పోలీసు శాఖను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ మధ్య తరచూ పోలీసులు ఎసిబికి చిక్కిపోతున్న కేసులు పెరిగిపోవడం పట్ల ప్రజల్లో పోలీసులు చులకనైపోతున్నారు. ఆయా విభాగాల అధిపతుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే కింది స్థాయి పోలీసులు లంచాలకు అలవాటు పడుతున్నారనే వాదన ఉంది. కేసు మాఫీ చేసేందుకు, నిందితులకు స్టేషన్ బెయిల్ ఇప్పించేందుకు, చార్జిషీట్‌లో నిందితుల పేరు తొలగించేందుకు, ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేందుకు, భూకబ్జాలకు సహకరించేందుకు, సెటిల్‌మెంట్లు ఇలా ఆయా కేసుల్లో



తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పాకిస్థాన్‌లో గాలి దుమారం
### 14 మంది మృతి

**లాహోర్ :** పాకిస్థాన్‌లో విపరీతమైన వడగాలులు తీవ్ర ప్రతాపం చూపించిన తర్వాత పెనుగాలి దుమారం చెలరేగింది. ఈ గాలి దుమారం ప్రభావం వల్ల 14 మంది మరణించారు. మరో 100 మంది గాయపడ్డారు. గోడలు కూలిపోవడంవల్ల, ఇంటి పైకప్పులు పడిపోవడంవల్ల, ఎక్కడో పైన ఉన్న సోలార్ ప్యానల్స్ విరిగి కింద పడిపోవడంవల్ల ఎక్కువ మంది మరణించారు. సెంట్రల్‌పాకిస్తాన్, ఈశాన్యపాకిస్తాన్ ప్రాంతాలలో ఈ గాలిదుమారం చెలరేగింది. పెద్దపెద్ద చెట్లు కూకటివేళ్ళతోసహా నేలకు ఒరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వర్షం లేకుండా, ఉరుములు, మెరుపులు, విపరీతమైన గాలిదుమారం బీభత్సం సృష్టించింది. శనివారం మధ్యాహ్నం ఈ ప్రకృతి వైపరీత్యం సంభవించిందని అధికారులు ఆదివారం నాడు ప్రకటించారు. తూర్పు పంజాబ్, వాయువ్య ఖైబర్ పంఖ్తుంఖ్వా రాష్ట్రాలలో ఎక్కువ నష్టం వాటిల్లిందని చెప్పారు.

## ఉక్రేన్—రష్యా మధ్య భారీసంఖ్యలో
# 1,990మంది బందీ సైనికుల మార్పిడి





**మాస్కో :** రష్యా, ఉక్రేన్ దేశాలు తమ వద్ద బందీలుగా ఉన్న సైనికులు—పౌరుల పరస్పర మార్పిడి ప్రక్రియ వరుసగా మూడోరోజు కూడా కొనసాగింది. ఆదివారంనాడు రెండు దేశాలూ 606 మంది సైనికుల పరస్పర మార్పిడి కార్యక్రమం జరిగింది. ఉక్రేన్ తమవద్ద బందీలుగా ఉన్న 303 మంది సైనికులను రష్యాకు స్వాధీనం చేయగా, రష్యా కూడా 303 మంది ఉక్రేన్ సైనికులను ఆ దేశానికి అప్పగించింది. మొత్తంగా చూస్తే ఈ మూడు రోజుల్లో మొత్తం 1,990 మంది సైనికులను పరస్పరం స్వాధీనం చేశాయి. గడచిన మూడు సంవత్సరాలుగా ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధంలో బందీలైన సైనికుల పరస్పర మార్పిడి ప్రక్రియ ఇంతభారీ స్థాయిలో జరగడం ఇదే మొదటిసారి. దీనిపై రష్యా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా స్పందిస్తూ, ఇస్తాంబుల్‌లో చర్చలను రష్యా ప్రతిపాదించిందనీ, పశ్చిమదేశాలకు చర్చల పట్ల చిత్తశుద్ధిలేదన్న విషయం ఈ సైనికుల మార్పిడి ప్రక్రియ స్పష్టం చేసిందన్నారు. ఈ సంక్షోభానిన పశ్చిమ దేశాలే సృష్టించాయన్నారు. ఇస్తాంబుల్‌లో ఒప్పందం ప్రకారం మే 23,24 తేదీలలో రెండు దేశాలూ పరస్పరం 1,384 మంది సైనికులను ఇచ్చిపుచ్చుకున్నాయి. శుక్రవారంనాడు 390 మందినీ, శనివారంనాడు 307 మంది సైనికులను రష్యాకు ఉక్రేన్ అప్పగించింది. అదేవిధంగా రష్యా కూడా శుక్రవారంనాడు 270 మంది సైనికులను, 120 మంది పౌరులను, శనివారంనాడు 307 మంది సైనికులను ఆ ఉక్రేన్‌కు అప్పగించింది.


## రష్యా సామూహిక డ్రోన్ దాడి
### ఉక్రేన్‌కు భారీనష్టం : 12 మంది మృతి





**కీవ్ :** ఉక్రేన్ రాజధాని నగరం కీవ్‌పై ఆదివారం తెల్లవారుజామున రష్యా భారీస్థాయిలో దాడులు చేసింది. ఈ దాడుల్లో 12 మంది ప్రజలు మరణించగా, 70 పౌరులు గాయపడ్డారు. 80 నివాసిత ప్రాంతాలపై డ్రోన్ల దాడులు జరిగాయి. కీవ్‌లో ఉన్నతాధికారులు ఈ విషయం చెప్పారు. గతంలో లేనంత తీవ్రంగా డ్రోన్లు, క్షిపణులతో రష్యా సైన్యం దాడి చేసింది. ఐతే గాయపడినవారిసంఖ్య చాలా ఎక్కువసంఖ్యలో ఉందని, ఇది తమకు దిగ్భ్రాంతి కలిగించిందని ఉక్రేన్ అధికారులు చెప్పారు. మొత్తం 142 ప్రాంతాలలో ఈ దాడులవల్ల ధ్వంసం జరిగింది. ఆయుధ డిపోలు, మిలిటరీ ఎయిర్ ఫీల్డ్స్, ఎలక్ట్రిక్ వార్‌ఫేర్ స్టేషన్లను డ్రోన్లు ధ్వంసం చేసి ఉక్రేన్‌కు భారీ నష్టం చేశాయి. మొత్తం 367 డ్రోన్లు, క్షిపణులు,266 యుఎవిలను 22 లక్ష్యాలపై రష్యా ప్రయోగించిందని ఉక్రేన్ వైమానికదళ అధికార ప్రతినిధి యూరీఇహ్నాట్ చెప్పారు. వివిధ రకాల 69 క్షిపణులను, ఇరాన్‌లో తయారు చేసిన 298 డ్రోన్లను ప్రయోగించిందని చెప్పారు. ఐతే దీనిపై రష్యా సైన్యం వెంటనే స్పందించలేదు. కాగా ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ స్పందిస్తూ, దాదాపు 30 నగరాలు, గ్రామాలపై రష్యా డ్రోన్ దాడి చేసిందనీ, రష్యాపై వెంటనే ఆంక్షలు విధించాలని యూరప్ దేశాలకు విజ్ఞప్తి చేశారు. 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైన యుద్ధం ఆదివారంనాటికి 1,186 రోజులకు చేరుకుంది.

## రుమేనియా ఎన్నికల్లోయూరప్ ప్రయోజనాల కోసమే టెలిగ్రామ్ సిఇఒ అరెస్టు



**మాస్కో :** రుమేనియా ఎన్నికల్లో విజయం సాధించి ప్రయోజనాలు పొందడంకోసమే టెలిగ్రామ్ సహవ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పావెల్ డ్యూరోవ్‌ను అరెస్టు చేశారని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా ఆదివారంనాడు మీడియా సమావేశంలో విమర్శించారు. చాలా అమానుషమైన, ఆటవిక పద్ధతులలో డ్యూరోవ్‌ను అరెస్టు చేశారని విమర్శించారు. అంతర్గత ప్రయోజనాలకోసం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదేశాలమేరకు డ్యూరోవ్‌ను అరెస్టు చేశారని, రుమేనియామలో యూరప్ అనుకూల ఎన్నికల ఫలితాలు సాధించడంకోసం టెలిగ్రామ్ మెసెంజర్ యాప్‌ను ఉపయోగించుకోవచ్చుననే దురుద్దేశంతోనే పావెల్ డ్యూరోవ్‌ను మేక్రాన్ అరెస్టు చేయించారని జఖరోవా విమర్శించారు. అధ్యక్ష ఎన్నికల్లో యూరప్ అనుకూల కన్జర్వేటివ్‌పార్టీకి టెలిగ్రామ్ ద్వారా మేలు చేయాలని చేసిన విజ్ఞప్తిని తాను తిరస్కరించానని మే 18న డ్యూరోవ్ ప్రకటన చేశారు. అంతకుముందే 2024 ఆగస్టు 24న ఫ్రెంచ్ పోలీసులు డ్యూరోవ్‌ను అరెస్టు చేశారు. టెలిగ్రామ్‌లో యూజర్లు తమ ఇష్టానుసారంగా కంటెంట్ క్రియేట్ చేసుకోవడానికి అవకాశాలు ఇచ్చే విధానాన్ని పాటించారన్న ఆరోపణపై, టెలిగ్రామ్ సిఇఒ ఫ్రెంచ్ పోలీసులు కోరినవిధంగా వారికి సహకరించడంలేదన్న ఆరోపణలపై అరెస్టు చేశారు. ఆయనపై ఆయనపై 12 రకాల క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఫ్రాన్స్ విడిచి ఎక్కడికి వెళ్ళకూడదని ఆంక్షలు విధించారు. ఇవన్నీ తప్పుడు కేసులనీ, రుమేనియా ఎన్నికల్లో టెలిగ్రామ్ యాప్ ద్వారా ప్రయోజనాలు పొందడమే తెరవెనుక అసలు ఉద్దేశమని జఖరోవా విమర్శించారు. నాటో కూటమి అనుకూలవాద, మధ్యేవాద రాజకీయనాయకుడు, బుఖారెస్ట్ మేయర్ నిక్కుసర్ డాన్ (55) ఈ ఏడాది మే 18న జరిగిన రన్నాఫ్ ఎన్నికల్లో అధ్యక్ష పదవిని గెలుచుకున్నారు. ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్స్కీ దీనిని చారిత్రక విజయంగా జెలెన్స్కీ అభివర్ణించారు. పొరుగుదేశం రుమేనియా తమకు ఎంతో ముఖ్యమైన మిత్రదేశమని, ఇక కలిసి పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. నాటోలో రుమేనియా సభ్యత్వం పొందాలని డాన్ గట్టి పట్టుదలతో ఉన్నారు. ఉక్రేన్‌కు ఆయుధ సరఫరాను తిరస్కరించడమే లక్ష్యంగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన యానియన్ ఫర్ రుమేనియా కూటమి (ఎయుఆర్) వ్యవస్థాపక అధ్యక్షుడు జార్జ్ సిమియన్ ఓడిపోయారు. ఉక్రేన్‌కు యుద్ధసహాయం పంపకూడదని సిమియన్ గట్టిగా వాదించడం యూరప్ దేశాలకు నచ్చలేదు. గత ఏడాది నవంబరులో రుమేనియా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి జార్జెస్కూ అత్యధికంగా మొదటి రౌండులో 23 శాతం ఓట్ల ఆధిక్యం సంపాదించారు. కానీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో రుమేనియా ఉన్నత న్యాయస్థానం ఆ ఎన్నిక ఫలితాన్ని రద్దుచేసి జార్జెస్కూను ఎన్నికల్లో పోటీకి అనర్హుడుగా ప్రకటించింది.

## 77 శాతం గాజా ఇజ్రాయెల్ స్వాధీనం : జర్నలిస్టు మృతి



**గాజాలో** ఇజ్రాయెల్ సైన్యం దాడుల బీభత్సాన్ని కొనసాగిస్తోంది. 77 శాతం గాజా ప్రాంతం ఇజ్రాయెల్ స్వాధీనంలోకి వెళ్ళిందని గాజా ప్రభుత్వ మీడియా ఆదివారంనాడు ప్రకటించింది. ఈ దాడుల్లో స్థానిక జర్నలిస్టు హస్సన్ మజ్దీ వార్తా మరణించారు. ఆయన కుటుంబంలో ఉన్న అనేకమంది కూడా మరణించారు. ఆదివారం తెల్లవారుజాము నుండీ జరిగిన దాడుల్లో 22 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఒకవైపు ఊచకోత కొనసాగుతుండగా, మరోవైపు ఆహార కొరత సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. గడచిన బుధవారం నుండీ గాజాలోకి 100 లారీలలో ఆహారాన్ని, మందినీటిని, ఇతర వస్తువులను గాజాలోకి ఇజ్రాయెల్ సైన్యం అనుమతించింది. కానీ ఒక్కరోజుకు 600 లారీలలో సహాయం వస్తేగానీ గాజాలో ప్రజల సమస్య పరిష్కారంకాదు. ఐయన నుండి వచ్చిన ఆహారమే పాలస్తీనా ప్రజలకు దిక్కు. గాజాలో 20 లక్షలమంది ప్రజలు కడుపులు నింపాలంటే బయట నుండి ఆహారసరఫరాలు రావాల్సిందే. ఈ ఏడాది మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఇజ్రాయెల్ అంతర్జాతీయ సహాయాన్ని అనుమతించకుండా అడ్డుకుంది. దీంతో ఐక్యరాజ్యసమితి, ఇతర సహాయ బృందాలు పంపిన 3,000 పైగా లారీలు గాజా సరిహద్దుల వెలుపల స్తంభించిపోయాయి. అంతర్జాతీయ చట్టాలను, నిబంధనలను సామూహికంగా ఉల్లంఘించి ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమాన్ని ఆపాలని ఐక్యరాజ్యసమితికి, అంతర్జాతీయ ప్రపంచానికి గాజా ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. 2023 సంవత్సరం అక్టోబరు 7 వ తేదీ నుండి జరుగుతున్న దాడుల్లో 53,000 మంది పాలస్తీనియన్లు మరణించగా, మరో 11,000 మంది మృతదేహాలు శిథిలాల్లోనే చిక్కుకుని ఉన్నాయి. మరో 1.22 లక్షలమంది యుద్ధంలో గాయపడ్డారు.

## భారత్‌లోకి రాకుండా 172 మంది బంగ్లాదేశీయులను అడ్డుకున్న బిఎస్ఎఫ్

**ఢాకా:** భారత భద్రతాదళాలు శనివారం రాత్రి నుండి 172 మంది బంగ్లాదేశీయులను మనదేశంలోకి ప్రవేశించకుండా వారి భూభాగంలోకి వెనక్కు నెట్టేసింది. మూడు జిల్లాలలో బంగ్లాదేశ్‌తో ఉన్న సరిహద్దు ప్రాంతాలనుండి వారిని భారత భద్రతా దళాలు వెనక్కు పంపేశాయి. మౌలోవీబజార్, సిల్హెట్, మౌల్వీబజార్ జిల్లాలలో ఉన్న సరిహద్దుల నుండి భారత్‌లోకి ప్రవేశించేందుకు బంగ్లాదేశీయులు ప్రయత్నం చేశారు. ఇటీవలికాలంలో రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు రెండు దేశాలమధ్యా ఉన్న విస్తారమైన సరిహద్దుల నుండి భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నం చేస్తుండగా, ఆ ప్రయత్నాలను భారత దళాలు అడ్డుకుని వారిని వెనక్కుపంపేస్తున్నాయి. బృందాలు, బృందాలుగా బంగ్లాదేశీయులు రాత్రిపూట భద్రతాదళాల కన్నుగప్పి భారత్‌లోకి ప్రవేశించేందుకు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ బృందాలు భారత్‌లోకి ప్రవేశించి కిదార్‌గంజ్ వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా బిఎస్ఎఫ్ బలగాలు వారిని పట్టుకుని వెనక్కుపంపాయి.

# కెసిఆర్ దేవుడు అంటూనే జీవ సమాధి చేసే ప్రయత్నం

### టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ దేవుడు అంటూనే ఆయన్ని జీవ సమాధి చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తండ్రి గురించి కవితకు పూర్తి అవగాహన లేకపోవడం దురదృష్టకరమన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ కుటుంబంలో, పార్టీలో లేఖ కలకలం రేగిందన్నారు. ఏ రాజకీయ పార్టీ లోనైనా అంతర్గత అంశాలు ఉంటాయన్నారు. కవిత లేఖ ద్వారా నష్టం జరుగుతుందనేది వారి కుటుంబ వ్యక్తిగత అంశమని, ఈ లేఖతో కెసిఆర్ కుటుంబంలో విభేదాలున్నాయనే భావన ఆ పార్టీ శ్రేణుల్లో కలుగుతుందన్నారు. కల్వకుంట్ల కవిత తండ్రి చాటు బిడ్డగా నాయకురాలు అయిందని, కవిత నేరుగా నాయకురాలు కాలేదన్నారు. రాజకీయంగా బలవంతురాలు కాదని అన్నారు. కవిత డిప్రెషన్‌లో లేఖలు విడుదల చేసిందన్నారు. కవిత లేఖలతో కాంగ్రెస్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. బిఆర్ఎస్‌ను చంపడం, బతికించుకోవడం వాళ్ళ వ్యక్తిగతమని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన కోణంలోనే కెసిఆర్‌కు పట్టం కట్టారని, తర్వాత అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. ఏ చరిత్ర చూసుకున్నా సాధారణంగా కుటుంబానికి కొడుకే వారసుడవుతాడని, కొడుకు లేని పక్షంలో కూతురు వారసురాలు అవుతుందన్నారు. కవిత రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపించదని, కెసిఆర్ కూతురు కాబట్టే కవిత ఎపిసోడ్ మీడియాకి ఆసక్తిగా మారిందన్నారు. కవిత లేఖ వల్ల బిఆర్ఎస్ ఓటు బ్యాంకు దెబ్బతినిపోయిందని చెప్పారు. కవిత లేఖ వల్ల కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుండో బలంగా ఉందని, భవిష్యత్‌లో కూడా అదే పటిష్టతతో కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ మొదటి స్థానంలో, బిఆర్ఎస్ రెండో స్థానంలో, బిజెపి మూడో స్థానంలో ఉన్నాయని చెప్పారు. కవిత రాసిన లేఖలు తమ రాజకీయ శత్రువైన బిజెపికి ఉపయోగపడతాయన్నదే తమ ఆందోళన అని జగ్గారెడ్డి అన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ వైపు ఆకర్షించేందుకు తగిన వ్యూహాన్ని ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షులతో చర్చించి అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులకు జగ్గారెడ్డి సూచించారు.

## భారీ వర్షాలు
(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉందన్నారు. ములుగు, భద్రాద్రిలలో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో గంటకు 30 నుండి 40 కిలోమీ. వేగంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. 29న రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. సాధారణంగా జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయి. కానీ ఈ ఏడాది 8 రోజులు ముందే తీరాన్ని తాకాయి. గత 16 సంవత్సరాలలో ఈ సారే కేరళలో రుతుపవనాలు తొలిసారిగా ప్రారంభమయ్యాయి.

## 93.87% ఉత్తీర్ణత
(మొదటి పేజీ తరువాయి)

దార శశికాంత్, మూడవ ర్యాంక్‌లో గండి శ్రీరామ్ మిత్ర ఉన్నారు. అలాగే కెమికల్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంక్ లెంక తేజ సాయికురామ్, సివిల్ ఇంజినీరింగ్‌లో గోల్కొండ నిఖిల్ కౌశిక్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో శ్రీకాంత్, ఎలక్ట్రానిక్స్&కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంక్ కట్టే రేవతి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంక్ కాసుల ప్రాంజలి. ఎలక్ట్రానిక్స్, ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌లో పోతూ గంట చందన, మెకానికల్ ఇంజినీరింగ్‌లో రావర్తి కార్తిక్ మెటలర్జికల్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంక్ తోట సుబ్రహ్మణ్యం నత్రా చాటారు. మైనింగ్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంక్ కుర్మా అక్షయ్, ఫార్మసీలో తొలి ర్యాంక్ బెల వందన ర్యాంక్ సాధించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విసి ప్రొఫెసర్ కుమార్ మొలుగురం, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని ఎవరు ప్రోత్సహించినా తీవ్ర పరిణామాలు
### లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

**జంషెడ్‌పూర్ /రాంచీ (జార్ఖండ్) :** భారతదేశ నేలపై ఉగ్రవాదాన్ని ఎవరు ప్రోత్సహించినా ఆపరేషన్ సిందూర్ కంటే తీవ్రస్థాయి పరిణామాలను చవి చూడాల్సి వస్తుందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉద్ఘాటించారు. సరిహద్దు వెంబడి లక్ష్యాలను చేదించడంలో భారత సైన్యం శౌర్యం, ధైర్యాన్ని ప్రశంసిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, భారతదేశం తనకు తానుగా రక్షించుకుంటుందని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కొత్త విధానాలు, కార్యక్రమాలను కూడా అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.జంషెడ్‌పూర్‌లోని సింగ్ భూమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎస్‌సిసిఐ)లో జరిగిన ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా హాజరైన వారిని ఉద్దేశించి ఓం బిర్లా ప్రసంగించారు. ప్రపంచంలో ఎక్కడైనా సరే ఉగ్రవాదాన్ని సమస్త్ నిర్మూలించాలన్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రణాళిక పిలుపునిచ్చారని ఆయన తెలిపారు. ఏదేశమైనా మన భూభాగంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే పరిణామాలు ఎలా ఉంటాయన్నది భారత సైన్యం నిరూపించిందన్నారు. అయితే ఇక ముందు అలాంటి పరిణామాలు ఆపరేషన్ సిందూర్ కంటే కూడా చాలా తీవ్రస్థాయిలో ఉంటాయని ఓం బిర్లా ఉద్ఘాటించారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం సాధించిన విజయానికి ఆయన స్వదేశీ రక్షణ పరిశ్రమను ప్రశంసించారు. గడచిన ఒక దశాబ్ద కాలంలో సాంకేతిక, వ్యూహాత్మక, నైపుణ్యం లోపించిన కారణంగా భారతదేశం రక్షణ సామగ్రిని దిగుమతి చేసుకునేదని, అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. భారతదేశం గ్లోబల్ స్వయం స్వావలంబన సాధించడమే కాకుండా రక్షణ సామాగ్రిని ఎగుమతి చేసే ప్రపంచ నాయకుడిగా ఎదిగిందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సంతోషాన్ని వ్యక్తం చేశారు. దేశీయ పరిశ్రమలకు మోడీజీ కొత్త దిశానిర్దేశం చేశారని, అంతేకాకుండా స్వయం స్వావలంబన అవసరమని ఆయన నొక్కిచెప్పారని తెలియజేశారు.ప్రబలంగా ఉన్నటువంటి పోటీ ప్రపంచ దృశ్యంలో భారతదేశం అవకాశాల భూమిగా వికాసిల్లుతున్నదని లోక్‌సభ స్పీకర్ నొక్కి చెప్పారు. మేధోశక్తి, సాంకేతికత, యువ, నైపుణ్య మానవ వనరులు ప్రపంచాన్ని నడిపించే సామర్థ్యం భారతదేశానికి మెండుగా ఉన్నదని ఆయన ప్రస్తుతించారు.

## బలగం అంజన్న కన్నుమూత



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రముఖ రంగస్థల కళాకారుడు,బలగం సినిమా నటుడు అంజన్న (జీవీ బాబు) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఆయన ఖాజా వరంగల్ లోని హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. కమెడియన్ వేణు యెల్దండి దర్శకత్వం, దిల్ రాజు ప్రొడక్ష న్ నుండి వచ్చిన సినిమాలో బాబు హీరో ప్రియదర్శి తాతగా నటించి ఆకట్టుకున్నారు. గత కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో డయాలసిస్ పొందుతున్నారు. ఈ మధ్యే బలగం డైరెక్టర్ వేణు యెల్దండి, హీరో ప్రియదర్శి జీవీ బాబు వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. బలగం చిత్ర బృందంలోని సభ్యులు బాబు కొయిత, ఆకునూరి దేవయ్య, బలగం కొమురమ్మలు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పి వచ్చారు. వేణు జీవీ బాబు సతీ మణితో ఫోన్లో మాట్లాడి ఓదార్చారు. జీవీ బాబుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఇంతలోనే ఆయన్ని మరణించడం బాధాకరమ ని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని డైరెక్టర్ వేణు యెల్దండి పేర్కొన్నారు. హీరో ప్రియదర్శి జీవీ బాబు మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.అంజన్న రంగస్థల నటుడు.. బలగం సినిమా తర్వాత రజాకార్ మూవీలో కూడా నటించారు. మొత్తం 20 సినిమాలకు పైగా నటించిన జీవీ బాబు.. బలగం చిత్రంతో గుర్తింపు పొందారు.

## ఇంకా మార్చురీలోనే
(మొదటి పేజీ తరువాయి)

శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని అక్కడి పోలీసులు ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇదే సమయంలో పౌర హక్కుల సంఘం, అమరవీరుల బంధుమిత్రుల సంఘం నంబాల మృత దేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నంబాల మృతదేహాన్ని అప్పగించాలని పోలీసులకు సూచించింది. కానీ ఛత్తీస్‌ఘడ్ అడ్వకేట్ జనరల్ మాత్రం ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎలా సూచనలు ఇస్తుందని ప్రశ్నించారు. దీంతో నంబాల మృతదేహం అప్పగింత మళ్లీ సమస్యాత్మకమైంది. ఇప్పటి వరకు ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రం నారాయణపూర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కేశవరావు మృతదేహం ఉన్నట్లు సమాచారం. ఎన్‌కౌంటర్ జరిగిన ఐదురోజులు కావడం నంబాల కేశవరావు మృతదేహాన్ని గుర్తించిన తర్వాత కూడా మృతదేహం అప్పగింతపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. బంధుమిత్రులు, పౌర హక్కుల సంఘాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాలని పనిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా మృతదేహాన్ని శ్రీకాకుళం తరలిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని మృతదేహాన్ని ఇక్కడకు తరలించ రాదని సుప్రీం కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నారని సమాచారం. మొత్తంగా మధ్య భారతంలో సాయుధ పోరాటానికి ఒక ఊపును, రూపును ఇచ్చిన నంబాల కేశవరావు మరణం, మృతదేహం అప్పగింత కూడా చర్చనీయాంశమే అయింది. ఎన్‌కౌంటర్‌లో మరణించ లేదని ఒడిశా ఆసుపత్రిలో షుగర్ వ్యాధికి చికిత్స పొందుతున్న కేశవరావును పట్టుకువచ్చి హింసించి చంపారని ఒక పక్క ఆరోపణలు, మరో వైపు మృతదేహం అప్పగింతపై రెండు ప్రభుత్వాలు కేశవరావు బంధుమిత్రుల మధ్య వివాదం నడుస్తుంది. దీనిపై అంతిమంగా ఎవరు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## హై అలర్ట్ (మొదటి పేజీ తరువాయి)

కంటైనర్ నౌక ఎంఎస్‌సి ఇఎల్‌ఎస్ఎ 3 (ఐఎంఒ. నం. ఆదివారం ఉదయం 07:50 గంటలకు కొచ్చి తీరంలో పడడం కారణంగా మునిగిపోయింది. వాటిలో 13 ప్రమాదకరమైన సరుకుతో కూడిన కంటైనర్లు, 12 కాల్షియం కార్బైడ్ కలిగి ఉన్నాయి. దీనిలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ కూడా లోడ్ చేయబడ్డాయని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 24 మంది సిబ్బందిలో 21 మందిని శనివారం ఇండియన్ కోస్ట్ గార్డ్ రక్షించింది, మిగిలిన ముగ్గురిని ఐఎన్ఎస్ ప్రారంభించిన రెస్క్యూ ఆపరేషన్‌లో చేరిన ఐఎన్ఎస్ సుజాత రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఒడ్డుకు కొట్టుకువచ్చే ఏదైనా కార్గోతో కంటైనర్లను లేదా చమురు చిందటాలను తాకవద్దని కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (కెఎస్‌డిఎంఎ) ప్రజలను హెచ్చరించింది. ఓడ మెరైన్ గ్యాస్ ఆయిల్, చాలా తక్కువ సల్ఫర్ ఇంధన నూనెను తీసుకువెళుతున్నట్లు కోస్ట్ గార్డ్ నిర్ధారించింది. లైబీరియన్ కంటైనర్ నౌక నుండి వచ్చిన డిస్ట్రెస్ కాల్ తర్వాత ఇండియన్ కోస్ట్ గార్డ్ ఓడలు, విమానాలను మోహరించి శనివారం రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించింది. రష్యా, ఉక్రెయిన్, జార్జియా, ఫిలిప్పీన్స్‌కు చెందిన పౌరులు సహా 24 మంది సిబ్బందిలో 21 మందిని రక్షించారు. రక్షణ ఏర్పాట్లలో సహాయం చేయడానికి ముగ్గురు సీనియర్ సిబ్బంది అక్కడే ఉన్నారని మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే, శనివారం రాత్రిపూట ఓడ పరిస్థితి క్షీణించింది, ఆదివారం బోల్తా పడిందని, ముగ్గురు సిబ్బందిని ఓడను వదిలివేయవలసి రాగా, ఐఎన్ఎస్ సుజాత వారిని రక్షించిందని మంత్రిత్వ శాఖ ప్రకటన తెలిపింది. 184 మీటర్ల పొడవున్న ఎంఎస్‌సి ఇఎల్‌ఎస్ఎ 3 అనే నౌక శుక్రవారం విజింజం ఓడరేవు నుండి కొచ్చికి బయలుదేరింది. 24న మధ్యాహ్నం 1.25 గంటల ప్రాంతంలో ఓడను కలిగి ఉన్న కంపెనీ 26 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గుతున్నట్లు భారత అధికారులకు తెలియజేసింది. అత్యవసర సహాయం కోరింది. కోస్ట్ గార్డ్ ప్రమాదంలో ఉన్న ఓడ సమీపంలో ఓడలు, విమానాలను మోహరించడం ద్వారా సహాయ కార్యకలాపాలను సమన్వయం చేసింది. ఓడలోని 24 మంది సభ్యుల సిబ్బందిలో ఒక రష్యన్ (ది మాస్టర్), 20 మంది ఫిలిప్పీన్స్, ఇద్దరు ఉక్రేనియన్లు, ఒక జార్జియన్ జాతీయుడు ఉన్నారు. కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ ప్రకారం... కంటైనర్లు, చమురుతో పాటు సరుకు ఒడ్డుకు కొట్టుకుపోయే అవకాశం ఉంది. తీరంలోని కొన్ని ప్రాంతాలలో చమురు పొరలు కనిపించవచ్చని కెఎస్‌డిఎంఎ హెచ్చరించింది.

## భారీ మార్పులు తెస్తాం
(మొదటి పేజీ తరువాయి)

ముగింపు కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మా ట్లాడారు. వైద్యులు కేవలం వృత్తి నిపుణులే కాదని, సమాజ శ్రేయస్సు కోసం పనిచేసే సేవాతత్పరులని కొనియాడారు. వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలకు వైద్యులు తెలిపిన సూచనలు, సమస్యలపై త్వరలోనే చర్చించేందుకు ఓ సమావేశాన్ని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ అమెండ్మెంట్, అనుమతులు, లైసెన్సింగ్, తదితర పరిపాలన సంబంధిత సమస్యలపై వైద్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభు త్వం సానుభూతితో చూస్తుందని తెలిపారు. వైద్యులు సమాజంలో పోషిస్తున్న పాత్రకు అండ గా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంద న్నా రు. తానాకాన్ 11వ రాష్ట్ర సదస్సు ద్వారా చెప్పిన వైద్యు లు తమ సమస్యలను సమగ్రంగా చర్చించుకోవడం హర్షణీయమని, ఇలాంటి వేదికలు ప్రభుత్వానికి చక్కటి సూచనలు అందించే అవకాశం కల్పిస్తాయని పేర్కొన్నారు. వైద్యులు సూచించిన సమస్యలను, జిల్లా స్థాయిలో పరిష్కరించేందుకు కలెక్టర్లతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా విద్యా, వైద్యం, ఆరోగ్యరంగాలకు ప్రాధాన్యతనిస్తూ భారీ స్థాయిలో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి మార్గంలో తీసుకెళ్లే విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. విద్యారంగ అభివృద్ధికి సంబంధించి ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయగా విద్యావిధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచి నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. వైద్యులు ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి రావ డం శుభపరిణామం అన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యానారాయణ(మానకొండూర్ ఎమ్మెల్యే), డా.హరీష్‌బాబు (సిర్పూర్ ఎమ్మెల్యే), డా.సంజయ్ (జగిత్యాల ఎమ్మెల్యే). డా.సంజయ్ (కోరుట్ల ఎమ్మెల్యే)లు మాట్లాడుతూ సామాన్యులకేకాకుండా అతి తక్కువ ధరలో వైద్యం అందిస్తున్న చిన్న మధ్యతరగతి హాస్పిటల్స్ 33 అనుమతులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌తో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వివిధ విభాగాల నుంచి పర్మిషన్ ఒకే వ్యవస్థ నుంచి తీసుకునే విధంగా ఉండాలని, వారి సమస్యలను పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వైద్యులు వైద్యాన్ని సామాజిక కోణంలో చూసి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం తానాకాన్ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఆర్గనైజింగ్ చైర్మన్ ఎలగందుల శ్రీనివాస్, కార్యదర్శి చాట్ల శ్రీధర్‌లు మాట్లాడుతూ చిన్న మధ్యతరగతి దవాఖానలు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీహార్, హర్యానా రాష్ట్రాలలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో సవరణలు చేశారని, తెలంగాణలోనూ చేయాలని కోరారు. ఈ సదస్సుకు 900 మంది వైద్యులు హాజరైనట్లు తెలిపారు. 50 పడకల ఆసుపత్రులకు అనుమతులను సరళీకరించాలని కోరా రు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ ట్రెజరర్ డాక్టర్ రాజ్‌కుమార్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా.ఎనమల్ల నరేష్, డా.మంగీలాల్, డా.సునీల్‌రెడ్డి, డా.మహేష్, డా.సూర్యనారాయణ రెడ్డి, డా.జగమోహన్ రావు, డా.బి.ఎన్.రావు, డా.విజేందర్‌రెడ్డి, డా.టికెల నాయుడు, డా.లక్ష్మణ్, డా.రఘురాం, డా.విజయ మోహన్‌రెడ్డి, డా.శ్రీలతరెడ్డి, డా.శైలజ, డా.మమత రెడ్డి, డా.వైనరేందర్, డా.జయరాం, డా.ఈ.శైలజ, డా.శేష శైలజ, డా.రవికాంత్, డా. రమణాచారి, డా.రామ్‌కిరణ్ తదితరులున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## శంషాబాద్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీ కొట్టిన లారీ
### కానిస్టేబుల్ మృతి..ఇద్దరు కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** బెంగళూరు హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న శంషాబాద్ వద్ద ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శంషాబాద్ సమీపంలో అదుపుతప్పి ఓ లారీ బోల్తాపడిందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అదే సమయంలో అతివేగంగా వచ్చిన మరో లారీ వెనక నుంచి పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్‌కుమార్ అనే కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. లారీ డ్రైవర్ మద్యం మత్తు, మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతి చెందిన కానిస్టేబుల్ విజయ్ కుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.

## మునీర్ మరణం అత్యంత బాధాకరం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సీనియర్ పాత్రికేయుడు ఎండి. మునీర్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. వృత్తి పట్ల నిబద్ధత, సామాజిక ఉద్యమాల పట్ల అంకిత భావం కలిగిన మునీర్ మరణం అత్యంత బాధాకరమన్నారు. వివిధ పత్రికల్లో పనిచేసిన మునీర్ సింగరేణికి సంబంధించి ఎన్నో విషయాల్లో ప్రజలను చైతన్యపరిచారన్నారు. మునీర్ మరణం పాత్రికేయలోకానికి తీరనిలోటు అని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ముఖ్యమంత్రి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఉత్తమ జర్నలిస్ట్‌ను కోల్పోయాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సీనియర్ జర్నలిస్ట్ మునీర్ మరణం బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మునీర్ మరణం పట్ల ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎఐటియుసి సీనియర్ నాయకుడు అబ్రహం నాయకత్వంలో మునీర్ ఎఐవైఎఫ్ నాయకుడిగా, క్రియాశీలకమైన నాయకుడిగా ఎదిగారన్నారు. ఆ తరుణంలో అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారని సాంబశివరావు తెలిపారు. కార్మికుల కోసం సమ్మె చేసిన సందర్భంలో దాదాపు ఏడుగురు కాల్పుల్లో చనిపోయారని, ఆ ఉద్యమానికి అబ్రహం, మునీర్ లాంటి వారు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఆ తర్వాత జర్నలిస్టుగా ప్రతిరోజు అనర్గళంగా వ్యాసాలు రాసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఏ అంశంపైనైనా వ్యాసాలు రాసే జర్నలిస్టుగా మంచి గుర్తింపు పొందారన్నారు. వ్యక్తిగతంగా తనకు 1980 నుండి సంబంధాలు ఉన్నాయని సాంబశివరావు చెప్పారు. ఉత్తమ కమ్యూనిస్టు నాయకుడు, ఉత్తమ కార్మిక నాయకుడు, ఉత్తమ జర్నలిస్టు, ఉత్తమ సామాజిక ఉద్యమకారున్ని కోల్పోవడం చాలా దురదృష్టకరమని అన్నారు.

## ఆకట్టుకొన్న 'నీల మేఘ శ్యామ' నృత్యరూపకం

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** దాదాపు 200 మంది విద్యార్థులు ప్రదర్శించిన 'నీల మేఘ శ్యామ' నృత్యరూపకం వీక్షకులను ఆకట్టుకొన్నది. గురు శ్రవ్యమానస ఆధ్వర్యంలో ప్రముఖ కూచిపూడి నృత్యకళా సంస్థ సుమధుర ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన వేసవి శిక్షణాశిబిరం ముగింపు వేడుక సందర్భంగా ఆదివారం రవీంద్రభారతిలో అంగరంగవైభవంగా ఈ నృత్యరూపక ప్రదర్శన జరిగింది. కృష్ణ భగవానుని లీలామృతంలోని కొన్ని ముఖ్యఘట్టాలను గురు శ్రవ్యమానస భోగిరెడ్డి తన శిష్యబృందంతో అద్భుతంగా రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా శిల్పారామం ప్రత్యేకాధికారి, రిటైర్డ్ ఐఎఎస్ జి.కిషన్‌రావు, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ ఎండి డా.కె.లక్ష్మి, ప్రముఖ సినీ నటులు విద్యార్థుల ప్రదర్శనను మంత్రముగ్ధులై ఆశీర్వదించారు. విద్యార్థులను మెమోంటోలతో సత్కరించారు.

## దేశ భవిష్యత్తు కోసమే ఇఫ్టా సాంస్కృతిక ఉద్యమం

### ఇఫ్టా జాతీయ ఉపాధ్యాక్షుడు కందిమల్ల ప్రతాపరెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ భవిష్యత్తు కోసం స్వాతంత్ర్య పోరాటంలో ఇండియన్ పిపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇఫ్టా) సాంస్కృతిక ఉద్యమం సాగించిందని ఇఫ్టా జాతీయ ఉపాధ్యాక్షుడు కందిమల్ల ప్రతాపరెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కళారూపాయాలతో జనంలో చైతన్యం నింపడం ద్వారా ఉద్యమ ఉధృతికి శ్రమించిందన్నారు. 'ఇఫ్టా' 83వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ హిమాయత్‌నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద 'ఇఫ్టా' జెండాను ఆయన ఎగురవేశారు. అంతకుముందు మాదాల రంగారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కందిమల్ల ప్రతాప రెడ్డి మాట్లాడుతూ 1943 మే 25న దేశంలో ఉన్నతమైన లక్ష్యాలతో ఇఫ్టా ప్రారంభమైందని తెలిపారు. యుద్ధాలకు వ్యతిరేకంగా శాంతి కోసం ప్రయత్నాలు చేసిందన్నారు. దేశ భవిష్యత్తు కోసం స్వాతంత్ర్య పోరాటంలో సాంస్కృతిక ఉద్యమం సాగించిందని చెప్పారు. నేడు కులం, మతం పేరిట ప్రజలు కొట్టుకుచస్తున్నారని, కులరహిత సమ సమాజం కోసం ప్రజాకళాకారులు తమ కళలు, సాహిత్యం ద్వారా చైత్యన్యవంతులను చేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రముఖ విప్లవ నటుడు, దర్శకుడు మాదాల రంగారావు జయంతి సందర్భంగా ఎర్రమల్లెలు, ఎర్ర సూర్యుడు, విప్లవ శంఖం సినిమాలలోని పాటలు పాడుతూ కళాకారులు నివాళులు అర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నం లక్ష్మీనారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి డి.వేణుగోపాల్ చారి, జనసేవాదళ్ నాయకుడు మురళీకృష్ణ ఎఐవైఎఫ్ హైదరాబాద్ నాయకులు కాంపల్లి కళ్యాణ్, పెరిమళ్ అనిల్ కుమార్, కళాకారులు రాము, శేఖర్, విజయ్‌కుమార్, సరస్వతి భాస్కర్, మహేష్, పరుశురాం, రమేష్ పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చేవిధంగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. హైదరాబాద్ హరిత హోటల్‌లో జరిగిన అభినందన సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా నేతృత్వంలో ప్రతినిధి బృందం వినతిపత్రం అందచేశారు. సత్యంను కార్మికులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రామ రాజేష్‌ఖన్నా, కార్యనిర్వాహక కార్యదర్శి నూర సంపత్ పటేల్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ క్యాడర్ ఫిక్సేషన్ చేసి, బేసిక్‌పే అమలు చేయాలని కోరారు. పిఎఫ్ ద్వారా ప్రతి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ ప్రయోజనాలలో పెన్షన్ విధానంలో ప్రతి ఉద్యోగికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా పెరిగిన నిత్యావసర ధరలు, పిల్లల చదువులకు తగ్గట్టుగా మూల వేతన సవరణ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 7 నెలల పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి విధి నిర్వహణలో మరణిస్తే, వారి కుటుంబంలో ఒకరికి ఆరు నెలలలోపు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులందరికీ సంవత్సరానికి 35 సాధారణ సెలవులు మంజూరు చేయాలని, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు కోరారు.



## మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సమగ్ర విచారణ

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ పేరుతో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం సరికాదని, ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిచే సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం చిగురుమమిడి మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్‌లో మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, అంతరాలు లేని సమసమాజ నిర్మాణం కోసం, పేదల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం సరైనది కాదన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అవుతుందని, పేదవాడి సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఉద్యోగ ఉపాధి కల్పించడంలో ఘోరంగా విఫలం చెందారని ఆరోపించారు. కార్పొరేట్ బడా పారిశ్రామిక వేత్తలకు ఊడిగంచేయడం తప్ప ప్రజలకు చేసిందేమీలేదని విమర్శించారు. పేదల కోసం పనిచేసే మావోయిస్టులను అంతం చేస్తున్నారని, పేదల డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్న మావోయిస్టులపై బిజెపి ప్రభుత్వ దమనకాండను మేధావులు, అభ్యుదయవాదులు ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడం మూలంగా అభివృద్ధి కుంటుపడిందని, తక్షణమే గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి, బోయిని సర్దార్ వల్లభాయ్ పటేల్, కాంతాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ కరీంనగర్ జిల్లా 23వ మహాసభలు ఈనెల 27, 28 తేదీలలో కరీంనగర్‌లోని మధు గార్డెన్‌లో జరుగుతాయని, మహాసభల విజయవంతం కొరకు కరపత్రాన్ని సిపిఐ జిల్లా, మండల నాయకులు ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరవుతున్నారని, మహాసభల విజయవంతం కోసం పార్టీ ఎంపిక చేయబడిన ప్రతినిధులంతా హాజరుకావాలని కోరారు.

## తెలంగాణకు బిజెపి సర్కార్ ద్రోహం

### ఎపిలోని అక్రమ ప్రాజెక్టులను తక్షణమే రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు ఆపాలి
### దిల్లీకి అఖిలపక్షాన్నయినా తీసుకెళ్లాలి
### మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి తీవ్ర ద్రోహం చేస్తోందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఎపిలోని అక్రమ ప్రాజెక్ట్‌లను తక్షణమే రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఆపాలని, లేదంటే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపైన ఢిల్లీలోని సిడబ్ల్యుసి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని, కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ నీతిని ఎండగడుతామని హరీశ్‌రావు హెచ్చరించారు. త్వరలోనే ప్రత్యేక శాసనసభ సమావేశాన్ని నిర్వహించి, బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి, ఆ తీర్మానాన్ని కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేయాలని, ఎంపిలు పార్లమెంట్‌లో గట్టిగా ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ అక్రమ ప్రాజెక్ట్‌ల విషయంలో బిజెపి కేంద్ర మంత్రులు ఆలోచించాలని, కాంగ్రెస్ మొద్దు నిద్ర వీడాలని, రాష్ట్ర హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇవ్వబోదని, కానీ ఎపిలో ప్రాజెక్టులకు అనుమతులు లేకపోయినప్పటికీ కేంద్రం నిధుల కనకవర్షం కురిపిస్తోందని, ఇదెక్కడి నీతి అని నిలదీశారు. పోలవరం ప్రాజెక్ట్‌కు రూ.80వేల కోట్లు, బనకచర్లకు రూ.80వేల కోట్లు మొత్తం రూ.1,60,000 కోట్లు ఎపికి ఇస్తారని, కానీ ఒక్క శాతమైనా తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్ట్‌లకు ఇచ్చారా? అని నిలదీశారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బిజెపి ఎంపిలు ఉండి ఏం లాభమన్నారు. కాళేశ్వరం కోసం తాము ఆర్ఇసి, పిఎఫ్‌సి నుంచి రుణాలు తీసుకొచ్చామని, ఎఫ్ఆర్‌బిఎం కంటే అదనంగా ఉన్నదని కేంద్రం రికవరీ పెట్టిందని, ఎపికి మాత్రం ఎఫ్ఆర్‌బిఎం పరిధి దాటి రుణాలు తెచ్చుకునే అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ పట్ల బిజెపికి కక్ష, సవతి తల్లి ప్రేమ ఏమిటని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చారని, కానీ కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ప్రాజెక్టులకు ఎందుకు జాతీయ హోదా ఇవ్వలేదని ప్రశ్నించారు. గోదావరి ట్రిబ్యునల్ వచ్చే లోపే బనకచర్ల ప్రాజెక్ట్‌ను నిర్మించి, ప్రజాధనం ఖర్చు చేశామని, అందుకే నీళ్లు కేటాయించాలని చెప్పి, 200 టిఎంసిలు తీసుకునేందుకు ఎపి కుట్ర చేస్తోందని ఆరోపించారు. దీనిని కూడా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడంలేదని, కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా ఉండి ఏం చేస్తున్నారని నిలదీశారు.

**నీతి ఆయోగ్‌లో ఎందుకు ప్రశ్నించలేదు :** నీతి ఆయోగ్‌ను బహిష్కరిస్తామని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి, ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరయ్యారని, ఈ సమావేశంలో బనకచర్ల ప్రాజెక్ట్ అంశంపై నీతి ఆయోగ్‌లో ఎందుకు మాట్లాడలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. గోదావరి మీద కూడా భవిష్యత్తులో కొత్త ట్రిబ్యునల్ వస్తుందని భావించి, ప్రాణహిత ప్రాజెక్ట్‌కు 160 టిఎంసిల నీటి కేటాయింపులు ఉంటే, కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు 240 టిఎంసిల నీటి కేటాయింపులు చేశామని వివరించారు. దేవాదుల 38 నుంచి 60 టిఎంసిలకు, సీతమ్మ సాగర్‌కు 67 టిఎంసిలు, సమ్మక్కసాగర్‌కు 47 టిఎంసిలు, చనాఖా కొరాటాకు 5, వార్ధా 5 టిఎంసి అంటే మొత్తం 969 టిఎంసిలలో 950 టిఎంసిలు కేటాయించి, పూర్తి చేశామని, మరి కొన్ని ప్రాసెస్‌లో ఉన్నాయని తెలిపారు. కృష్ణాలో తాత్కాలిక ఒప్పందం ప్రకారం, 34శాతం నీటి కేటాయింపులు ఉన్నాయని, కానీ సిఎం రేవంత్ చేతగాని తనంతోనే తెలంగాణ 65 టిఎంసిల నీళ్లను తక్కువ వాడుకున్నదన్నారు. 27 శాతం మాత్రమే వాడుకున్నదని, చరిత్రలో ఇది అత్యల్పమని, చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.

## పాటలతో పోరాడటానికి ప్రజలను సిద్ధంచేయాలి

### పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం
### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** పాటలతో ప్రజలను చైతన్యపరిచి పోరాటాలకు ప్రజలను సిద్ధం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రజానాట్యమండలి 83వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సువర్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజానాట్యమండలి ప్రజలను చైతన్యపరిచిందని అన్నారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు పాటలు, నాటికలు, కథల రూపంలో ఎలుగెత్తి చాటిందన్నారు. దేశంలో ఇఫ్టా, ప్రజానాట్యమండలికి గొప్ప చరిత్ర ఉందని, ఎందరో కళాకారులను తయారు చేసిన చరిత్ర ప్రజానాట్యమండలిదేనని అన్నారు. దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా వామపక్ష, అభ్యుదయ శక్తులకు అండగా ప్రజానాట్యమండలి నిలిచిందన్నారు. దేశంలో కార్పొరేట్, పెట్టుబడి దారులకు మోదీ ప్రభుత్వం ప్రజల సంపదను ధారాదత్తం చేస్తూ ప్రజల సంక్షేమాన్ని విస్మరించందని అన్నారు. రానున్న రోజులలో పెట్టబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలుస్తారని చెప్పారు. ఈ దిశగా ప్రజానాట్యమండలి కళాకారులు ప్రజలను మరింతగా చైతన్యపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.బాష్‌మియా, ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షుడు గన్నారపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర క్రిష్ణ, ఉపాధ్యక్షులు ఆరెల్లి రవి, దండు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో కళాకారులకు, షీల్డ్‌లను, ప్రశంసాపత్రాలను అందించారు. తొలుత ప్రజానాట్యమండలి జెండాను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఎగురవేశారు.

## వెల్ఫేర్ బోర్డు కమిటీ సమావేశం రద్దు చేయాల్సిందే

### ప్రైవేట్ ఏజెన్సీలతో ఉద్యోగ నియామకాలు నిలిపేయాలి
### మంత్రి పొన్నం ప్రభాకర్ హామీతో సమ్మె వాయిదా
### జూన్ 2లోపు జెఎసికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి
### లేదంటే మళ్లీ సమ్మె బాటపడుతాం
### టిజిఎస్ ఆర్‌టిసి చైర్మన్ ఈదురు వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వెల్ఫేర్ బోర్డు కమిటీ సమావేశం రద్దు చేయాలని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్, (ఇయు ప్రధాన కార్యదర్శి) ఈదురు వెంకన్న, కోచైర్మన్, (టిజెఎంయు ప్రధాన కార్యదర్శి) హనుమంత్ ముదిరాజ్, వైఎస్ చైర్మన్, (టిఎంయు ప్రధాన కార్యదర్శి) ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్, (ఎన్ఎంయు ప్రధాన కార్యదర్శి) ఎండి. మౌలానా, కోకన్వీనర్, (బికెయు ప్రధాన కార్యదర్శి) కత్తుల యాదయ్య, కోకన్వీనర్, (బిడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి) సుద్దాల సురేష్, కోకన్వీనర్, (కెపి ప్రధాన కార్యదర్శి) బి.యాదగిరి అన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్, డ్రైవర్‌లను నియమించే విధానం మానుకోవాలని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన సచివాలయంలో జెఎసి నాయకులతో జరిగిన చర్చల సందర్భంగా రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలలో యూనియన్‌ల పునరుద్ధరణ అంశం కూడా ఉందని తెలిపారు. మంత్రి ఇచ్చిన హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశామని, అయినా ఆర్‌టిసి యాజమాన్యం వెల్ఫేర్ బోర్డ్ సమావేశం నిర్వహణ కోసం సర్క్యులర్ జారీ చేయడం పుండు మీద కారం చల్లడమేనని విమర్శించారు. అలాగే ఈ సర్క్యులర్‌తో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అడ్డు పడే విధంగా ఉందని జెఎసి భావిస్తుందన్నారు. లేనియెడల మళ్ళీ సమ్మె బాట పడుతామని జెఎసి నేతలు హెచ్చరించారు. జూన్ 2 తేదీ వరకు ప్రభుత్వం జెఎసికి ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో మళ్ళీ సమ్మె వైపు వెళతామని, దీనికి పూర్తి బాధ్యత ఆర్‌టిసి యాజమాన్యం వహించాల్సి వస్తుందని జెఎసి నేతలు హెచ్చరించారు.

## మన బహుళ అంతస్తులు పదిలమేనా?

### వరుస అగ్ని ప్రమాదాలతో ప్రజల్లో ఆందోళన
### కొరవడిన పర్యవేక్షణ
### కాసులతో ముడిపడిన నిరభ్యంతర ధృవీకరణ



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో హైదరాబాద్ మహానగరం తర్వాత బహుళ అంతస్తుల భవనాలు ఖమ్మం నగరంలోనే ఎక్కువ. హైదరాబాద్ సహా పలు నగరాల్లో జరుగుతున్న వరుస అగ్నిప్రమాదాలు, ఆ సందర్భంగా జరుగుతున్న మరణాలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మన భవనాలు పదిలమేనా అన్న భావన బహుళ అంతస్తుల భవనాల్లో నివసిస్తున్న వారిలో కలుగుతుంది. ఖమ్మం నగరంలో విద్యాలయాలు, ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్, కార్పొరేట్ కార్యాలయాలు అన్నింటికీ మించి నగరంలో 20 శాతానికి పైగా జనం బహుళ అంతస్తుల్లో నివసిస్తున్నారు. ప్రాథమిక విద్యను అందిస్తున్న పలు ప్రైవేటు విద్యాలయాలు సైతం బహుళ అంతస్తుల భవనాల్లో నిర్వహిస్తున్నారు.

నగరంలో విస్తరించిన బహుళ అంతస్తుల నిర్మాణాల్లో అగ్ని ప్రమాదాల నియంత్రకాల ఏర్పాటు ఎలా ఉంది అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు రక్షణ చర్యలు చేపట్టే వ్యవస్థను ఏర్పాటు చేశారా, అవి పనిచేస్తున్నాయా వీటిని పర్యవేక్షించాల్సిన ఫైర్‌సేఫ్టీ అధికారులు పర్యవేక్షిస్తున్నారా అంటే అన్ని ప్రభుత్వ విభాగాల మాదిరిగానే ఈ వ్యవస్థ తయారైందన్న సమాచారం. పసి పిల్లలు చదివే విద్యాలయాలు కమర్షియల్ కాంప్లెక్స్‌లపైన మూడు, నాలుగు అంతస్తుల్లో నిర్వహిస్తుంటే ఆట స్థలం సహా అన్ని ఉన్నట్లు విద్యాశాఖాధికారులు ధృవీకరిస్తున్నారు. అలాగే అగ్నిప్రమాద నిరోధక వ్యవస్థ లేకుండానే అంతా సక్రమంగా ఉన్నట్లు ఫైర్ సేఫ్టీ అధికారులు ధృవీకరిస్తున్నారు. ఖమ్మం నగరంలో ఆసుపత్రులన్నీ బహుళ అంతస్తుల భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వీటన్నింటిలో అగ్నిప్రమాద హెచ్చరిక సామాగ్రిని అమర్చారా, అగ్ని ప్రమాదం జరిగితే రోగులు ప్రాణాలు కోల్పోకుండా కాపాడే వ్యవస్థ ఉందా అంటే ఆలోచిస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాలకు సంబంధించి పైన అంతస్తులు నిర్మాణంలో ఉండగానే క్రింది అంతస్తుల్లో విద్యాలయాలు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటికి అనుమతులు ఎలా తీసుకున్నారు, ఎలా ఇచ్చారన్న ప్రశ్నకు సమాధానం దొరకదు. కానీ ఖమ్మంలో నిర్మించిన బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి అన్నింటికీ అగ్నిప్రమాద నిరోధకాలు ఏర్పాటు చేసినట్లు, భవనంలో ఎక్కడ ప్రమాదం జరిగినా అందరికీ తెలిసేవిధంగా అలారం సిస్టం ఏర్పాటు చేసినట్లు భవన యజమానుల వద్ద ఫైర్ స్టేఫీ అధికారులు ఇచ్చిన ధృవీకరణ పత్రాలు మాత్రమే ఉన్నాయి. ఏమి ఉన్నా లేకపోయినా కాసులతో ఫైర్ సేఫ్టీ ధృవీకరణను తెచ్చుకోవచ్చునన్న భావనను భవన నిర్మాణ సంస్థల్లోనూ, యజమానుల్లోనూ బలపడింది. ఇది ప్రాణాలతో చెలగాటమనే విషయాన్ని అధికార యంత్రాంగం మరిచిపోతుంది. ఇటీవల బుర్హాన్‌పురంలో ఒక బహుళ అంతస్తుల భవనంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి పొగ కమ్ముకుంటే ఏమీచేయలేని స్థితి. ఆ సమయంలో భవనంలో ఎవరూ లేరు కాబట్టి సరిపోయింది. ఒకవేళ ఉండి ఉంటే పరిస్థితి ఏమిటన్నదానికి సమాధానమే లేదు. తక్షణ అవసరం లేకపోయినా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి అమర్చినట్లు, శారీరక వైకల్యం లేకపోయినా పరీక్షించకుండా 50 శాతం అంగవైకల్యం ఉన్నట్లు ధృవీకరించినట్లు, అంతా బాగున్నా ఆపరేషన్ అవసరం సెలవు మంజూరు చేస్తే మంచిదని వైద్యుడు ధృవీకరించి మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు ఫైర్‌సేఫ్టీ అధికారులు సైతం భవనాలు పరిశీలించకుండానే కార్యాలయాల్లో తమను తృప్తిపరిస్తే ధృవీకరణ ఇచ్చేస్తున్నారు. ఖమ్మం నగరంలో ఎన్ని బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి, ఎన్నింట్లో ఫైర్‌సేఫ్టీ సిస్టం ఉందా అని పరిశీలిస్తే మన అధికారుల తీరు బయటపడుతుంది. ఇప్పటివరకు ప్రమాదాలు జరగలేదు కాబట్టి సరిపోయింది. జరిగితే...? మొన్న హైదరాబాద్ అగ్ని ప్రమాద ఘటన తర్వాతనైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

బహుళ అంతస్తుల భవనాల్లో సిసి కెమెరాలు అనుమతి తప్పనిసరి అని పోలీస్ శాఖ హెచ్చరించి ఆయా భవన యజమానులు, నివాసితులతో సమావేశాలు ఏర్పాటు చేసినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఇప్పటికైనా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న సామెతలా కాకుండా బహుళ అంతస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి ఫైర్ సేఫ్టీ సిస్టం ఏర్పాటు చేసేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# సాహితీ విహారి

## కాలాతీత కవిత

రాజకీయ, ఆర్థిక, సామాజిక సిద్ధాంతాలపై వెరపులేని అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పే కవిత్వం కలకాలం నిలిచివుంటుంది. ఛత్తీస్‌గఢ్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలు సాయుధ పోరాటం మాత్రమే ప్రజారాజ్యానికి పునాది వేస్తుందనే సిద్ధాంతంపై మరోసారి చర్చకు దారితీశాయి. తుపాకీ గొట్టం ద్వారానే స్వేచ్ఛ సాధ్యమని నమ్మిన ఎంతో మంది సాయుధ ఉద్యమాల్లోకి వెళ్లడం, వివిధ ఘటనల్లో ప్రాణాలు కోల్పోవడం దశాబ్దాలుగా జరుగుతునే ఉంది. వారు త్యాగాలు చేస్తున్న మాట వాస్తవమేగానీ, అవి అడవిలో కాసిన వెన్నల అవుతున్నదని సుమారు దశాబ్దం క్రితమే రాసిన కవితలో రచయిత 'చంద్రశేఖర్' ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులకు సైతం అద్దం పడుతున్న ఆ కవిత కాలానికి అతీతం. సాధ్యాసాధ్యాలను ఆలోచించకుండా, పోతున్న ప్రాణాలను కాపాడే ప్రయత్నాలు చేయకుండా, ఎన్‌కౌంటర్లలో నేలకొరిగిన తర్వాత ఎన్ని మాటలు చెప్తేనేం? ఎన్ని ప్రసంగాలు చేస్తేనేం? పరోక్షంగా ఇలాంటి ఎన్నో ప్రశ్నలు సంధించిన రచయిత, ఈ కవితలో ఉపయోగించిన భాష, తొణికించిన భావం, కనబరచిన స్థైర్యం అనన్యసామాన్యం. అందుకే, ఇది కాలాతీత కవిత్వమైంది.

అడవి కాదు, హృదయం దుఃఖిస్తున్నది
మీరిప్పుడు సంతాపాలు ప్రకటిస్తున్నరు
నేనెప్పుడో ఆశలు వదులుకున్న
ఆ చైతన్యం తిరిగిరాదని దిగులుతో
మీరిప్పుడు కన్నీరు కార్చుతున్నరు
నా కళ్లెప్పుడో ఎండిపోయాయి
ఆ పాట ఇక వినిపించదని తెలిసి
మీరిప్పుడు వారి త్యాగాలను కీర్తిస్తున్నరు
నాకు ముందే తెలుస్తున్నది
అది త్యాగం కాదని, అడవిలో కాసిన వెన్నెలని
మీరిప్పుడు వారు నిరాయుధులని చెబుతున్నరు
నాకే కాదు లోకానికంతా తెలుసు
ఆయుధం కోసమే అడవికి వెళ్లారని



యుద్ధం కోసమే సన్నద్ధులవుతారని
యుద్ధంలో నీతీ గీతీ ఉండదని
ఆయుధానికి భాష ధ్యాస ఉండవని
మీరిప్పుడు వాళ్ళను కీర్తిస్తరు
వాళ్ళు దివిటీలని, పతాకాలనీ ఊరేగిస్తారు
ఒళ్ళు ఊళ్లు కదలకుండా
ఏసీ గదులు వదలకుండా
మరికొన్ని మిడుతలు ఆర్తిగా, ఆవేశంగా
ఆ వెలుగులను ముద్దాడుతాయి
ఇంకొన్నాళ్ళకి ఇదే దృశ్యం, ఇవే కన్నీళ్లు
మీదేం పోయింది
ఒక సభ, ఒక సంతాపం, వస్తే ఒక కన్నీటి చుక్క
రాస్తే ఒక వ్యాసం, చేస్తే ఒక ఉపన్యాసం
కాలు కదిలేది లేదు, ఖర్చయ్యేది లేదు
వాళ్ళది తెలియని ఆవేశం
మీది తెలిసి తెలిసీ పదే పదే ప్రదర్శించే నాటకం
తుపాకీ చేతబట్టిన ఆశయానికి విలువలేదు
ఆశయాన్ని మించిన తుపాకీ పుట్టలేదు
ఇదెప్పుడు తెలుసుకుంటారు మిత్రమా?

– చంద్రశేఖర్
(2016, సెప్టెంబర్ 17న రాసిన కవిత/ సోషల్ మీడియా నుంచి సేకరణ)

# వర్తమానంతోనే ఇస్మాయిల్ సహవాసం

ఇస్మాయిల్ పేరు తెలుగు సాహిత్యంలో నిలిచిపోవడానికి జపనీస్ సాహిత్యంలోని కవితా ప్రక్రియ 'హైకూ'ను పరిచయం చేయడం ఒక కారణమైతే, వర్తమానంతోనే సహవాసం చేయడం మరో కారణం. ఆయనకు గతం గురించి విచారం లేదు. భవిష్యత్తుపై ఆందోళన లేదు. ఉన్నదంతా 'నేడు' మాత్రమే. సమకాలీన అంశాలకు ప్రాధాన్యతనిచ్చిన ప్రముఖ తెలుగు కవి, సాహితీ విమర్శకుడు, తత్వశాస్త్ర అధ్యాపకుడు ఇస్మాయిల్‌కు 'చెట్టు కవి' అనే పేరుంది. 'చెట్టు నా ఆదర్శం', 'చిలకలు వాలిన చెట్టు', 'మృత్యుపక్షం', 'కప్పల నిశ్శబ్దం' (హైకూలు), 'ఆదర్శం', 'బాల్చీలో చంద్రోదయం', 'రాత్రివచ్చిన రహస్యపు వాన', 'కరుణ ముఖ్యం' వంటి ఎన్నో రచనలు ఆయన కీర్తిపతకాన్ని రెపరెపలాడించాయి. 'మృత్యుపక్షం' కవితా సంకలనానికి ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం లభించింది. నేడు ప్రపంచం మొత్తం యుద్ధ భయంతో వణికిపోతున్న నేపథ్యంలో ఆయన మాటలను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. 'బుద్ధిగా ప్రేమించుకోక యుద్ధాలెందుకు చేస్తారో నాకు అర్థం కాదు' అంటారు ఆయన. ప్రేమించిన చోట ద్వేషాలు ఉండవు... యుద్ధాల ప్రసక్తి లేనేలేదు. ఇస్మాయిల్ కాకినాడ పిఆర్ గవర్నమెంటు కాలేజీలో చాలా కాలం ఫిలాసఫీ లెక్చరరుగా పని చేసి, కాలేజీ ప్రిన్సిపాలుగా పదవీవిరమణ చేశారు. కొంత కాలం అధికార భాషా సంఘం సభ్యునిగా కూడా ఉన్నారు. ఆరు కవితా సంకలనాలు, రెండు వ్యాస సంకలనాలు, 'రెండో ప్రతిపాదన' అనే పేరుతో ఇతర భాషలనుండి అనువదించిన కవితల సంకలనం ప్రచురించారు. జీవిత సత్యాలను ఇస్మాయిల్ అర్థం చేసుకోవడమేకాదు.. వాటిని తన కవిత్వంలో పొందుపరిచారు. గతం ఎప్పటికీ తిరిగి రాదు.. మృత్యువు ఏదో ఒకరోజు రాక మానదు. గతాన్ని మార్చలేం. భవిష్యత్తు ఎలా ఉంటుందో అంతుబట్టదు. ఇలాంటి పరిస్థితుల్లో వర్తమానాన్ని విడిచిపెట్టి, అనవసర మానసికోద్రేకాలు ఎందుకన్నది ఆయన ప్రశ్న. అందుకే, ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన కవితాన్ని అందించగలిగారు. మనుషులతో మాత్రమేకాదు.. సకల చరాచర సృష్టితోనూ ఇస్మాయిల్ మమేకమయ్యారు. సెలయేర్లతో మాట్లాడడం, చెట్లతో ఆప్యాయంగా కబుర్లు చెప్పడం ఆయనకు మాత్రమే సాధ్యమైంది. 'ఎరుపెక్కిన సంధ్య.. నలుపెక్కి వచ్చే నిరాశాంధం' ఆయన దృష్టిలో ఒకటే. ఏవీ తన మనస్సులో ఆనందాన్ని అడ్డుకోలేవని స్పష్టం చేస్తారు. పిల్లలపై ఇస్మాయిల్‌కు అవాజ్య ప్రేమ ఉందని ఆయన రాసిన అనేక కవితలు, పద్యాలు చెప్పకనే చెప్తున్నాయి. వర్షంలో పిల్లలు ఆడుకోవడాన్ని ప్రస్తావిస్తూ,

**'ఎవరి కోసం వర్షిస్తాయి మేఘాలు..**
**పిల్లల కోసం కాకపోతే**
**గొడుగులడ్డు పెట్టుకునే వాళ్ళ కోసమా?'** అనడంలో ఆయనే చిన్న పిల్లవాడిగా మారిన విధానం మన కళ్ల ముందు సాక్షాత్కారమవుతుంది.

**'పిట్టల్ని తోలమని**
**పాపని కాపలా పెడితే**
**కాకుల్తో స్నేహం చేస్తోంది'** అంటారు మరో హైకూలో. ఎల్లలు లేని ప్రేలకు సజీవ రూపాలైన పిల్లలు అంతే,,, పక్షులతో స్నేహం చేస్తారు. ఆడుకునే సమయంలో మట్టి మనుషులవుతారు. పిల్లలను ప్రేమించినా... ప్రకృతిని ఆరాధించినా... 'సెంటిమెంట్' ఆయన సాహిత్యంలో ఎక్కడా కనిపించదు. న్యాయానికి తెలుగు మాత్రమేకాదు... ప్రపంచ సాహిత్యం మొత్తంలో ఎక్కడ వెతికినా ఏదో ఒక రకమైన సెంటిమెంటుతో జతకలిసిన రచనలే కనిపిస్తాయి. కానీ, ఇస్మాయిల్‌కు సెంటిమెంట్‌ను పండించడం కంటే, వాస్తవాలను ప్రస్తావించడం అంటేనే ఇష్టం. భవిష్యత్తు గురించి ఆందోళన చెందడంగానీ, మృత్యువు గురించా ఆలోచించడంగానీ నచ్చకపోయినప్పటికీ, 'మృత్యువృక్షం'లో ఆయన స్థూలంగా ఈ అంశాన్ని ప్రస్తావిస్తారు. చివరికి మిగిలేది ఏమీ ఉండదని పేర్కొంటూ, వర్తమానానికి ఉన్న ప్రాధాన్యతను చాటిచెప్పారు. ఇస్మాయిల్ కవిత్వంలో మరో ప్రధాన లక్షణం 'పోలిక' లేకపోవడం. ఆయన ఏదైనా అంశాన్నిగానీ, వివరణనుగానీ మరే ఇతర అంశాలతో పోల్చరు. అలాంటి పోలిక లేకపోవడంతో, ఇస్మాయిల్ కవితల్లోని ప్రతి భావం స్వతంత్రమైనదే. పోలిక వెన్నంటే విమర్శలు ఉంటాయి. పోలికే లేనప్పుడు విమర్శలకు తావెక్కడ? ఎవరికీ చిక్కని రీతిలో చక్కని, చిక్కని భావంతో కవిత్వం రాసిన ఇస్మాయిల్‌ను కొంత మంది అనుభూతి కవిగా పేర్కొన్నారు. ఇక్కడ ఒక విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించుకోవాలి. ఆయన రాసిన అనుభూతి కవితలు ఏదైనా ఒక ప్రత్యేక సందర్భానికి లేదా ఒక చిన్న ఘటనకు సంబంధించినవి మాత్రమే. విస్తారమైన అంశాలను ఆయన వస్తువుగా చేసుకోలేదు. 'దాహం' లేదా 'టీ తేవడం' లేదా 'నిద్ర నుంచి ఉలిక్కిపడి లేవడం' వంటి సాధారణ ఘటనలను కూడా ఆయన తన కవిత్వంలో చేర్చుకున్నారు.

**'కుక్కపిల్లా.. అగ్గిపుల్లా.. సబ్బుబిళ్లా**
**హీనంగా చూడకు దేన్నీ**
**కవితామయమేనోయ్ అన్నీ'** అన్న మహాకవి శ్రీశ్రీ భావాన్ని ఆచరణలో చూపారు ఇస్మాయిల్. ఒక ఆలోచనను మాత్రమే ప్రతిబింబించేందుకు చేసిన ప్రయత్నాలు, ఒక్కో సమయంలో కవి నిర్దేశించుకున్న పరిధులు దాటి పరుగులు తీస్తాయి. 'స్వేచ్ఛాగానం' ఇందుకు ఓ చక్కని ఉదాహరణ. నిజానికి ఒకదానితో మరొక అంశం ముడిపడి ఉంటుందనేది ఆయన ఎంచుకున్న అంశం. 'స్వేచ్ఛాగానం' అని పేరు ఉన్నప్పటికీ, బంధనాలను వివరిస్తూ వెళతారు కవి.

**'దివిలో ఊగే విహంగాన్ని**
**భువిలో పాకే పురుగు బంధిస్తుంది**
**గడియేని ఆగని సూర్యుణ్ణి**
**గడియారపు బాహువులు బంధిస్తాయి'** అంటూ ఈ స్వేచ్ఛాగానం మొదలవుతుంది. పీతదెక్కల చంద్రుణ్ణి చేతులెత్తే సముద్రం బంధిస్తుందన్న ఊహ గొప్పగా ఉంటుంది. గలగలలాడే తరంగాల్ని జలకాలాడే అంగాలు బంధిస్తాయని అంటారు ఇస్మాయిల్. బండి చక్రం ఎప్పుడూ తన చుట్టూ తాను తిరుగుతుంది. అయితే, మలుపులు తిరిగే రోడ్డు ఆ చక్రాన్ని బంధిస్తుందని పేర్కొంటారు కవి. అంతేకాదు... తెగవాగే జలపాతపు నాలికలను, సెగలెగిసే గ్రీష్మం అదే విధంగా, మడలు పడ్డ ముసలి సాయంత్రాన్ని మాటలురాని కాలవ బంధిస్తాయట. రాత్రి వచ్చిన రహస్యపు వాన తనను ఎవరూ చూడలేదనుకుంటుంది... కానీ, నేలలోని వ్రేళ్ల వర్షాన్ని బంధిస్తాయంటారు ఇస్మాయిల్. చివరిలో..


**'గురి మరచిన గాలి బాణాన్ని**
**తెరలెత్తిన నౌకా ధనస్సు బంధిస్తుంది**
**ఈ మనిషి ఆ మనిషిని బంధిస్తాడు**
**ఇద్దర్నీ బంధిస్తుంది మనీష'** అంటూ బంధనాలను బహు చక్కగా ముగించారు. ఆయన కవితల్లో ఇలాంటి చమక్కులు ఎన్నో. చిన్నచిన్న వాక్యాల్లో అంతులేని అర్థాలను వివరించే శక్తి ఇస్మాయిల్ వంటి సమర్థులకు మాత్రమే ఉంటుంది.

**'వికట ప్రతిబింబాల**
**అద్దాల చెరసాల**
**బందీని నేనే**
**బందిఖానాని నేనే'** అనడంలో మనిషి తన పరిమిత ఆలోచనలు... చేష్టలతో ఎంతగా కుదించుకుపోయాడో వివరిస్తారు.




**'బైట ఉండాల్సినవేమిటో**
**లోన ఉండాల్సినవేమిటో**
**అన్నీ నాకు తెలుసు.**
**ఐతే,ఈ కిటికీకి ఇక్కడేం పని?'** అని గోడతో ప్రశ్నింప చేసిన వైనం అద్భుతం. మనకు అవసరమైనవి మనమే ఎంచుకుంటాం... మనుషులు కావచ్చు... వస్తువులు కావచ్చు... పరిసరాలు కావచ్చు.. ఏవైనా, ఏదైనా అంతే. కానీ, ఎంచుకున్న దాని తో తృప్తిపడని జీవితాలు మనవి. మనం విడిచిపెట్టిన జీవితాల్లోకి తొంగిచూసే వైనం మనది. అందుకే, గోడ పెట్టి విడదీసినప్పటికీ, కిటికీ పెట్టి బయట కు తొంగిచూసే దైన్యం మనది. గొప్ప తాత్వికతను ఇంత సరళంగా చెప్పడం ఇస్మాయిల్‌కే సాధ్యం. స్థూలంగా పరిశీలిస్తే ఇస్మాయిల్ కవిత్వంలో గాఢత ఉంటుంది. సరళత కూడా ఉంటుంది. అన్నిటినీ మించి స్పష్టత ఉంటుంది. ఎవరికీ అర్థంగాని భాషను ప్రయోగిస్తూ, అంతుచిక్కని భావాన్ని ప్రదర్శిస్తూ చాలా మంది కవులు తమను తాము మేధావులుగా ముద్ర వేసుకుంటున్న తరుణంలో ఇస్మాయిల్ కవిత్వం పాఠకులకు ఆటవిడుపు. సంక్లిష్ట పదప్రయోగాల గ్రీష్మతాపంలో వాడిపోయి... ఎండిపోయి.. మోడువారుతున్న కవిత్వంపై ఆసక్తికి లభించిన ఊరట. ఇస్మాయిల్ కవితాతత్వం అందరికీ అర్థమవుతుంది. లో తైన విషయాలను కూడా సరళమైన భాషలో చెప్పి మెప్పించారు ఆయన. 'కవిత్వంలో నిశ్శబ్దం', 'కరుణ ముఖ్యం' వంటి వ్యాస సంకలనాలు ఆయన ఆలోచనలను మనకు పరిచయం చేస్తాయి. మనసును విశ్లేషించి మన ముందు ఉంచుతాయి. ఇస్మాయిల్ ఒక జనరంజన తాత్వికుడు. నవయుగపు సాహితీ పాంథకుడు.

– సత్యశ్రీ




నేడు 97వ జయంతి

*ఇస్మాయిల్ (మే 26, 1928 - నవంబర్ 25, 2003) కవి, అధ్యాపకుడు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో, 1928, మే 26న జన్మించిన ఇస్మాయిల్ ప్రజాదరణ పొందిన కవి. అధ్యాపకుడు. కాకినాడ, వాల్తేరు లలో విద్యాభ్యాసం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి బిఏ (ఆనర్స్) పట్టా పుచ్చుకున్నారు. కాకినాడ పిఆర్ కళాశాలలో ఫిలాసఫీ లెక్చరర్‌గా పనిచేసి ఆ తరువాత విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి, 1988లో ఉద్యోగ విరమణ చేశారు. అధికార భాషాసంఘంలో సభ్యునిగా కొంతకాలం పనిచేశారు. లండన్‌లోని ఆంధ్ర కల్చరల్ సొసైటీ ఆహ్వానం మేరకు 1978లో ఇంగ్లాండు తదితర ఐరోపా దేశాలలో పర్యటించి సాహిత్య కార్యక్రమాలలో పాల్గొన్నారు.*

## చదవాల్సిన పుస్తకం


# ప్రేమ్‌చంద్ సాహిత్య వ్యాసాలు

సాహిత్యం అంటే ఏమిటి? భూమి గుండ్రంగా ఉన్నదని కొత్తగా చెప్పినట్టు, ఈ ప్రశ్న ఇప్పుడు ఉదయించడం కొందరికి హాస్యాస్పదంగా ఉండవచ్చు. కానీ, సాహిత్యం పేరుతో పుంఖానుపుంఖంగా వచ్చిపడుతున్న 'చెత్త'ను చూసినప్పుడు, కొత్తగా ఈ ప్రశ్న ఉదయించక మానదు. తాము రాసిందంతా సాహిత్యమేనన్న అపోహ చాలా మందిలో ఉంది. కొంత మంది మరో అడుగు ముందుకేసి, తాము రాసింది మాత్రమే సాహిత్యమని అడ్డంగా వాదిస్తున్నారు. అదే భ్రమలో బతుకుతున్నారు. ఈ పరిస్థితుల్లో, ఇటు సాహితీప్రియులకు, అటు ఔత్సాహిక రచయితలకు 'ప్రేమ్‌చంద్ సాహత్య వ్యాసాలు' పుస్తకం మార్గదర్శకం చేస్తుంది. ప్రేమ్‌చంద్‌గా అందరికీ సుపరిచితుడైన ధనపత్ రాయ్ శ్రీవాస్తవ్ గురించి ప్రత్యేకంగా పరిచయ వాక్యాలు అనవసరం. సాహిత్యంపై ఆయన వైఖరి ఈ వ్యాసాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. నిజానికి సాహిత్యం అనేది కేవలం సౌందర్యాన్ని వర్ణించేది కాదు. అది సమాజాన్ని ప్రతిబింబించే అద్దం. ఈ అభిప్రాయాన్ని వాస్తవంగా చాటి చెప్పినవారిలో అగ్రగామిగా నిలిచినవారు మున్షీ ప్రేమ్‌చంద్. ఆయన సాహిత్యం అంతర్భావాన్ని విశ్లేషించేటప్పుడు కథలు, నవలలే కాక, వ్యాసాలకు ప్రత్యేక స్థానం ఇవ్వాలి. ప్రేమ్‌చంద్ రాసిన వ్యాసాలు భారతీయ సమాజంలోని అనేక మూల విషయాలను ప్రస్తావిస్తూ ప్రజల సమస్యలను నిగూఢంగా వెలుగులోకి తీసుకొచ్చాయి. ప్రేమ్‌చంద్ కలం సామాజిక న్యాయం, మానవీయ విలువలు, సామ్యవాద దృక్పథంతో నిండి ఉంటుంది. హిందీ, ఉర్దూ భాషలలో ఆయన రచనలు సమానమైన బలాన్ని కలిగి ఉన్నాయి. గోదాన్, నమక్ కా దార్‌ఒగా, కర్బానీ కా ఫల్స్‌ఫా వంటి రచనలు ఆయన్ని సాహిత్య రంగంలో శాశ్వతంగా నిలిపాయి. అలాంటి గొప్ప రచయిత సాహిత్యంపై వెలుబుచ్చిన అభిప్రాయాలు శిరోధార్యాలు. ఈ పుస్తకంలోని 14 వ్యాసాలలోని స్పష్టత, సరళత, ప్రజల భాష, ప్రామాణికత పాఠకులను ఆకట్టుకుంటాయి. సాహిత్య ఉద్దేశ ప్రయోజనాలను గురించి ప్రేమ్‌చంద్ విపులంగాను, హేతుబద్ధంగాను, అభ్యుద దృష్టితోనూ చర్చించారని ప్రకాశకులు పేర్కోవడం సముచితం. ఇది సాహితీపరులకు, సాహితీ విమర్శకులకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుందన్న మాట కూడా వాస్తవమే. ప్రేమ్‌చంద్ సాహిత్యాన్ని సామాజిక ప్రయోజనాలకు ఉపయోగపడే సాధనంగా పరిగణించారు. ఆయన అభిప్రాయం ప్రకారం, ఒక రచయిత సమాజంలో అన్యాయాన్ని, అసమానతను, శోషణను ప్రశ్నించాలి. ఈ వ్యాసాల్లో ఆయన సామాజిక అవాంఛనీయతపై తీవ్రమైన విమర్శలు చేశారు. సాహిత్యంపై విస్పష్టమైన అభిప్రాయాలను వెల్లడించారు. 'రాయబడిందంతా సాహిత్యమంటే నేనెప్పుడూ అంగీకరించను. సత్యాన్ని వ్యక్తీకరించుతూ, భాష ప్రౌఢంగాను, సందరంగాను ఉండి, మస్సు మీద, మేధస్సు మీద కూడా ప్రభావం చూపేది మాత్రమే సాహిత్యమనాలి' అని తేల్చిచెప్పారు. 'విమర్శించడం, గౌరవించడం అనేది ప్రతి రచనకూ ఉంటుంది. అప్పటి చాలా మంది రచయితలకు రచనలే జీవనాధారం. వాళ్లు రచించిన కావ్యాలను రాజులు, జమీందారులు తప్ప మరెవరూ ఆదరించేవారు కారు. కవులు సాధారణ జీవున సమస్యలను ఎదుర్కోవడానికిగానీ, అందులో ఉన్న నగ్న సత్యాల ప్రభావాన్ని గుర్తించటంగానీ చేయకుండా, మానసికంగా దిగజారిపోయారు. అందువలన వారి రచనల్లో మానసిక, బౌద్ధిక జీవనం చాలా వరకూ లోపించింది' అంటూ గొప్ప ప్రబంధాలపై విమర్శలు గుప్పించారు. సాహిత్యానికి ఉండాల్సిన లక్షణాలను వివరించారు. ప్రతి అంశాన్నీ లోతుగా విశ్లేషించారు. 'సాహిత్యానికి ఒకే విలువ ఉంది. ఒక వేళ అది మానవ జాతికి ఉపయోగపడే అవకాశం ఉంటేనే నిజమైన సాహిత్యం అనుకోవాలి. అలా కాకుండా, జీవితానికి ఏమీ ఉపయోగపడకుండా, జీవితమంటే అర్థం చెప్పకుండా ఉన్నట్టయితే, అది సరళ భాషలో ఉన్నప్పటికీ, ఆనందం కలుగచేసినప్పటికీ, సాహిత్యం కాదు' అని ప్రేమ్‌చంద్ అభిప్రాయం. మన దేశంలో సాహిత్య సమైక్యతా భావం అనాదిగా ఉన్నప్పటికీ, భాషా సహకారం లేదని తేల్చిచెప్పారు. నవలా రచనలను విశ్లేషించారు. సాహిత్యంలో ఆస్తిక, నాస్తిక వాదాలను ప్రస్తావించారు. సినిమాల ప్రభావాన్ని సైతం ఆయన ఒక వ్యాసంలో వివరించారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ పుస్తకం సాహిత్యంపై ప్రేమ్‌చంద్ అభిప్రాయాలనేకాదు.. వాస్తవ పరిస్థితులను, రచనల విధివిధానాలను కూడా ఆవిష్కరిస్తుంది. అందుకే ఇది తప్పక చదాల్సిన పుస్తకమైంది.




### పుస్తకం పేరు

ప్రేమ్‌చంద్ సాహిత్య వ్యాసాలు
వెల: రూ. 70
ప్రతులకు
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్)
జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068.
(నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).



# ఆచరణతో చరిత్ర సృష్టించిన 'కందుకూరి'

తెలుగు పునరుజ్జీవనోద్యమ పితామహుడు, అభినవాంధ్రకు ఆద్యబ్రహ్మ కందుకూరి వీరేశలింగం పంతులు ఒకవైపు సమాజానికి, మరోవైపు సాహిత్యానికి విశేష సేవలు అందించారు. ఆరుద్ర అన్నట్లు, 'తాము శారీరకంగా దుర్బలులైనా జాతిని బలిష్ఠం చేసి దేశాభివృద్ధిని, భాషాభివృద్ధిని సాధించిన మనోబల భీములలో పంతులు ప్రథములు. అటువంటి ఉజ్వల చారిత్రకుని ఏ బిరుదుతో వర్ణించినా అది అసమగ్రమే. అయినా నవ్యాంధ్ర నిర్మాతలనే నిర్మించినవారిగా నేను పంతులుగారిని భావిస్తున్నాను. అభినవాంధ్రకు ఆయన ఆద్యబ్రహ్మ.' ఈ మాటలు వినగానే ఆయన గొప్పదనం నూరు మాటలు చెప్పినా తీరనిది అనిపిస్తుంది. కందుకూరి వీరేశలింగం 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. ఆయన తాతలు వలస వచ్చిన కందుకూరు అనే ఊరినే తమ ఇంటి పేరుగా చేసుకున్నారు. ఐదేళ్ల వయసులోనే బడిలో అడుగు పెట్టి, బాల రామాయణం, సుమతీ శతకం, కృష్ణ శతకం వంటివి ముందు వెనుక లేకుండా నేర్చుకున్నారు. పన్నెండేళ్ల వయసులో రాజమండ్రిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో చేరి, ఆంగ్ల సాహిత్యంతో పాటు కేశవ్ చంద్ర సేన్ రచనలను అవపోసన పట్టారు. ఈ రచనలు ఆయనను విపరీతంగా ప్రభావితం చేశాయి. అప్పట్లో విగ్రహారాధన, పూజలపై ఆయన నమ్మకం తగ్గడమే కాక, దయ్యాలు, భూతాలు లేవని నిరూపించడానికి అర్ధరాత్రి శ్మశానానికి కూడా వెళ్ళే గుండె నిబ్బరం ఉన్న వ్యక్తి ఆయన. సంఘసేవలో వీరేశలింగం గారు ఎంత కృషి చేశారో, సాహిత్యంలోనూ అంతే కృషి చేశారు. 130కి పైగా గ్రంథాలు రచించారు. అన్ని గ్రంథాలు వ్రాసినవారు తెలుగులో కలగన్నా కనపడరు. సాంఘిక దురాచారాలను, మూఢ నమ్మకాలను విమర్శిస్తూ చక్కని తెలుగు సామెతలను, లోకోక్తులను ప్రయోగించి తొలి తెలుగు సాంఘిక నవలైన రాజశేఖర చరిత్రను రాశారు. సమాజపు వికృత సంఘటనలను అవహేళన చేస్తూ సత్యరాజా పూర్వదేశ యాత్రలు ఆయన రచనలలో ప్రముఖమైనవి. స్వీయ చరిత్ర, ఆంధ్ర కవుల చరిత్ర కూడా ప్రచురించారు. చిన్నయసూరి వదిలివేసిన నీతిచంద్రిక (తెలుగు పంచతంత్రం) లోని సంధి, విగ్రహం భాగాలను వీరేశలింగం పూర్తి చేశారు. వ్యవహార ధర్మబోధిని, చమత్కార రత్నావళి, అభిజ్ఞాన శాకుంతలం, రత్నావళి వంటి పన్నెండు నాటకాలు రాశారు. స్త్రీ విద్య ప్రాముఖ్యతను నొక్కి చెప్పే సత్యవతి చరిత్ర, మతపరమైన ఆచారాల గురించి చంద్రమతి చరిత్ర ఆయన ఇతర నవలలు. వేశ్యాభిమానం, చాదస్తపుటాచారాలు, శాఖాభేదాలు, అజ్ఞానం, వేశ్యా విషయ సంవాదము, చంద్ర గ్రహణం మొదలైన యాభైకి పైగా ప్రహసనములు వ్రా శారు. నీతి కథా మంజరి అనే 158 చిన్న కథల సంకలనాన్ని కూడా వెలువరించారు. సమాజంలోని దురాచారాలపై తన భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 1874 అక్టోబరులో వివేకవర్ధని అనే పత్రికను ప్రారంభించారు. 'సంఘంలోని అవకతవకలను ఎత్తి చూపడం, దురాచారాల నిర్మూలన, ప్రభుత్వ వ్యవస్థలో ప్రబలంగా ఉన్న అవినీతిని ఎత్తిచూపి, అవినీతిపరులను సంఘం ముందు పెట్టడం' వివేకవర్ధని లక్ష్యాలని ఆయన మొదటి సంచికలో స్పష్టంగా తెలియజేశారు. చెప్పడమే కాదు, అలాగే నడిపారు కూడా. వివేకవర్ధని పత్రిక అవినీతిపరుల పాలిట సింహస్వప్నంలా మారింది. ఆంధ్రదేశంలో బ్రహ్మ సమాజాన్ని స్థాపించిన వీరేశలింగం గారు ఒక గొప్ప హేతువాది. సంఘసంస్కరణకు నడుం బిగించారు. కార్యదీక్ష, సాహసం, విజ్ఞాన తృష్ణ ఆయనకు పుట్టుకతో వచ్చిన లక్షణాలు. రాజారామమోహన రాయ్, దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవ చంద్ర సేన్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్‌ల బోధనలు, రచనలచే ప్రభావితులై 1887లో సంఘసంస్కరణ సమాజాన్ని స్థాపించి, మతమనే ముసుగులో అధోగతిలో ఉన్న హైందవ సమాజంలోని దురాచారాలపై విప్లవం ప్రారంభించారు. మూఢ విశ్వాసాలు, సనాతనాచారాలపై ఆయన నిరంతరం పోరాటం సాగించారు.

– డి. జైరాం

**ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా వీరేశలింగం గారికి అనేక విశిష్టతలు ఉన్నాయి. అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన వ్యక్తి కందుకూరి. మొట్టమొదటి వితంతు వివాహం జరిపించిన వ్యక్తి. తొలి సహవిద్యా పాఠశాల స్థాపకుడు. తెలుగులో మొదటి స్వీయ చరిత్ర, తొలి నవల, తొలి ప్రహసనం రాసిందీ ఈయనే. యుగకర్తగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు కూడా ఉంది. తన జీవితపు చివరి దశలో, రాజమండ్రిలో స్థాపించిన విడోస్ హోమ్‌తో పాటు చాలా సామాజిక కార్యకలాపాలను పర్యవేక్షించే హితకారిణి సమాజం కోసం తన ఆస్తి మొత్తాన్ని ధారాదత్తం చేశారు. 1919 మే 27న ఆయన మరణించారు.**



మే 27 వర్ధంతి

## ఈ వారం కవితలు

### నిద్రనివ్వని రాత్రి

ఓ సంధ్యవేళ..
సరస్సులో సడిచేయని కెరటాలకు,
నీలాభ్రంలో ఉదయించి
తళుకులీనుతూ
కాంతిని వెదజల్లబోయే చుక్కలకు
మనసును పారేసుకున్న నేను,
ఆ రేయి కలతనిద్రలో
జంబూఫలరంగువంటి చీకటిమాటున
ఆలోచనలతో కలగంటున్నవేళ,
ఉన్నట్టుండి నిద్రలేచా,
విడివడని నిద్రరెప్పల్ని
వేళ్ళతో రుద్దుకొంటూ,
దర్వాజావైపు నడిచా.

బయటకు చూస్తే
గుహలనుండి వెలువడిన
గజరాజులను పోలిన చీకటి,
వీరభద్రుని జడలవంటి చీకటి.
అంతవరకు అటునిటు అశాంతిగా
తిరుగుతూఉండిన పాదపాలు
నన్నుచూసి అనుకుంటూ
మునుల్లా మౌనంధరించాయి.
నన్నునేను ఆవిష్కరించుకొంటానని
బహుశా వాటికీ తెలుసేమో.

ఎందుకంటే ప్రతిసారీ,
నాకు దారి చూపించే సూచిక నేనే.అందుకై
నాకై ఒక దారి వేసుకోవాల్సింది నేనే.
అందుకోసం నన్నునేను నుగ్గునుగ్గు చేసుకుని,
నా ఎముకల తెల్లనిపొడితో
చీకటిపలకమీద చుక్కలముగ్గు వేసి,
వాటి మధ్యలో వెన్నెల దుప్పటి పరుచుకుని
పడుకుందామనుకుని, కిటికీలోంచి
ఎంతచేయిచాచినా ఆకాశం అందట్లేదు,
నిద్రనివ్వని ఈ చీకటీ వదలట్లేదు.

– వేమూరి శ్రీనివాస్, 9912128967

### కాడెడ్ల బండి బతుకు

ఎడ్ల బండి బతుకు
రెండడుగులు ఒక్కటై
సాగుతేనే ముందుకు !
బండికి ఎన్నెన్ని అతుకులు
బతుకుకు ఎన్నెన్ని వెతుకులు

అతుకులు అంటిపెట్టుకొని
ఉండే కుటుంబం
వెతుకులంటే ఆశల
ఆరాటాల కదంబం

అవసరాల అన్వేషణలో
బ్రతుకు యాగమై సాగుతుంది!
బండిని లాగుతున్నట్లు
కనిపించేవి కావవి ఎద్దులు!

కనిపించని పెద్ద తనపు
బాధ్యత బరువుమోసే నిబద్దులు!
చెరిసగమై సాగే జగతి బండికి
ఆశలు మోసే కాడి చందం!

ఎద్దుకు బండికి బాధ్యతల బంధం!
బ్రతుకు పథం అయినా
జగతి రథం అయినా
బంధాలను అనుబంధాలతో

అల్లుకొని బండిని సమతౌల్యం తో
లాఘవంగ లాగవలసిందే!
పగలు రాత్రి కలిసి
కాల చక్రాన్ని లాగుతున్నట్లు

స్త్రీ పురుషులు ఒక్కటిగా
బ్రతుకు బంధమై కొనసాగి
గమ్యం చేరవలసిందే !

– పట్లోళ్ళ బక్కారెడ్డి , 9705315250

### రియల్ హీరోస్..!!

మాకు నటించడం చేతకాదు
బార్డర్ లో తుపాకీతో సావాసం చేస్తాం
ఎదురొడ్డి పోరాటానికి ఆజ్యం పోస్తాం
ప్రాణాలను పనంగా పెట్టి
రణరంగంలో అడుగు పెడతాం
మాది చిత్రీకరణ విచిత్రం కాదు
గ్రాఫిక్స్ ఫైట్స్ తో చూపే వీరోచితం కాదు
ఫిరంగులతో మమేకమౌతూ
యుద్ధ విమానాలతో ఆకాశాన్ని చుట్టి
విలనిజాన్ని ఎదుర్కొంటాం

మాకు ప్రేమ దోమలుండవు
కన్నవారి ఆశిస్సులు
భారతదేశ నాయకత్వ అండదండలు
ఆలు బిడ్డల దీవెనలే మా బలగం
మా కథలాంటి నిజ జీవితంలో
విజయం లేదా ముగింపు
మలుపులు తిప్పుకునే హిరోయిజం కాదు
చివరి పోరాటం వరకు
ఎదురొడ్డి నిలబడే దమ్ము ధైర్యమే అండ
మాకు ఈవెంట్ లు కంటెంట్ లు వుండవు
గురి తప్పకుండా శిక్షణలు
యుద్ధ రంగంలో నైపుణ్యతలే శరణ్యాలు
మాకు పెద్ద పెద్ద కటౌట్లు వుండవు సుమీ
బ్రతికి జయిస్తే వీరోచితం
వీర మరణం పొందితే భరతజాతి వీడ్కోలు
లాభాపేక్ష లేని హీరోయిజం మాది

మాకు దేశమంతా అభిమానులే
రియాలిటీ మాకున్న ఒకే ఒక నైజం
అడగు అడుగులో ఉత్కంఠ
ఇదే మా కథకు వాస్తవికతకు సంకేతం
దేశ స్వేచ్ఛకు ప్రతీకలం
భారతావనికి అనునిత్యం రక్షకులం
భారత పౌరుల జీవనానికి కవచాలం
మేమే అసలైన రియల్ హీరోస్
జై జవాన్ జై భారత్

నరెద్దుల రాజారెడ్డి, సెల్ : 9666016636



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు

**న్యూఢిల్లీ :** నాలుగు రాష్ట్రాల్లో ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదివారం షెడ్యూల్ విడుదల చేసింది. గుజరాత్‌లోని రెండు అసెంబ్లీ స్థానాలకు, కేరళ, బెంగాల్, పంజాబ్‌లోని ఒక నియోజవర్గానికి జూన్ 19వ తేదీన ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. గుజరాత్‌లో కాది నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కర్సాన్‌భాయి పుంజాభాయి సోలంకి మృతి చెందడంతో అక్కడ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. మరో స్థానం విసవదర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే భయాని భూపేంద్రభాయి గండుభాయి తన పదవికి రాజీనామా చేశారు. కేరళలోని నిలాంబర్ స్థానంలో పివి అన్వర్ రాజీనామా చేశారు. పంజాబ్ లూధియానా సీటులో సిట్టింగ్ సభ్యుడు గుర్‌ప్రీత్ బస్సి గోగి మృతి చెందారు. ఇక బెంగాల్‌లోని కాళీగంజ్ అసెంబ్లీ స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే నసిరుద్దీన్ అహ్మద్ మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఈ స్థానాల్లో ఉప ఎన్నికల అనివార్యమయ్యాయి.



ఉగ్రవాదానికి వ్యతిరేకంగా..

# దేశమంతా ఏకమైంది

‘మన్ కీ బాత్’లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో సైన్యం చూపించిన ధైర్య సాహసాలకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నట్లు చెప్పారు. 122వ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతోందని ప్రధాని మన్ కీ బాత్‌లో తెలిపారు. మావోయిస్టుల హింసాత్మక చర్యలు క్రమంగా తగ్గుతున్నాయని, దంతెవాడ ఆపరేషన్‌లో జవాన్లు ఎంతో సాహసం చూపారని మోదీ కొనియాడారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశ ప్రజలందరూ భావోద్వేగానికి గురయ్యారని తెలిపారు. ‘ఉగ్రవాదానికి వ్యతిరకేంగా చేసే పోరాటంలో ఆపరేషన్ సిందూర్ కొత్త ఉత్సహాన్ని నింపింది. మన సైన్యం ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని తల ఎత్తుకునేలా చేసింది. కచ్చితత్వంతో పిఒజెకెలోని ఉగ్రవాద క్యాంపులపై సైన్యం జరిపిన దాడులు అద్భుతం. మొత్తం దేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏకమైంది. ఉగ్రవాదాన్ని అంతం చేయాలనేది ప్రతి భారతీయుడి సంకల్పం. మన రోజువారీ జీవితంలో సాధ్యమైనంత వరకు దేశంలోనే తయారైన వస్తువులను వాడాలి. ఇది కేవలం ఆర్థిక ఆత్మ నిర్భరత కోసం మాత్రమే కాదు. జాతి నిర్మాణంలో ఒక భావన లాంటింది’ అని మోదీ అన్నారు. ‘ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదు. మన సంకల్పం, ధైర్యం, దేశభక్తితో నిండిన నవభారతానికి నిదర్శనం. అనేక కుటుంబాలు దీనిని తమ జీవితాల్లో భాగంగా చేసుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పుట్టిన పిల్లలకు సిందూర్ అని పేరు పెట్టారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత అనేక నగరాలు, గ్రామా లు, పట్టణాల్లో తిరంగ యాత్రలు నిర్వహించారు. సివిల్ డిఫెన్స్ వాలంటీర్లుగా అనేక నగరాల నుంచి యువత ముందుకు వచ్చారు. కవితలు రాయడం, సంకల్ప గీతాలు పాడటం, పిల్లలు గొప్ప సందేశాలతో చిత్రాలను వేశారు’ ప్రధాని మోదీ చెప్పారు. మరోవైపు మావోయిస్టుల హింసాత్మక చర్యలు క్రమంగా తగ్గుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దంతెవాడ ఆపరేషన్‌లో జవాన్లు చూపిన సాహసాన్ని ఆయన కొనియాడారు. నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతోందని చెప్పారు. నక్సలిజం నిర్మూలనలో గర్వించే విజయం సాధించామన్నారు.

**సంగారెడ్డి మహిళలు స్కైవారియర్స్**

తెలంగాణలోని సంగారెడ్డి మహిళల గురించి ప్రధాని మోదీ మన్ కీ బాత్‌లో ప్రస్తావించారు. వారు వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించడాన్ని ఆయన ప్రశంసించారు. గ్రామీణ మహిళలు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ పొంది.. పండ్ల తోటలపై పురుగుల మందులు ఇతర అవసరాల కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారన్నారు. డ్రోన్ దీదీలను స్కై వారియర్స్ అని మోదీ అభివర్ణించారు.

**పెరిగిన సింహాల సంఖ్య..**

దేశంలో సింహాల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరుగుతోందని మోదీ తెలిపారు. గత ఐదేళ్లలో గుజరాత్‌లోని గిర్‌లో 674 నుంచి 891కి చేరిందన్నారు. ఫారెస్ట్ ఆఫీసర్లుగా ఎక్కువ మంది మహిళలను నియమించిన తొలిరాష్ట్రంగా గుజరాత్ నిలిచిందన్నారు.

# ఢిల్లీని ముంచెత్తుతున్న భారీ వర్షాలు

నీట మునిగిన కార్లు, బస్సులు

180 విమానాలపై ప్రభావం, 49 విమానాలు దారిమళ్లింపు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. వర్షానికి పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన కూడళ్లు జల దిగ్బంధంలో చిక్కుకుపోయాయి. అనేక ప్రాంతాల్లో రహదారులు నీటమునగడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ధౌలా కువాన్, సుబ్రోతో పార్క్, నానక్‌పురాలో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లోని లోతట్టు ప్రాంతాల్లో భారీగా వర్షం పడటంతో ఓ బస్సు, కారు వరద నీటిలో చిక్కుకుపోయాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి అక్బర్ రోడ్డు సమీపంలో చెట్లు నేలకొరిగాయి. ఈ కారణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. అనేక ప్రాంతాల్లో 5 నుంచి 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది అని వాతావరణ శాఖ తెలిపింది. సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో 81 మిల్లీ మీటర్లు, పాలంలో 68 మిల్లి మీటర్లు, పూసా 71 మిల్లి మీటర్లు, మయూర్ విహార్‌లో 48 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదయింది. గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల దవేగంతో గాలులు వీచాయని వెల్లడించింది. భారీ వర్షంతో మింటో రోడ్డు వద్ద ప్రాంతం పూర్తిగా నీటితో నిండిపోవడంతో ఒక కారు మునిగిపోయింది. ప్రతికూల వాతవారణం వల్ల ఢిల్లీకి పలు విమానాల రాకపోకలకు ఆలస్యం అవుతోంది. దాదాపు 180కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, 17 అంతర్జాతీయ సహా 49 విమానాలను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు అడ్వైజరీ జారీ చేసింది. విమానాల సమయాలను సంబంధిత వెబ్‌సైట్లలో చెక్ చేసుకోవాలని సలహా ఇచ్చింది. అటు ఎయిరిండియా, ఇండిగో కూడా ప్రయాణికులను అప్రమత్తం చేశాయి. తాజా అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని చెప్పాయి. అంతకుముందు శనివారం అర్థరాత్రి కురిసిన వర్షానికి ఢిల్లీ నగరాన్ని విమానాశ్రయానికి అనుసంధానించే ప్రధాన అండర్‌పాస్ జలమయమైంది. ఫలితంగా డజన్ల కొద్దీ కార్లు, బస్సులు నీటమునిగాయి. ముఖ్యంగా రానున్న కొన్ని గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అంచనా వేసింది.

**కేరళలో రెడ్ అలర్ట్**

మరోవైపు రుతుపవనాల రాకతో కేరళలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల చెట్లు,విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రోడ్లన్నీ వరద నీటితో జలమయమవ్వగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే కాసర్‌గోడ్, కన్నూర్, కోజికోడ్ వయనాడ్ మలప్పురం జిల్లాల్లో అధికారులు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. మిగిలిన అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించా రు. వచ్చే నాలుగు రోజులు కేరళలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. అత్యవసరమై తే తప్ప ప్రజలు ఇళ్లు వదిలి రావద్దని సూచించింది. మహారాష్ట్ర, రాజస్థాన్‌లో కూడా వర్షా లు కురుస్తున్నాయి.

## రోడ్డు దాటుతుండగా ఢీకొట్టిన కారు..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం

**న్యూఢిల్లీ :** తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లాలోని కుంజంపట్టి సమీపంలో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు రోడ్డు దాటుతుండగా అతి వేగంగా దూసుకొచ్చిన కారు వీరిని ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మధురై పోలీసు సూపరింటెండెంట్ అరవింద్ తెలిపారు. ఒకే కుటుంబంలోని నలుగురు వ్యక్తులు ఒకేసారి మరణించడంతో వారి స్వగ్రామంలో విషాదం అలుముకుంది. కాగా ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

## జపాన్‌ను దాటేశాం..


4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్: నీతి ఆయోగ్



**న్యూఢిల్లీ :** జపాన్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే నాలుగోవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రహ్మణ్యం చెప్పారు. దేశ నామమాత్రపు జిడిపి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని తెలిపారు. 2024 వరకు భారత్ ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నది. ‘వీక్షిత్ రాజ్య ఫర్ వీక్షిత్ భారత్ 2047’ అనే అంశంపై శనివారం ఢిల్లీలో 10వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశం జరిగింది. తర్వాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీవీఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) డేటా ప్రకారం.. భారత ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్ల మార్కును చేరుకున్నట్లు చెప్పారు. ‘నేను చెప్పినట్లుగా మనం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగాం. మనది 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ. ఇది నా డేటా కాదు.. ఐఎంఎఫ్ డేటా. నేడు భారత్, జపాన్ కంటే పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందింది. యునైటెడ్ స్టేట్స్, చైనా, జర్మనీ మాత్రమే మనకంటే పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్నాయి. మనం వేసుకున్న ప్రణాళికకు కట్టుబడి ఉంటే.. మరో 2, 2.5 నుండి 3 సంవత్సరాలలోనే ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతాం అని సుబ్రహ్మణ్యం అన్నారు.

## కుల గణన విభజనలకు దారితీయదు

ఎన్‌సిఎస్‌సి ఛైర్‌పర్సన్ కిషోర్ మక్వానా



**న్యూఢిల్లీ :** కులగణన సమాజంలో అగాధాలను సృష్టిస్తుందనే ఆరోపణలను జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్‌సిఎస్‌సి) ఛైర్‌పర్సన్ కిషోర్ మక్వానా త్రోసిపుచ్చారు. సేకరించిన గణాంకాలు విధాన నిర్ణయాలకు పునాదిగా పనిచేస్తాయని, సామాజిక న్యాయాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. అణగారిన వెనుకబడన వర్గాల వృద్ధికి దోహదపడుతుందని ఆయన పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. నాభా లెక్కల్లో కుల గణనను చేర్చాలని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించడాన్ని మక్వానా స్వాగతించారు. 2011 మాదిరి కాకుండా సంక్షేమ పథకాలకు దామాషా ప్రాప్యతను నిర్ధారించే కచ్చితమైన గణాంకాలు అందుబాటులో ఉంటాయన్నారు. యుపిఎ ప్రభుత్వం 2011లో సామాజిక, ఆర్థిక, కుల గణనను నిర్వహించింది. ఇది 1931 తర్వాత దేశవ్యాప్తంగా కుల డేటాను సేకరించడానికి చేసిన మొదటి ప్రయత్నం. అయితే, ఎస్ఇసిసి– 2011 నుండి కుల డేటాను ఎప్పుడూ పూర్తిగా విడుదల చేయలేదు. అదే విధంగా దేనికీ ఉపయోగించుకోలేదు. కాగా, కుల గణన మతపరమైన విభజనలకు దారితీస్తుందనే ఆందోళనలను మక్వానా త్రోసిపుచ్చుతూ ఇది కులం ఆధారంగా ఎటువంటి విభజనను సృష్టించదన్నారు. దానికి బదులుగా సామాజిక న్యాయాన్ని బలోపేతం చేస్తుందన్నారు. వెనుకబడిన కులాలను వృద్ధిలోకి తెచ్చేందుకు సహాయా పడుతుందన్నారు. షెడ్యూల్డ్ కుల సమాజం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు కన్న మూడు అంశాలైన సామాజిక, రాజకీయ, ఆర్థికంగా బలోపేతం చేస్తుందన్నారు. కులగణన ద్వారా వెనుకబడిన వారిలో చివరి వ్యక్తికి కూడా హక్కులు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌సి గణన ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనదని, జనాభా లెక్కల తర్వాత విధాన రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని మక్వానా స్పష్టం చేశారు. డేటా సేకరణలో తమ పాత్ర ఉండదని, కానీ డేటా విడుదలైన తర్వాత షెడ్యూల్డ్ కులాలకు నిష్పత్తి ఆధారంగా వారి వాటా లభించేలా చూసుకోవడంలో కమిషన్ పాత్ర ఉంటుందని తెలిపారు. చివరగా కుల గణన 1931లో నిర్వహించగా, నవీకరించబడిన డేటా లేకపోవడంతో జనాభాలో ఎస్‌సిలు 7 శాతంగా ఉన్నారనే భావనపై తాము పనిచేస్తున్నామని మక్వానా స్పష్టం చేశారు. కొత్త జనాభా గణన కేవలం ఎస్‌సిలకు మాత్రమే కాకుండా, ముస్లిం, క్రైస్తవ వర్గాలలోని ఉపకులాకు సంబంధించిన వివరణాత్మక డేటా బహిర్గతమవుతుందన్నారు. కమిషన్ విస్తృత కార్యకలాపాలపై ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎన్‌సిఎస్‌సి రాష్ట్ర స్థాయి విచారణలను నిర్వహించడం ప్రారంభించిందని, ఇది ఇంతకు ముందు ఎప్పుడూ జరగలేదన్నారు. తాము పంజాబ్, రాజస్థాన్‌లలో విచారణలు నిర్వహించామని, ప్రజల మధ్యకు వెళ్తున్నామని, చట్టపరమైన నిబంధనలు మాత్రమే కుల ఆధారిత సమస్యలను పరిష్కరించవన్నారు. సమాజంలో కూడా సానుభూతి, భావోద్వేగ సంబంధం ఉండాలన్నారు.

# ‘నేడు’ భారత్–మాల్దీవుల... భాగస్వామ్యంపై చర్చలు

అమలును సమీక్షించనున్న

ఇరుదేశాల విదేశీ

వ్యవహారాల శాఖ మంత్రులు

భారత్ చేరుకున్నమాల్దీవుల

విదేశీ వ్యవహారాల మంత్రి

అబ్దుల్లా ఖలీల్



**న్యూఢిల్లీ :** భారతదేశంమాల్దీవుల మధ్య ఆర్థిక, సముద్ర భద్రత వ్యవహారాలలో స్నేహ సంబంధం చిగురించేందుకు మార్గం సుగమం కానున్నది. ఈ మేరకు భారతదేశ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్, మాల్దీవుల విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి అబ్దుల్లా ఖలీల్ ఇరువురూ సోమవారం సమగ్ర ఆర్థిక, సముద్ర భద్రతకు సంబంధించి భాగస్వామ్యం అమలును సమీక్షించనున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభం అయ్యే మూడు రోజుల పర్యటన కోసం మాల్దీవుల విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి అబ్దుల్లా ఖలీల్ ఒక అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందంతో భారత పర్యటనకు వచ్చారు. భారత్‌లో పర్యటించడం అబ్దుల్లా ఖలీల్‌కు ఇది మూడవ సారి.సమగ్ర ఆర్థిక, సముద్ర భద్రత భాగస్వామ్యంపై గత ఏడాది (2024) అక్టోబరులో భారతదేశంమాల్దీవుల దార్శనిక పత్రాన్ని భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముఇజ్జు ఆమోదించారు. విదేశీ వ్యవహారాల మంత్రి అబ్దుల్లా ఖలీల్ సందర్శన భారతదేశంమాల్దీవుల మధ్య ఉన్నత స్థాయి రాజకీయ మార్పిడులను పెంపొందించడాన్ని కొనసాగించనుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఏ) ఈ పర్యటన గురించి ఒక ప్రకటన విడుదల చేసింది. సమగ్ర ఆర్థిక. సముద్ర భద్రతా భాగస్వామ్యంపై భారతదేశంమాల్దీవుల దార్శనిక పత్రాన్ని అమలు చేయడంలో పురోగతిని పర్యవేక్షించడానికి జరుగబోయే రెండవ కోర్ గ్రూప్ (హెచ్ఎల్‌సిజి) సమావేశంలో అబ్దుల్లా ఖలీల్ మాల్దీవులకు నాయకత్వం వహిస్తారని ఆ ప్రకటన తెలియజేసింది. మాల్దీవుల విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి అబ్దుల్లా ఖలీల్ భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌తో ద్వైపాక్షిక చర్చలను కూడా జరుపుతారని వెల్లడించింది. మాల్దీవులు భారతదేశానికి కీలకమైన సముద్ర పొరుగుదేశం. భారతదేశానికి ముఖ్యమైన మొదటి పాలసీ కలిగి ఉన్న పొరుగుదేశమే కాకుండా అన్ని ప్రాంతాల భద్రత, వృద్ధికి ‘విజన్ మహాసాగర్’ తప్పని సరి, సమగ్రమైన పురోగతి అని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఆ ప్రకటనలో తెలియజేసింది. రెండు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక, సముద్ర భద్రత భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే ఈ పర్యటన లక్ష్యంగా నిర్దేశించుకుందని ఎంఇఏ ప్రకటన వెల్లడించింది. చైనా అనుకూలంగా మొగ్గు చూపుతారనిన భావించే మహమ్మద్ ముయిజ్జు 2023 నవంబరులో మాల్దీవుల అత్యున్నత పదవి అయిన అధ్యక్ష పదవికి బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారతదేశంమాల్దీవుల మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా మారాయి. ప్రమాణస్వీకారం చేసిన కొన్ని గంటలలోనే తన దేశం నుండి భారత దేశం సైనిక సిబ్బందిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత భారత సైనిక సిబ్బంది స్థానంలో పౌరులు వచ్చారు. అక్టోబర్‌లో ఢిల్లీ పర్యటన సందర్భంగా మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జూ భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకుంటానని ప్రతిజ్ఞ చేయడంతో భారతదేశంమాల్దీవుల సంబంధాలలో కొంత మార్పు వచ్చింది.

## న్యాయ సహాయ పథకాల ప్రభావంపై కేంద్రం స్వతంత్ర ఆడిట్ యోచన

**న్యూఢిల్లీ :** ప్రభుత్వం 2026లో ముగియనున్న దాని కీలక న్యాయ సహాయ పథకాల ప్రభావాన్ని అంచనా వేయడానికి స్వతంత్ర ఆడిట్‌ను నిర్వహించాలని యోచిస్తోంది. 2026 తర్వాత కార్యక్రమాల స్కేలబిలిటీ, స్థిరత్వాన్ని కూడా ఆడిట్ నిర్ణయిస్తుంది. కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖలోని న్యాయ శాఖ కేంద్ర రంగ పథకం అయిన ‘దిశ ’(భారతదేశంలో న్యాయం యొక్క సమగ్రప్రాప్తి కోసం వినూత్న పరిష్కారాల రూపొందించడం) పథకం న్యాయం పొందడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది మూడు కీలక కార్యక్రమాలను కలిగి ఉంటుంది. టెలి లా, న్యాయ బంధు( ప్రో బోనో లీగల్ సర్వీసెస్), న్యాయ అక్షరాస్యత, న్యాయ అవగాహన, ఇవన్నీ పౌరులకు ముఖ్యంగా మారుమూల ప్రాంతాల వారికి అందుబాటులో ఉన్న, చౌకైన సేవలను అందించడానికి పనిచేస్తాయి. ఐదు సంవత్సరాల ఈ దిశ పథకం (2021–2026) కోసం రూ.250 కోట్లు ఆర్థిక వ్యయం నిర్దేశించబడింది.కార్యక్రమం ప్రభావాన్ని అంచనావేయడానికి, కోర్సు దిద్దుబాటు లేదా మెరుగుదలను పరిష్కరించడానికి, 2026 తర్వాత స్కేలబిలిటీ, స్థిరత్వాన్ని నిర్ణయించడానికి న్యాయశాఖ మూల్యాంకనం ఉద్దేశించబడింది. దీని కోసం నిర్ణీత సమయంలోపు మూల్యాంకనం నిర్వహించాలని, సకాలంలో పూర్తి చేయాలని ‘టెండర్ ఆహ్వానిస్తూ నోటీస్’ జారీ చేసింది. ప్రతిపాదిత మూల్యాంకనం కలిగి ఉన్న మూడు కార్యక్రమాలు దిశ పథకం కింద ఉన్న ‘టెలిలా’, న్యాయ బందు (ప్రొ బోనో లీగల్ సర్వీసెస్), లీగల్ లిటరసీ మరియు లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ (ఎల్ఎల్‌వి ల్‌ఎపి) సంబంధిత లబ్ధిదారులు, రంగాలు, ప్రాంతాలను విశ్లేషించి అంచనా వేస్తుంది. ఆడిట్ పథకం కింద కార్యక్రమాలను విశ్లేషించి, అవుట్‌పుట్ ఫలితాన్ని చేపడుతుంది. ఈ పథకం కింద కార్యక్రమాల అమలులో ఏవైనా అంతరాలు ఉంటే వాటిని గుర్తించి అధ్యయనం చేయడమే కాకుండా చర్యలను సూచిస్తుంది.

పాకిస్థాన్‌లో కూర్చుని శిక్ష తప్పించుకోలేరు

సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ వైఖరిని

ప్రపంచనాయకులకు చెప్పిన అఖిలపక్ష బృందాలు

# ఇక అలా కుదరదు



**న్యూయార్క్ :** పాకిస్థాన్ సరిహద్దుల నుండి ఎదురయ్యే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారతదేశం సరికొత్త వైఖరిని అనుసరిస్తుందని, ఇలాంటి నేరాలకు పాల్పడినవారిని ఇక శిక్షించకుండా వదిలిపెట్టేదిలేదని వివిధ దేశాల్లో పర్యటనలకు వెళ్ళిన ఏడు భారత బహుళపక్ష ప్రతినిధి బృందాలు ప్రపంచ నాయకులకు తెలియజేశాయి. భారతదేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుందని, అదేసమయంలో అన్ని దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను వృద్ధి చేసుకుంటుదని చెప్పాయి. శశిథరూర్, సంజయ్ కుమార్ ఝూ, బైజయంత్ జై పాండే, కనిమొళి, సుప్రియాసూలే నాయకత్వాన పలు ప్రతినిధి బృందాలు పాకిస్థాన్ దుశ్చర్యలను, ఉగ్రవాదంతో దానికున్న సుదీర్ఘ అనుబంధాన్ని వివిధ దేశాల నాయకులకు తెలియజెప్పేందుకు వెళ్ళారు.

**మొత్తం 33 దేశాలలో ఈ బృందాలు పర్యటిస్తాయి.**

పాకిస్థాన్‌లో కూర్చుని సునాయాసంగా సరిహద్దులు దాటివచ్చి భారతీయులను చంపి పారిపోతామంటే ఇకమీదట సహించబోమని,ఉగ్రవాదులు శిక్ష తప్పించుకోలేరని, వారు అందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారనీ కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ నాయత్వాన అమెరికాలో పర్యటిస్తున్న బహుళపక్ష భారత ప్రతినిధిబృందం స్పష్టం చేసింది. పర్యటనలో భాగంగా బృందం ఆదివారంనాడు న్యూయార్క్‌లో దిగింది, ఎంపిక చేసిన గ్రూపులతో జరిగిన అనుసంధాన కార్యక్రమంలో పాల్గొంది. భారత కాన్సులేట్ జనరల్ ఆతిథ్యం ఇచ్చిన ఈ సమావేశంలో భారత్–అమెరికాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ బృందం గుయానా బయలుదేరి వెళ్ళేముందుగా జరిగిన ఈ సమావేశంలో శశిథరూర్ మాట్లాడుతూ, పాకిస్థాన్‌కు భారతదేశం ఇచ్చే సందేశం చాలా స్పష్టంగా ఉందని శశిథరూర్ అన్నారు. న్యూయార్క్‌లో ఉన్న 9/11 స్మారక కేంద్రాన్ని ఈ బృందం సందర్శించింది.

పహల్గామ్‌లో దాడుల తర్వాత కొత్త నిబంధనలను భారత్ అమలు చేస్తోందన్నారు. ‘‘నడుచుకుంటూ వెళ్ళి చాలా సులభంగా సరిహద్దులు దాటి ఎలాంటి శిక్షలూ లేకుండా భారతీయులను చంపి వెళ్ళిపోవచ్చు అనుకునేవాళ్ళను ఇకమీదట ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోం’’ అని శశిథరూర్ హెచ్చరించారు.

‘‘మేం ఇప్పుడే ఉగ్రవాదులకు ఒక సందేశాన్ని పంపిస్తున్నాం, మీరు ప్రారంభించారు, మేం సమాధానం చెప్పాం, మీరు ఆపేస్తే, మేమూ ఆపేస్తాం, 88 గంటలసేపు యుద్ధం జరిగింది, వాళ్ళు ఆపేశారు, మేం వెనక్కు తిరిగి పరిశీలించాం, ఈ యుద్ధం జరగాల్సిందికాదు, చాలా ఆవేదన చెందాం, విలు వైన ప్రాణాలు కోల్పోయాం. అదే సమయంలో వెనక్కు తిరిగి అన్ని అనుభ వాలను నెమరువేసుకున్నాం,బలమైన ఉక్కు సంకల్పంతో, సరికొత్త ఆలోచ నలతో కృతనిశ్చయం చేసుకున్నాం, ఇక కొత్త నిబంధనలు అమలు చేస్తాం, సులభంగా సరిహద్దులు దాటి వెళ్ళిపోవచ్చు, భారతీయులను చంపేయొచ్చు, ఎలాంటి శిక్షలూ లేకుండా బయటపడిపోవచ్చు అని పాకిస్థాన్‌లో కూర్చుని నమ్మేవాళ్ళను ఇక వదిలిపెట్టేదిలేదు, వారు మూల్యం చెల్లించుకుంటారు’’ అని చెప్పారు. ‘‘శరవేగంగా విస్తరిస్తున్న ప్రపంచ ప్రజాస్వామ్య స్వేచ్ఛా మార్కెట్లపై మేం కొన్ని సంవత్సరాలపాటు దృష్టి కేంద్రీకరిస్తాం, మాది అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ,దానిమీదే ఇప్పుడు మా దృష్టి అంతా పెడతాం, టెక్నాలజీ, సంబంధిత వృద్ధి, పేద రికం నుండి పెద్దసంఖ్యలో ప్రజలను బయటపడేయడం వంటి విషయాపైనే కేంద్రీరి స్తాం21వ శతాబ్దిలో ప్రపంచవ్యాప్తంగా వచ్చే అవకాశాలపై భారతదేశం దృష్టిపెడు తుంది,ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చెందడం పైనే కాదు, మా ప్రజలను ప్రపంచంలోకి తీసుకువస్తాం’’ అని ఆయన చెప్పారు.

శశిథరూర్ నాయకత్వంలో ఒక ప్రతినిధిబృంద గుయానా, పనామా, కొలంబియా, బ్రెజిల్, అమెరికా దేశాలలో ఈ బృందం పర్యటిస్తుంది. ఈ బృందంలో సర్ఫరాజ్ అహ్మద్ (జెఎంఎం), గంటి హరీశ్ మాధుర్ బాలయోగి (టిడిపి), శశాంక్ మణి త్రిపాఠి (బిజెపి), భువనేశ్వర్ కలిత(బిజెపి), మిలింద్ దియోరా(శివసేన), తేజస్వి సూర్య (బిజెపి),మాజీ దౌత్యవేత్త తరణ్‌జిత్ సంధు ఆయన బృందంలో సభ్యులుగా ఉన్నారు.

ఇక బిజెపి ఎంపి బైజయంత్ జైపాండే నాయకత్వాన బృందం బహ్రైన్ రాజధాని మనామాలో ఆ దేశ ఉపప్రధానమంత్రి షేక్ ఖలీద్ బిన్ అబ్దుల్లా అల్ ఖలీఫాతో సమావేశం జరిపింది. బహ్రైన్,భారత్ మధ్య లోతైన సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయని ఆ దేశ ఉపప్రధానమంత్రికి ఈ సందర్భంగా జైపాండే గుర్తుచేశారు. బృందంలో ఉన్న అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ, అమాయకులను హత్యచేసిన ఉగ్రవాదులు తమ వాదనలను సమర్థించుకుంటున్నారనీ, పాకిస్థాన్‌లో ఉగ్రవాదులకు, ఐఎస్ఐఎస్ తక్ఫిరి సిద్ధాంతానికి ఎలాంటి తేడా లేదని అన్నారు. జెడి(యు) ఎంపి సంజయ్ ఝా నాయకత్వాన ఆదివారంనాడు ప్రతినిధిబృందం దక్షిణ కొరియాలో పర్యటించింది. శనివారంనాడు సియోల్ చేరుకున్న ఈ బృందం ఆదివారంనాడు ఇండియన్ డయాస్పోరా సభ్యులతో సమావేశం జరిపింది. మోదీ ప్రభుత్వం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తోందని బృందం ఉద్ఘాటించింది. కొరియా దేశ ప్రముఖులతో ఈ బృందం సమావేశాలు జరిపింది. వీరిలో దక్షిణ కొరియా మాజీ విదేశాంగమంత్రి డా.యూన్ యుంగ్ క్వాన్, విదేశీవ్య వహారాల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు కిమ్ గున్, ఛో హ్యూన్, జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రం డైరెక్టర్ మేజర్ జనరల్ షిన్ సాంగ్ గ్యుయాన్, భారత్‌లో కొరియా మాజీ దౌత్యవేత్త షిన్ బాంగ్ కిల్, లీ జూన్ గ్యు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సియోల్‌లోని భారత దౌత్య కార్యాలయం ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టింగ్ పెట్టింది.ఈనెల 26 వరకూ ఈ బృందం పర్యటన కొనసాగుతుంది. తొలుత ఈ బృందం జపాన్ పర్యటన పూర్తిచేసింది.

సుప్రియాసూలే నాయకత్వాన గల బృందం దోహాలో ఆదివారంనాడు ఖతార్ షురా కౌన్సిల్ డిప్యూటీ స్పీకర్ డా.హమ్దా అల్ సులైతీ, ఇతర ఖతార్ ఎంపీలతో సమావేశమైంది. పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా ప్రపంచానికి భారత్ గట్టి సందేశాన్ని ఇస్తోందని సుప్రియాసూలే బృందం తెలిపింది. డిఎంకె ఎంపి కనిమొళి నాయకత్వానగల బృందం ఆదివారంనాడు రష్యా రాజధాని మాస్కోలో పర్యటించింది. రష్యా ఎంపీలు, అధికారులు, ఇతర ప్రముఖులతో ఈ బృందం సమావేశమైంది. స్లోవేనియాదేశానికి వెళ్ళి పాకిస్థాన్ దుశ్చర్యలను అక్కడి ప్రభుత్వ ప్రతినిధులకు తెలియజేసింది. ఇండియన్ డయాస్పోరా సభ్యులతో బృందం సమావేశమైంది. ప్రముఖ టాస్ వార్తాసంస్థకు చెందిన జర్నలిస్టులతో ఈ బృందం ముందురోజు సమావేశమైంది. ఉగ్రవాదాన్ని ప్రతిఘటించేందుకు భారత్ చేస్తున్న దౌత్యపరమైన కృషిని ఈ బృందం వివరించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రిత్వికకు మూడు బంగారు పతకాలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** సికింద్రాబాద్‌లోని జిహెచ్‌ఎంసి స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 10వ తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ 2025 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారిణి మిట్టాపల్లి రిత్విక సీనియర్ నేషనల్ స్విమ్మింగ్ పోటీల విభాగంలో పాల్గొని ఉత్తమమైన ప్రతిభ కనబర్చి 3 బంగారు పతకాలు సాధించింది. 50 మీటర్ల బెస్ట్‌స్ట్రోక్‌లో 100 మీటర్ల బెస్ట్‌స్ట్రోక్‌లో 200 మీటర్ల బెస్ట్‌స్ట్రోక్‌లో బంగారు పతకం సాధించి జూన్ 22 నుంచి 26 వరకు ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగే 78వ నేషనల్ అక్విటిక్ ఛాంపియన్‌షిప్ 2025 జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ఎన్నికైంది. రాష్ట్రస్థాయిలో 3 బంగారు పతకాలు సాధించి సీనియర్ నేషనల్ 78వ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మిట్టాపల్లి రిత్వికను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఉమేష్, ఉపాధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, జిల్లా స్విమ్మింగ్ అధ్యక్షులు గడిల శ్రీరాములు, సభ్యులు వేణుగోపాల్, శ్యాంసుందర్‌రెడ్డి, కైసర్, యం. శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

## తల్లిదండ్రులు పిల్లలను శక్తిమేరకు చదివించాలి

బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యను రాబోయే తరానికి అందించే క్రమంలో పిల్లలను వారి శక్తి మేరకు చదివించాలని తల్లిదండ్రులకు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. అప్పుడు సమాజంలో అందరూ విద్యకు దగ్గరవుతారన్నారు. మహిళలను స్వేచ్ఛగా ముందుకు తీసుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఆదివారం సామాజికవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే సినిమాను బిసి ప్రజా ప్రతినిధులతో పాటు బిసి సంఘాల నేతలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ వీక్షించారు.
అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటిసారిగా వెనుకబడిన బలహీన వర్గాలకు సంబంధించి కాకాసాహెబు కాలేల్కర్ ఒక ప్రతిపాదనను సిద్ధం చేశారన్నారు. ఆయన ప్రతిపాదన మేరకు బిసి మండల కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. దేశంలో బిసిల వికాసం కోసం వీరు పని చేశారని చెప్పారు. వీరికి స్ఫూర్తి జ్యోతిరావు పూలే అని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. వీరందరి కృషిని కొనసాగిస్తూ తెలంగాణ ప్రభుత్వ సారథ్యంలో దేశంలోనే తొలిసారిగా కుల గణన చేపట్టడం జరిగిందన్నారు. పూలే ఆశయ సాధనకు సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు.
సామాజిక సంస్కరణలు, సమానత్వం కోసం పూలే ఎంతో కృషి చేశారని తెలిపారు. అందుకు మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తిదాయకమన్నారు. సినిమాలో చూపించిన సారాంశాన్ని ప్రతి బలహీన వర్గాల బిడ్డ సమాజంలో ఎవరూ విద్యకు దూరంగా ఉండకుండా చూడాలన్నారు. మహిళా అభ్యున్నతి మహిళా సాధికారత సాధించాలన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్లు వచ్చినప్పుడు ఎస్‌సి, ఎస్‌టిలకు సైతం ఇవ్వాలన్నప్పుడు ఆ బిల్లు పెండింగ్‌లో పడిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డిని సినిమా ప్రముఖులతో కలిసి ట్యాక్స్ మినహాయింపు జరిగేలా చేస్తామని మంత్రి హామీనిచ్చారు.

## కెసిఆర్ మాకు బాస్.. ఆయన బాటలోనే నడుస్తాం

కవిత పార్టీ పెట్టడం ఊహాగానాలే : ఎమ్మెల్యే గంగుల

**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి/కొత్తపల్లి:** బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ మాకు నాయకుడని.. ఆయన బాటలోనే నడుచుకుంటామని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కెసిఆర్ ఆదేశాలను పాటిస్తామన్నారు. ఎమ్మెల్సీ కవిత పార్టీ పెట్టడం అనేది ఊహాగానాలేనని కొట్టిపడేశారు. ఆదివారం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 20వ డివిజన్‌లో గల ఆరెపల్లిలో స్మశాన వాటికలో అభివృద్ధి, కల్వర్టు నిర్మాణ పనులకు నగర బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్లహరిశంకర్, స్థానిక మాజీ కార్పొరేటర్ తుల రాజేశ్వరి బాలయ్యలతో కలిసి ఎమ్మెల్యే గంగుల భూమి పూజ చేశారు.

ఇండోమాక్ ఆధ్వర్యంలో దక్షిణాదిలో..

## అతిపెద్ద ఇండస్ట్రీయల్ 'ఎక్స్‌పో షురూ'

హైటెక్స్‌లో మూడు రోజుల నిర్వహణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణ భారతదేశంలో అతిపెద్ద బి2బి ఇండస్ట్రీయల్ మెషినరీ, ఇంజనీరింగ్ ఎక్స్‌పోను హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో కోయికె కట్టింగ్ అండ్ వెల్డింగ్ ఇండియా లిమిటెడ్ సిఒఒ, డైరెక్టర్ టి కుమగాయ్ శాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మనీష్ సిన్హా డైరెక్టర్ ఇండోమాక్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ ఈనెల 25వ తేదీ వరకు జరగనుందన్నారు. ఈ ఎక్స్‌ఫోకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఆరున్నర వరకు ఉచిత ప్రవేశం కల్పించామన్నారు. ఇది నాలుగో ఎడిషన్ అన్నారు. గతంలో 2022, 2023, 2024 సంవత్సరాలలో నిర్వహించిన మూడు ఎడిషన్లు అనూహ్య విజయాన్ని సాధించాయన్నారు. ప్రతి సంవత్సరం భారతదేశంలోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రాలలో ముఖ్యంగా జంషెడ్ పూర్, నాగ్‌పూర్, హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు. మెషిన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇంజనీరింగ్ ఉత్పత్తులపై ప్రత్యేకంగా ఏర్పాటైన ఈ ప్రదర్శనలో ఇంజనీరింగ్ ఉత్పత్తులు, సేవలు, హెవీ, లైట్ మెషిన్లు, యంత్రోపకరణాలు, యాక్సెసరీస్, టూల్స్, సాంకేతిక పరికరాలు, ఇంజినీరింగ్ టూల్స్, అనుబంధ ఉత్పత్తుల సేవలు ఈ ప్రదర్శనలో ఉన్నాయన్నారు. అత్యాధునిక సాంకేతికత, ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు, ఆధునిక పరిష్కారాలతో కూడిన విస్తృతమైన ఇండస్ట్రియల్ అప్లికేషన్లను ఆవిష్కరిస్తున్నామని తెలిపారు.

**ప్రదర్శనలో అంతర్జాతీయ బ్రాండ్లు : కుమగాయ్ శాన్**

కోయికె కట్టింగ్ అండ్ వెల్డింగ్ ఇండియా లిమిటెడ్ సిఒఒ, డైరెక్టర్ టి కుమగాయ్ శాన్ మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి 125పైగా ప్రదర్శకులు పాల్గొంటున్నారన్నారు. ఇది ఇండస్ట్రియల్ మెషినరీ కొనుగోలుదారులు, అమ్మకందారులకు ప్రత్యేకంగా ఉంటుందన్నారు. 750 పైగా లైవ్ మెషిన్లను, 900 పైగా జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు ఈ ప్రదర్శనలో భాగంకావడం ఈ ఎక్స్‌ఫో ప్రత్యేకతన్నారు. ఈ మూడు రోజులు దేశం నలుమూలల నుంచి ముఖ్యంగా దక్షిణ భారతదేశం, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్, ఒడిషా వంటి రాష్ట్రాల నుంచి 18,000 పైగా సందర్శకులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ప్రదర్శనలో సుమారు రూ.400 కోట్ల వ్యాపారం జరగనుందన్నారు. ఈ ఎక్స్‌ఫోలో ప్రముఖ భారతీయ కంపెనీలలో అశ్విని ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీస్, టపారియా టూల్స్ లిమిటెడ్, ట్రాంటర్ ఇండియా, కోయికె కటింగ్ అండ్ వెల్డింగ్, క్రైన్స్ ఇన్‌స్టుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డిబి ఎంటర్‌ప్రైజెస్, హాన్స్‌పార్క్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ట్రినిటీ అడ్వానస్డ్ సాఫ్ట్‌వేర్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్, మెటల్ ఆర్క్, నిపెన్ ఎలక్ట్రికల్, సువేరా ఫ్లూయిడ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, అశ్లోక్ సేఫ్ అర్థింగ్ ఎలక్ట్రోడ్ లిమిటెడ్, ఎసెల్, ఎంసిఎం ఇన్‌స్టుమెంట్స్, ధ్రువ్‌సాఫ్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, జైన్సన్ కేబుల్స్, ఫ్లెక్సోఫిట్ ఎంజిసోల్, పోమ్ సిస్టమ్స్, సర్వీసెస్, సెలెక్ కంట్రోల్, రత్నపార్కి ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీస్, మెస్సర్ కటింగ్, పానాసోనిక్ కనెక్ట్, కెటెక్ సిఎన్‌సి, కాంటినెంటల్, ఇంగికో, ఐడియల్ పవర్, ఎంవిడి ఫాస్టనర్స్, డైమండ్ కంప్రెసర్, డివైన్ లేజర్, గ్రీవ్స్ కాటన్, ఏషియన్ ఎక్విప్‌మెంట్, కాన్ పవర్ రబ్బర్ ఇండస్ట్రీస్, రిలయాన్ సాఫ్టెక్ లిమిటెడ్, స్పూర్స్ టెక్నాలజీ సొల్యూషన్స్, 3డి లెవిన్ ఇంజనీరింగ్ తదితర సంస్థలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పారామౌంట్ బిల్డింగ్ సొల్యూషన్స్ రమన్ ట్రేడింగ్ డైరెక్టర్ అనీష్ అగర్వాల్ పాల్గొన్నారు.



## గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం

- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :**

జిల్లాలో మద్యం వ్యాపారం కొత్త పుంతలు తొక్కుతున్న ది. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి కాసుల వేటలో మద్యం ఏరులై పారుతున్నది. రిటైల్ మద్యం షాపులు దక్కించుకున్న మద్యం వ్యాపారులు రిటైల్‌గా ఎమ్మార్పీ రేట్లకు మద్యం అమ్మకాలు చేస్తే ఆదాయం తక్కువ వ స్తుందని బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. బెల్టు షా పు నిర్వాహకులకు ఎమ్మార్పీ రేటు కంటే రూ. 20 నుం చి 30 ఎక్కువ ధరకు అమ్మడం వల్ల సామాన్యులు దోపిడీకి గురవుతున్నారు. మద్యం వ్యాపారుల క్రమ సంపాదనకు అధికారులు అండదండలు ఉన్నాయనే అనుమానం ప్రజల్లో నెలకొంది. జిల్లా వ్యాప్తంగా మద్యం షాపుల వ్యాపారులు సిండికేట్‌తో విచ్చలవిడి అమ్మకాలకు తెర లేపారు. మద్యం స్టాక్ వచ్చిన గంటలోనే బె ల్టు షాపు నిర్వాహకులకు హోల్‌సేల్‌గా మద్యం అమ్మకాలు చేస్తూ సమయానికి ముందే వైన్ షాపులు మూసివేసి బెల్టు షాపుల వారికి సహకరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిటైల్‌గా మద్యం అమ్మకాలు చే యాల్సిన వ్యాపారులు హోల్‌సేల్‌గా అమ్మడం అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందనేది బహిరంగ ర హస్యం. ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే 24 గంటల పాటు బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఓ వైపు ప్రభుత్వ వైన్ షాపుల్లో మరో వైపు బెల్టు షాపుల్లో అధిక రేట్లకు మద్యం విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్య క్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. ఒక్కో మండలంలో గ్రామపంచాయతీల్లో దాదాపు 200పై చిలుకు బెల్టు షాపులు ఉన్నాయంటే అధికారుల అండదండలు మద్యం వ్యాపారులకు ఎంతలా ఉన్నాయో అర్థం అవుతుంది. ఎక్కడపడితే అక్కడ తాగినోడికి తాగినంత.. మందు మస్తుగా దొరుకుతున్నదని.. ఏ ఊర్లో చూసినా, ఏ గల్లికి వెళ్లినా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మద్యాన్ని బహిరంగంగా విక్రయిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఎక్కడ చూ సినా వైన్ షాపు టూ వయా బెల్టు సాపుల అక్రమ రవాణాతో అక్రమ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతున్నది. ఈ విషయంలో సంబంధిత ఎ క్సైజ్ అధికారులు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతోందని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

**చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు**

పట్టపగలే బెల్టు సాపులకు మద్యం తరలివెళ్తున్నా తెలిసినప్పటికీ మద్యం అక్రమ విక్రయాల పట్ల ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టవు అన్నట్లు గాఢ నిద్రలో మునిగిపోయారని విక్రయిస్తున్నారు. మరోవైపు బెల్టు షాపుల వల్ల మద్యపానం వినియోగం పెరగడమే కాకుండా నియంత్రణలేని మద్యం అమ్మకాలతో అనేక మంది అనారోగ్యం బారినపడి అప్పుల పాలవుతున్నారని, ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు బెల్టు షాపుల వల్ల ఆకతాయిల వల్ల మహిళలు వేధింపులకు గురవుతారని, అల్లరి మూకలు పెట్రేగిపోతున్నారని అందువల్ల బెల్టు షాపులను ఎక్కడకక్కడ కట్టడి చేయాలని కోరుతున్నారు. ప్రజల ఫిర్యాదులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి వీటిపై కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం అక్రమ దందాను నియంత్రించి, నిబంధనలను పాటించని వైన్ దుకాణాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**ఫంక్షన్ హాళ్లను తలపిస్తున్న పర్మిట్ రూమ్‌లు**

ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం వైన్ షాపులకు కేటాయించిన పర్మిట్ రూములు కేవలం మందు బాబులు నిలబడి తాగి వెళ్లేలా ఉండాలి కాని జిల్లా కేంద్రంలోని ప్రముఖ స్థలాలలో వైన్ షాపుల యాజమానులు పర్మిట్ రూమ్ ఏకంగా ఫంక్షన్ హాలు సైజులో నిర్మించి బా ర్లలో మాదిరిగా మందు బాబులకు సకల సౌకర్యాలు కలిపిస్తున్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా పలు వైన్ షాపుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని, కనీసం ఆయా ప్రాంతాలలో తనిఖీలు కూడా చేపట్టడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి

## పందెం లేకుండా పేకాట, క్రీడావినోదాలు

నైతిక దిగజారుడుతనం కాదు 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** డబ్బుఆశ, మోసానికి తావిచ్చే పందెం–జూదం ప్రమేయాలు లేకుండాపేకాట ఆడటం, క్రీడలు ఆడటం, వినోద కార్యకలాపాలు నిర్వహించడం నైతిక దిగజారుడుతనం కిందకు రాదని సుప్రీంకోర్టు పేర్కొంది. బెట్టింగ్ (ఊహాగానాలతో డబ్బును గెలుచుకోవడానికి ఆటలను ఉపయోగించుకోవడం) లేకుండా, జూదం లేకుండా, ధనాన్ని ఉపయోగించకుండా పేకాట, వినోదం,క్రీడలు వంటివి అధమస్థాయి చర్యలు కాదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. వై.సి.హనుమంతప్పకేసులో సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ విషయం వెల్లడించింది.
ప్రభుత్వ పింగాణీ ఫ్యాక్టరీ ఉద్యోగుల గృహనిర్మాణ సహకార సంఘం లిమిటెడ్ డైరెక్టర్స్ బోర్టుకు సభ్యుడుగా ఎన్నికైన హనుమంతప్ప మరికొందరు రోడ్డుపక్కన కూర్చుని పేకాట ఆడుతుండగా పట్టుబడ్డారు. ఐతే హనుమంతప్పపై ఎలాంటి విచారణ చేయకుండా రూ.200లు ఉద్దేశపూర్వకంగా జరిమానా విధించారన్న కేసులో కోర్టు ఈ విషయం చెప్పింది. ''చాలా ప్రకృతిసహజసిద్ధంగా ఆలోచిస్తే, ఫిర్యాదుచేసిన వ్యక్తికి దుష్ప్రవర్తనను ఆపాదించి అతడి నైతిక దిగజారుడుతనాన్ని నిర్దేశించడం చాలా కష్టమైన విషయం, నైతిక అధమత్వాన్ని, ప్రవర్తనను నిర్దేశించడానికి సమాజంలో వారి భావవ్యక్తీకరణ ద్వారా నిర్దేశిస్తారు, న్యాయపరంగా, చట్టపరంగా సమాజంలో వారి సంభాషణ ద్వారా నైతిక ప్రవర్తనను నిర్దేశిస్తారు, ఇది మనిషిలో అంతర్గతంగా ఉండేది, భ్రష్టుత్వం, అవినీతి వంటివి దీనితో ముడిపడి ఉంటాయి కొంతవరకూ. ప్రతిమనిషి చేసే ప్రతి చర్యా కూడా అతడి నైతిక భ్రష్టుత్వాన్ని, దిగజారుడుతనాన్ని నిర్దేశించదు, మనం భృకుటి ముడివేసి సందేహంగా చూసే ప్రతిచర్యనూ దిగజారుడుతనంగా భావించలేం, హనుమంతప్ప విషయానికి వస్తే అతడు అలవాటుగా జూదం ఆడేవ్యక్తికాదు, బెట్టింగ్ ఆడేవ్యక్తికాదు, పేకాట ఆడటంలో అనేక పద్ధతులు ఉంటాయి, అందులో నైతిక దిగజారుడుతనం కూడా ఉంటుంది, నిజానికి మనదేశంలోని చాలా ప్రాంతాలలో చాలాచోట పేకాట ఆడతారు, కానీ అందరూ డ బ్బును పందెంగా వేసి పేకాట ఆడరు, వినోదం కోసం ఆడారు, పేకాట అనేది పేదవాడికి తక్కువ ఖర్చుతో వచ్చే వినోదం'' అని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. హనుమంతప్ప ప్రభుత్వ పింగాణీ ఫ్యాక్టరీ ఉద్యోగుల గృహనిర్మాణ సహకార సంఘం లిమిటెడ్ డైరెక్టర్స్ బోర్టుకు సభ్యుడుగా చాలా భారీ ఓట్ల మెజారిటీతో 2020 ఫిబ్రవరి 12న గెలిచారు. ఆయన చేతిలో ఓటమి చెందిన బి.రంగనాథ్ ఎన్నికల వివాదం లేవదీశారు.
కోఆపరేటివ్ సొసైటీ జాయింట్ రిజిస్ట్రార్ వద్ద వివాదం సందర్భంగా ఆయన ఈ జూదం విషయం లేవనెత్తారు. హనుమంతప్ప కర్ణాటక పోలీసు చట్టం కింద ఒక క్రిమినల్ కేసులో శిక్షకు గురయ్యారని ఆయన పేర్కొన్నారు. ఐతే జూదం ఆయన సహజసిద్ధమైన వైఖరి కాదు అని ధర్మాసనం పేర్కొంది.

## నేటి నుంచి సిపిఐ హనుమకొండ జిల్లా మహాసభలు

హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి



**ప్రజాపక్షం/హనుమకొండ :** మే 26, 27 రెండు రోజులపాటు హసన్పర్తి మండల కేంద్రంలో జరుగుతున్న హనుమకొండ జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి మాట్లాడా రు. గత మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో పార్టీ పేదలు, కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగస్తులు, వృత్తిదారులు, సామాజిక సమస్యలపై చేసి న పోరాటాలను సమీక్షించుకొని, భవిష్యత్తు పోరాటాలను రూపకల్పన చేసుకునేటందుకు రెండు రో జులపాటు మహాసభలను జరుపుకుంటున్నదని భిక్షపతి తెలిపారు. జిల్లాలోని 14 మండలాల్లో, పరకాల మున్సిపాలిటీ తో పాటు హనుమకొండ కార్పొరేషన్ పరిధిలో 5000కు పైగా ఉన్న పార్టీ సభ్యులు, 140 పార్టీ శాఖలకు, ప్రజా సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 300 మంది పార్టీ శాఖ కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, జిల్లా నాయక త్వం ఈ మహాసభలో పాల్గొంటున్నట్టు తెలిపారు. మొదటిరోజు సుమారు 5 వేల మందితో భారీ బహిరంగ సభను హసన్ పర్తి మం డల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నట్లు తెలియజేశారు.

## క్యాన్సర్‌పై పరిశోధనకు డాక్టరేట్

అంతర్జాతీయ స్థాయిలో ప్రవీణ్‌కుమార్‌కు ప్రశంసలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** క్యాన్సర్ వైద్యం పై పరిశోధన చేసినందుకు కన్నెకంటి ప్రవీణ్‌కుమార్ డాక్టరేట్ సాధించారు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల దమ్మపేట ప్రిన్సిపాల్ డా॥ కన్నెకంటి వెంకటేశ్వర్లు కుమారుడు కన్నెకంటి ప్రవీణ్‌కుమార్ ప్రొ॥ టి. నర్సింహాస్వామి పర్యవేక్షణలో హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్స్ సైన్సెస్ (ఐఐసిటి), సెంటర్ ఫర్ సెక్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ (సిసిఎంబి) సహకారంతో ప్రవీణ్‌కుమార్ చేసిన పరిశోధనలు ఉత్తమ ఫలితాలు ఇవ్వడంతో డాక్టరేట్ అందుకున్నారు. అంతేకాకుండా క్యాన్సర్ వ్యాధి ట్రీట్‌మెంట్‌లో వాడే మందులపై తాను చేసిన ప్రయోగాలను ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో ప్రచురించి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందారు. ప్రస్తుతం క్యాన్సర్ వైద్యంలో వాడుతున్న మందుల కంటే తాను సూచించిన రసాయనాల మిశ్రమాన్ని తగు మోతాదులో వాడితే క్యాన్సర్ వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చునని శాస్త్రీయంగా నిరూపించినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఐసిటి, సిసిఎంబి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి ప్రతిష్ఠాత్మక అవార్డు



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర విద్యారంగంలో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నందుకు గాను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.వి.నరేందర్‌రెడ్డికి ప్రతిష్ఠాత్మక వెంకట్ ఫౌండేషన్ వై.రఘునాథం ఎక్సలెన్స్ అవార్డు వరించింది. ఈ మేరకు ఆదివారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో వెంకట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వేడుకలో రిటైర్డ్ ఐపిఎస్, పూర్వ జాయింట్ డైరెక్టర్ సిబిఐ వివి లక్ష్మినారాయణ, వెంకట్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ గంప వెంకట్, ఇతర అతిథుల చేతుల మీదుగా అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అతిధులు, నిర్వాహకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి మార్గదర్శకంగా నిలుస్తూ ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తున్నారన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అత్యుత్తమ విద్యను అందిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యారంగాలలో సమూలమైన మార్పులు తీసుకువస్తున్నందుకు గాను వై.రఘునాథం ఎక్సలెన్స్ అవార్డు ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా విద్యారంగానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని, ఎంతో మంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే కాకుండా వారిని ప్రతిష్ఠాత్మక స్థానాలలో స్థిరపడేందుకు ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఈ అవార్డు బాధ్యత మరింత రెట్టింపు చేసిందన్నారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన సిబ్బందికి, ప్రోత్సాహాన్ని అందిస్తున్న తల్లిదండ్రులకు అందికితమిస్తున్నానని తెలుపుతూ సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## కుంభమేళాను తలపించిన త్రివేణి సంగమ తీరం

- కాళేశ్వరం క్షేత్రానికి పోటెత్తిన భక్త జనం
- భక్తజన సంద్రంగా మారిన పుష్కర ఘాట్
- సోమవారంతో ముగియనున్న సరస్వతీ పుష్కరాలు







**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతి నిధి/ కాళేశ్వరం:** సరస్వతీ నమస్తుభ్యం పుష్కర స్నానం కరిష్యామి పుణ్య ఫలం సిద్ధిర్భవతుమే సదా॥ జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న 11వ రోజు సరస్వతీ పుష్కరాల సందర్భంగా వీకెండ్ ఆదివారం త్రివేణి సంగమ తీరానికి లక్షలాదిగా భక్తులు పోటెత్తడంతో సరస్వతీ నదీమాతల్లి పులకించిపోయింది. సరస్వతీ పుష్కరాలు చివరి ఘట్టం సోమవారంతో ముగుస్తుండగా పుష్కర స్నానాలకు తరలివచ్చిన భక్తజనం తాకిడి పెరిగి త్రివేణి సంగ మ పుష్కర ఘాట్ ప్రాంతమంతా ఇసుక వేస్తే రాలనంతగా దక్షిణ కుంభమేళాగా సంతరించుకుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు సరిహద్దు మహారాష్ట్ర,ఛత్తీస్ ఘడ్, ఒడి శా తదితర దేశం నలుమూలల నుండి తెల్లవారుజాము నుండే క్షేత్రానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. సరస్వతీ నదిమాతల్లి ఒడిలో భక్తుల పుష్కర స్నానాలతో భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. పుష్కర స్నానాలు ఆచరించిన భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ దర్శనానికి భక్తుల రద్దీ అంతకంతుకు పెరిగి భక్తజన జాతరగా మారింది. ఆదివారం వీకెండ్ సందర్భంగా పుష్కరాల భక్తుల రద్దీని అంచనా వేసిన అధికారయంత్రాంగం భక్తుల రద్దీకి అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా వాహనాల ను పార్కింగ్ స్థలాలలో నిలిపివేసిన అధికార యంత్రాం గం సరస్వతీ పుష్కర ఘాట్, గోదావరి ప్రధాన రహదారి, గ్రామ పంచాయతీ బైపాస్ మార్గాల ద్వారా త్రివేణి సం గమ పుష్కర ఘాట్ తీరానికి కాలినడకన ప్రయాణాలను మాత్రమే అనుమతించడంతో పిల్లలు,వృద్ధులతో భక్తులు సుమారు 3కిలోమీటర్ల మేర పుష్కర ఘాట్ తీరానికి కాలినడక ప్రయాణాలతో ఇబ్బందులు పడ్డారు. పు ష్కర స్నానాల అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం లో భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి ఆలయానికి భక్తుల రద్దీ భారీస్థాయిలో పెరగటంతో క్యూలైన్లు భక్తులతో బారులు తీరగా స్వామి వారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో గంటల కొద్ది వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. స్వామివారి దర్శ నంకో సంక్యూలైన్లలోభక్తులకు3నుండి4గం:సమయం పట్టింది.
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో చివరి దశకు చేరుకున్న 11వ రోజు

**10 కి.మీ మేర ట్రాఫిక్ జామ్**

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా ఆదివారం వీకెండ్ సందర్భంగా పుష్కర స్నానాలకు భక్తుల వాహనాల తాకిడి భారీగా పెరగడంతో పలు మార్గాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాళేశ్వరం అన్నారం మార్గంలో సుమారు 10 కి.మీ మేర ట్రాఫిక్ జామ్ తో వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోగా మరో మార్గమైన కాళేశ్వరంచెన్నూర్ మార్గంలో 8 కి.మీ మేర ట్రాఫిక్ జామ్ తో వాహనాలు స్థంభించిపోయాయి. వాహనాలకు గంటల కొద్ది ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. పిల్లలు, వృద్ధులతో పాటు భక్తులు తాగునీటి సౌకర్యం లేక అలమటించారు. అన్నారం మార్గంలోని పూస్కుపల్లి నుండి పుష్కర ఘాట్ మార్గంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, డిటి కృష్ణ ఆధ్వర్యంలో మొబైల్ ఆటో ద్వారా భక్తులకు తాగు నీటిని సరఫరా చేశారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు




**ప్రజాపక్షం/కుల్కచర్ల:** అక్రమంగ ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పుటుకొని కేసు నమోదు చేసిన కుల్కచర్ల పోలిస్‌లు, కుల్కచరల ఎస్‌ఐ రమేష తెలిపిన వివరాల ప్రకరం పరిగి నియోజకవర్గంలోని కుల్కచర్ల మండల పరిధిలోని బొమ్మిరెడ్డి పల్లి గ్రామ శివారులో పోలీసులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించడం జరిగింది అని ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా తరలిస్తే ఎంతటివారినైనా వదిలినపెట్టే ప్రసక్తి లేదన్నారు.

## పేదల ఇండ్లలో ఉచిత విద్యుత్ వెలుగులు




**ప్రజాపక్షం/అల్వాల్ :** పేదల ఇంట్లో విద్యుత్ వెలుగులు నింపిన మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు రుణపడి ఉంటామని కాలనీవాసులు సంతోష వ్యక్తం చేశారు. మచ్చ బొల్లారం డివిజన్ బాంబే కాలనీ భరత్ నగర్ కౌకూర్ గ్రామాలలో గత 12 సంవత్సరాల నుండి విద్యుత్ లేక ఇబ్బంది పడ్డామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు పేదలకు అందుతున్నాయని మైనంపల్లి హనుమంతరావు చొరవతో ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రామ పాలన అధికారి పరీక్ష



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** గ్రామా పాలన అధికారి పరీక్ష ప్రశాంతగా ముగిసిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. అదివారం వికారాబాద్ జిల్లా కేంద్రాలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గ్రామాపాలన అధికారి పరీక్షను నిర్వహించడం జరిగింది అని అన్నారు. ఇట్టి పరీక్షకు 150మంది అభ్యర్థులకు గాను 143 మంది అభ్యుర్థులు గ్రామ పాలన అధికారి పరీక్షకు హజరు కావడం జరిగింది అని కలెక్టర్ తెలిపారు. ముందుగా జిల్లా కలెక్టర్ ప్రశ్నపత్రాలను సంబంధిత అధికారుల సమక్షంలో సీల్ ఓపెన్ చేశారు. కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డిటిడిఒ కమలాకర్ రెడ్డి ఆర్డిఒ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, ఈ సెక్షన్ అధికారి నేహమత్ అలీ తదితరులు పాల్గోన్నారు.

## సిఎం సహాయ నిధితో ఎంతో మంది పేదలకు వైద్య సేవలు : శ్రీశైలం గౌడ్




**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ముఖ్యమంత్రి సహాయ నిధితో ఎంతో మంది నిరుపేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని షాపూర్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన సమ్మయ్యకు రూ.60,000, బొట్టు లతకు రూ.60,000, గౌరబోయిన రాజమ్మకు రూ. 28,500ల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూన అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సిఎంఆర్‌ఎఫ్ ద్వారా పేద, మధ్యతరగతి ఆరోగ్య పరంగా మేలు జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి సామాన్యునికి సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధృఢ సంకల్పమని తెలిపారు. రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహల నేతృత్వంలో ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య సదుపాయాలు, సేవలు ఎంతగానో అభివృద్ధి చెమదుతున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సైతం అనేక మంది లబ్ధిదారులు కార్పొరేట్ వైద్యం పొందుతూ ఆరోగ్య పరంగా నిలదొక్కుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి : ఎస్‌ఐ



**ప్రజాపక్షం/బొంరాస్‌పేట్:** కొడంగల్ నియోజకరవ్గంలోని బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో అదివారం ఎస్‌ఐ రాహుల్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనఖీలు ,డ్రంక్‌అండ్ డ్రైవ్ , అక్రమంగా తరలించే నకిలీ విత్తనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ హెలిమెంట్ తప్పనిసారి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. అతి వేగం ప్రమాదకరమని రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలని అన్నారు, మైనర్లకు వాహనాలు ఇవ్వకుడదన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెలిమెంట్ , కారు నడిపేటప్పుడు సీటల బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

## ప్రతి కాలనీలో ప్రజలకు మౌలిక వసతుల ఏర్పాటే లక్ష్యం




**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్ పల్లిలోని 15వ వార్డు ప్రణీత్ ఫ్లోరా కాలనీ సభ్యుల ఆహ్వాన మేరకు మేడ్చల్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజు కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం అని తెలియజేశారు. కాగా ఇటీవల వారి కాలనీలో మంచినీటి కనెక్షన్లు ఏర్పా టు చేయించిన సందర్భంగా కాలనీ వాసుల ప్రత్యేక ధన్యవాదాలు తెలియజే స్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భరత్ కుమార్, కాలనీ ప్రెసిడెంట్ నాగమణి, వైస్ ప్రెసిడెంట్ హరీష్, సభ్యులు పెద్దినేని, నాగరాజు, మరియు ఫ్లోరా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రహదారిని మరమ్మతు చేయించాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గత కొద్ది రోజులుగా పాడై పోయి ప్రమాదకరంగా తయారైన రహదారిని మరమ్మత్తు చేయించాలని, దీనిఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని తిరుమలనగర్ కాలనీ వాసులు కోరారు. ఆదివారం ఈ ప్రాంతంలో పర్యటించిన స్థానిక కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్‌ను కల్సిన కాలనీ అధ్యక్షుడు నర్సింగరావు, ప్రతినిధులు బాబురావు, రంగయ్య, మాధవన్, పండారి, రాము, లక్ష్మి , మనోహర్, రత్నం, భాను, హఫీజ్, నరేష్,శంకర్‌లు కలిసి మొర పెట్టుకొన్నారు. త్వరలోనే జిహెచ్ఎంసి అధికారులతో ప్రతిపాదనలు పంపి రోడ్డు పనులు పూర్తి చేయిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.




# అటవీ ట్రెక్ పార్క్‌లో 'నాక్టర్నల్ వాక్'









**ప్రజాపక్షం/హైదరాబాద్:** చిలుకూర్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాక్టర్నల్ వాక్‌తో పాటు పక్షుల వీక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.రంజిత్ నాయక్ తెలిపారు. ఈ ఈవెంట్ అందరిని ఎంతగానో ఆకట్టుకుందని, కనిపించిన వన్యజీవులకేకాదు, ఆయా దృశ్యాలు పాల్గొన్న వారి హృదయాల్లో చెరగని ముద్రగా మిగిలిపోయాయని ఆయన అన్నారు. అడవిలో అడుగేస్తూ, అడవి శ్వాసను విని, ప్రకృతిని స్వరూపంలో అనుభవించాలనుకుంటే ఫారెస్ట్ టెక్ పార్క్‌కు రావాల్సిందేనని ఆయన పిలుపునిచ్చారు.ఈ ఈవెంట్ తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ యొక్క ఎకో టూరి జం బ్రాండ్ 'డెక్కన్ వుడ్స్, ట్రయల్స్' ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6 గంటల నుండి ఆదివారం ఉద యం 6 గంటల వరకు కొనసాగింది.

**వర్ష సూచనతో ఆకాశం**

మబ్బుగా మారినప్పటికీ, అడవి జీవుల కోసం అది అనుకూలమే. ఈ సాహసోపేతంగా 22 మంది ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు. ఈ ఈవెంట్‌లో అన్వేషణను మరిం త ఆసక్తికరంగా పెంచుతుంది అలాగే అడవి యొక్క నిశ్శబ్ద జీవుల దర్శనం జెయింట్ ఫారెస్ట్ స్కార్పియన్లు, అరుదుగా కనిపించే నాగార్జున సాగర్ రేసర్ పాము, ఇంకా రెండు కట్ల పాములు, మార్గాన్ని అడ్డగించిన దృశ్యం పాల్గొన్న వారిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ప్రతి క్షణంలో భద్రత, గౌరవం, అభ్యాసం ప్రధానంగా నిలిచాయి. నేచురలిస్టులు అఖిల్, సుమన్, అపరంజని పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సాగిం ది. రాత్రి అడవి తన రహస్యాలను నెమ్మదిగా చెప్పినట్టే, ఉదయం మాత్రం పక్షుల గానాలతో వెలిగింది. ఉదయం బర్డ్ వాక్‌లో గ్రే బెల్లీడ్ కుక్కూ, బ్లూఫేస్డ్ మాల్కోకా, ఒరియంటల్ హనీ బజార్డ్, శిఖర, ల్యాప్వింగ్స్, నైట్జార్లు, బ్లాక్‌షోల్డర్డ్ కైట్స్ వంటి అరుదైన పక్షులను చూస్తూ ప్రకృతి ప్రేమికులు మంత్రముగ్ధులయ్యారు. ఈ రెండు కార్యక్రమాలకు హాజరైనవారికి ఇది కేవలం వన్యప్రాణుల దర్శనం మాత్రమే కా దు, ఒక లోతైన అనుబంధం, ఆనందం, ఆశ్చర్యం, అనుభవం కలిగిస్తుందని రంజిత్‌నాయక్ తెలిపారు.

## రోడ్డును అక్రమంగా తవ్వి స్థానికులపై దౌర్జన్యం


ఆ ముగ్గురిపై చర్యలకు ప్రభుత్వానికి ప్రొఫెసర్ రతన్‌రెడ్డి విజ్ఞప్తి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** ప్రభుత్వ భూమిలోని ఉన్న రోడ్డును అక్రమంగా తవ్వి మూసివేయడమే కాకుండా ప్రశ్నించిన స్థానికులపై దౌర్జన్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ రతన్‌రెడ్డి, బి.సందీప్ బి.సంధ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దేవరయాంజల్, కండ్లకోయ (సర్వే నం.135/136) గ్రామ శివార్లలోని భూములకు వెళ్లే పబ్లిక్ రోడ్డును స్థానికులైన బండకుంట నర్సింహారెడ్డి, బండకుంట కార్తీక్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి అక్రమంగా తవ్వుతూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఈ తతంగాన్ని ప్రశ్నించిన స్థానిక ప్రజలను దూషిస్తూ రాళ్లతో దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వీరిపై ఇప్పటికే నాలు గు ఎఫ్‌ఐఆర్‌లు నమోదైనా, పోలీసులు, స్థానిక మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. తమ ఫిర్యాదు మేరకు ఈ ఏడాది ఏప్రిల్ 30న హైడ్రా అధికారులు స్పందించి రోడ్డును పునరుద్ధరించారని, వారి వెళ్లిపోయాక మళ్లీ రోడ్డును ధ్వంసం చేశారని పేర్కొన్నారు. 45 రోజులుగా రోడ్డు బంద్ అయిందని, దీంతో స్థానిక మూడు గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. నర్సింహారెడ్డి చేసిన ఆరాచకం, దాడులకు సంబంధించి తమ వద్ద పూర్తి సాక్ష్యాధారాలు ఉన్నాయని వెల్లడించారు. ప్రభు త్వం స్పందించి నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకోని, రోడ్డును పునరుద్ధరించాలని వారు కోరారు.

## గురుకుల విద్యార్థులకు ఉపాధి అవకాశ శిక్షణ తరగతులు


'జూన్ మూడోవారం నుంచి ప్రారంభం : గురుకుల కార్యదర్శి విఎస్.అలగు వర్షిణి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గురుకులాల్లో చదువుతున్న, చదివిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ప్రత్యే క శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఎస్‌సి గురుకులాల కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి తెలిపారు.ఈ శిక్షణ తరగతులను ప్రత్యేక శిక్షణ జూన్ మూడో వారం నుంచి ప్రారంభమవుతుందని, ఒక్కో బ్యాచ్‌లో 40 మంది చొప్పున 45 రోజులు పాటు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 238 గురుకుల కేంద్రాల్లో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని డాక్టర్ అలగు వర్షిణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి, ఐటిఐ,పాలిటెక్నిక్,డిగ్రీ పూర్తి చేసిన,ఫైనల్ ఇయర్ డిగ్రీ చదివే విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులు, నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. దీనికి సంబంధించి ఎస్‌జిబిఎస్ ఉన్నతి ఫౌండేషన్‌తో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఎంఒయు కుదుర్చుకున్నదని తెలిపారు. ఇందులో భాగంగానే 'యుఎస్‌ఎక్స్‌టి' సంస్థ ఆధ్వర్యంలో 165 గంటల నైపుణ్య శిక్షణ అందించనున్నామని, ఇందులో 90 గంటలు తరగతి గదిలో ప్రత్యక్షంగా శిక్షణ ఉండగా, మరో 75 గంటలు సెల్ఫ్ లెర్నింగ్ విధానంలో శిక్షణ ఉంటుందని వివరించారు. 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పూర్వ విద్యార్థులు, ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ శిక్షణ కార్యక్రమానికి అర్హులని చెప్పారు. ఈ శిక్షణలో సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, విలువ ఆధారిత జీవన నైపుణ్యాలు, హెచ్‌ఆర్ సంబంధిత విషయాల్లో స్కిల్స్, ఉద్యోగ ఇంటర్వ్యూలకు కావాల్సిన ప్రతిభ పెంపు వంటి అంశాలు ఉంటాయని వివరించారు. ఈ శిక్షణ అనంతరం విద్యార్థుల వివరాలను 'ఎంప్లాయబిలిటీ పోర్టల్'లో నమోదు చేస్తామని, వీటిని మల్టీ నేషనల్ కంపెనీలు, ఎంఎస్‌ఎంఈలు పరిశీలించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని చెప్పారు. న్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణకు సంబంధించి గురుకుల విద్యాలయాల ప్రిన్సిపల్స్ వద్ద దరఖాస్తు ఫారాలు ఉన్నాయని, ఆయా గురుకుల విద్యాలయాలకు వెళ్లి తమ పూర్తి వివరాలు సమర్పించాలని అలగు వర్షిణి కోరారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత కెసిఆర్‌దే

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత బిఆర్‌ఎస్ పార్టీ అధినేత కెసిఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర శాసనసభ బిఆర్‌ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజుల రామారం డివిజన్ కైసర్‌నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో టూబిహెచ్‌కె డిగ్నిటీ హౌసింగ్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటీవ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ పార్టీ విప్ కెపి వివేకానంద విచ్చేసి మాట్లాడుతూ నిరుపేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చిన మహానేత కెసిఆర్ అన్నారు. సుమారు యాభై నుండి అరవై లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు అందించిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. లబ్ధిదారులంతా బేదాభిప్రాయాలు లేకుండా ఒక్కతాటిపై ఉంటూ సమస్యలను లేని డబుల్ బెడ్ రూమ్ సముదాయంగా అభివృద్ధి చెందాలని సూచించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో నెలకొన్న సమస్యలను ఇప్పటికే పరిష్కరించానని, రానున్న రోజుల్లో కూడా మిగిలి ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస యాదవ్, విజయ్ రాంరెడ్డి, కమలాకర్, నవాబ్ బాయ్, తెలంగాణ సాయి, సమ్మయ్య, వెంకటేష్, దూలప్ప, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, మహేశ్, శివ నాయక్, నవీన్, ఆసిఫ్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం సభ్యులు తదితరలు పాల్గొన్నారు.

**ప్రణాళిక బద్ధంగా కాలనీల అభివృద్ధి...**

ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని వివేకానంద అన్నారు. గాజులరామారం డివిజన్ వీనస్ రాక్స్ హైట్స్ కాలనీలో రూ. 36.80 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిమెంటు రోడ్డు పనులు ఎమ్మెల్యే వివేక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో కోట్లాది రూపాయ నిధులను వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. కాలనీలు, బస్తీలలో మెరుగైన మౌలిక వసతులను కల్పించడమే బాధ్యతగా పనిచేస్తున్నామని అన్నారు.

**మత్స్య సహకార సంఘం అభివృద్ధి కృషి చేస్తా...**

మత్స్య సహకార సంఘం అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలోని ఎఫ్‌సిఎస్ కన్వెన్షన్‌లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జీడిమెట్ల శాఖ ఐదవ సర్వసభ్య సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ పార్టీ విప్ కెపి వివేకానంద విచ్చేసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చెరువులకు జీవం పోస్తూ మత్స్యకార వృత్తిపై ఆ ధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ఆర్థికాభివృద్ధి ని అందించిన ఘనత బిఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. జీడిమెట్ల శాఖ మత్స్య సహకార సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను ఎల్లవేళలా అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ ఫిషరీస్ కోఆపరేటీవ్ చైర్మన్ మన్నెరాజు, జిల్లా ఫిషరీస్ అధికారి సుకీర్తి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జీడిమెట్ల శాఖ అధ్యక్షులు చిలుకూరి కృష్ణ, ఉపాధ్యకురాలు యాదమ్మ, కార్యదర్శి మద్దూరి వీరేష్, డైరెక్టర్‌లు వెంకటేశ్, మన్నె శంకర్, లక్ష్మ న్, సత్తెమ్మ పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్‌టి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసిలో సుదీర్ఘకాలంగా నెలకొన్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డికి ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఆదిల్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్‌లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆదిల్ షరీఫ్, చంద్రశేఖర్ మాట్లాడుతూ నాలుగవ తరగతి ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా పదోన్నతులు లభించక వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సుదీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలన్నారు. కారుణ్య కారణాలను జాప్యం లేకుండా జరపాలన్నారు. జిహెచ్‌ఎంసిలో చాలా మంది పదవీవిరమణ చేసిన ఉద్యోగులు ఇప్పటికీ తమ హక్కుగా పొందవలసిన పదవీవిరమణ ప్రయోజనాల చెల్లింపు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కార్పొరేషన్‌కు సేవ చేయడానికి తమ జీవితాలను అంకితం చేసిన ఈ సీనియర్ సిటిజన్‌లకు సెటిల్‌మెంట్‌లో జాప్యం చేయడంతో ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులను కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. శానిటరీ జవాన్‌లను బదిలీ చేయాలని, జిహెచ్‌ఎంసిలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఎన్‌ఎంఆర్ సర్వీసులను క్రమబద్ధీకరించాలన్నారు. 2020 నుండి పెండింగ్‌లో ఉన్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఐఎన్‌టియుసి ప్రతినిధి బృందం వేం నరేందర్ రెడ్డికి ఈ విషయాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన పరిశీలించి, సకాలంలో పరిష్కారించాలని, అవసరమైన చర్యలను ప్రారంభించాలని విజ్ఞప్తి చేసిందన్నారు. వేం నరేందర్ రెడ్డి తాము తీసుకెళ్లిన సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారన్నారు. జిహెచ్‌ఎంసి కమిషనర్‌తో సమావేశం ఏర్పాటు చేసి, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారన్నారు.



## వనమహోత్సవానికి అధికారులు కసరత్తు

శాఖల వారీగా మొక్కలు కేటాయింపులు



**ప్రజాపక్షం /వికారాబాద్ ప్రతినిధి :** వనమహోత్సవానికి అధికార యంత్రాంగం కసర్తు ప్రారంభించింది. ప్రతి సంవత్సరం లాగానే ఈ సారీ కూడా లక్ష్యాలను నిర్దేశించారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వం హరితహారం పేరట మొక్కలు నాటకగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో అమలు చేస్తోంది. శాఖల వారీగా మొక్కలు కేటాయింపు, అటవీ శాఖకు 3.6లక్షలు, జిల్లా పంచాయతీరాజ్ 4లక్షలు, డిఆర్‌డిఒ, ఎంపిడిఒలు 26.87లక్షలు, ఆర్‌అండ్‌బి 5వేలు, నీటిపారుదల శాఖ 76వేలు, వ్యవసాయశాఖకు 6.38లక్షలు మార్కెట్ 5వేలు, ఉద్యానవన శాఖకు 2.55లక్షలు తదితర శాఖలకు కేటాయించారు. అటవీ గ్రామీణాభీవృద్ధి శాఖల పర్యవేక్షణలో కార్యక్రమం రూపకల్పన చేస్తున్నారు. ఇప్పటివరకు అయా శాఖ అధికారులతో సమీక్షలు చేసి లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సారి వికారాబాద్ జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వర్షాలు ప్రారంభం కాగానే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని సమాయత్తంచేస్తున్నారు.

వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా, అటవీ గ్రామీణాభివృద్ధి శాఖల అధ్వర్యంలో మొత్తం 609 నర్సరీలో మొక్కలను పెంచుతున్నారు. అటవీశాఖ పర్యవేక్షనలో 594 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఉన్నాయి. టేకు మొక్కల పెంపకానికి అధిక ప్రదాన్యత ఇస్తున్నారు. జిపిల్లోని ఒక్కో నర్సరీలో 5వేల నుంచి దాదాపు 30వేల మొక్కలు పెంచుతున్నారు. ఫారెస్ట్ పిఎస్ కింద గచ్చకయ, వెదురు, గుల్‌మోల్, రేస్‌ట్రీ, రవి, మర్రి, కానుగ, తురాయి, గార్డెనింగ్ మొక్కలు పెంచుతున్నారు. హోంసీడ్ కింద ఇంటివద్ద నాటుకునే పూల, పండ్ల మొక్కలను పెంచుతున్నారు. గత ఏడాది 40,54,000 మొక్కలు నాటలని లక్ష్యం గా పెట్టుకోగా 80శాతం మేర టార్గెట్‌ను పూర్తి చేశారు. ఈ సారి కూడా అంతే టార్గెట్ మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. గత ఏడాది కంటే మరింత సమర్థవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

గతంలో నర్సరీల్లో భారీగా మొక్కలు ఎండిపోవ డం నాటిన సక్రమంగా సంరక్షించకపోడం తదిత ర కారణలతో 80శాతం మొక్కలు బతికాయి. ఇది అధికారులు చెప్పే లెక్కలు మాత్రమే వాస్తవం గా కేవాలం 40నుండి 50శాతం మాత్రమే బతికా యి, ఈసారి అలా కాకుండా నాటిన మొక్కల్లో 80శాతనికి పైగా సంరక్షించే విధంగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రోడ్డు పక్కన, పొలం గట్లపై మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**మొక్కలు నాటేందుకు సిద్దంగా ఉన్నాం**

వనమహోత్సవ కార్యక్రమనికి పుర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నా అని వికారాబాద్ జిల్లా అడవిశాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. వర్షాలు పడగానే మొక్కలు నాటలనే అదేశాలు జారీ చేశం అన్ని శాఖల సమనవ్వయంతో మహత్సోవాని వజయవంతం చేస్తాం ,గతం కంటే మెరుగైన పలితలను సాధిస్తాం అన్నారు.

– డిఎఫ్ఒ జ్ఞానేశ్వర్

## ఘనంగా ప్రణవ భక్త సమాజం శతాబ్ది ఉత్సవాలు



**ప్రజాపక్షం/గండిపేట:** పూర్ణాహుతి, గణపతి సహిత రుద్రహోమం, మహాత్ముల దివ్య ప్రవచనాలతో అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ హైందవ నగర్ ప్రణవ భక్త సమాజం ఏకశత పంచోత్తర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాలలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు.ని త్యాన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరిశుద్ధానందగిరి స్వామీ, శంకరానందగిరి స్వామి, వీరానంద బ్రహ్మచారి దివ్య ప్రవచనములు భక్తులను అలరించాయి. ప్రణవభక్త సమాజం అధ్యక్షులు ఎం.నరసింహ, పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, కొండమీది హరినాథ్, ఎన్.బి.హరినాథ్, నారగూడెం మల్లారెడ్డి, కొలన్ సుభాష్ రెడ్డి, మ్యాడం రామేశ్వరరావు, మెంద్ర కొమురయ్య తదితరులను రాజ్ భూపాల్‌గౌడ్ సన్మానించారు.

## కాలనీలకు నిరంతర విద్యుత్ సరఫరా

### కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీలకు నిరంతరం విద్యుత్ సరఫరాను అందించడానికి కృషిచేస్తానని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్‌లోని క్రిస్టియన్ కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌ను అన్ని విధాలుగా అబివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే సమస్యాత్మకమైన కాలనీలకు అధిక నిధులు కేటాయించి దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ కాలనీ అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, కాలనీ సంక్షేమ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు చేవెళ్లకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ రాక

### సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/షాబాద్ :** చేవెళ్లకు సోమవారం సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ రానున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, యువకులకు జన సేవ కోసం పని చేసేందుకు జనసేవ దళ్ కార్యక్రమాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. చేవెళ్ల పట్టణంలో జరిగే ఆరు రోజుల జనసేవ దళ్ శిక్షణ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర్ రావు ప్రారంభించిన జనసేవ దళ్ ద్వారా ఆపదలో ఉన్న నిరుపేదలకు సిపిఐ నాయకులు, శిక్షణ పొందిన సేవదళ్ కార్యకర్తలు అండగా నిలబడారని వివరించారు. మతోన్మాదులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసేందుకు జనసేవదళ్ కార్యకర్తలు ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రామస్వామి పాల్గొన్నారు.

## పార్కు స్థలం అభివృద్ధికి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ విరాళం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** మన్సూరాబాద్ డివిజన్‌లోని వీరన్న గుట్ట పరిధిలో ఉన్న పార్కు స్థలం అభివృద్ధి కోసం 30 వేల నగదును విరాళంగా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్‌రెడ్డి కాలనీ వాసులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో పార్కు స్థలం అందిరికి ఉపయోగం ఉండడానికి తన సహకారం ఎల్లపుడూ ఉంటుందన్నారు. పార్కు స్థలం చెదును కోసం తన వంతుగా నగదు అందచేయడం జరిగిందని తెలిపారు. అనంతరం కాలనీల్లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గ ఎంఎల్‌ఏ దేవి రెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో కాలనీల్లో డ్రైనేజీ పనులు శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. డ్రైనేజీ సమస్య పూర్తి అయితే చుట్టుపక్కల కాలనీలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బిసిలు ఏకతాటిపై నిలిస్తేనే సమస్యల పరిష్కారం

### బిసిసేన ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షురాలు జలజ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** బిసిలందరు ఏకతాటి నిలిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని బిసిసేన ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షురాలు జక్కల జలజ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ గ్రామంలో నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జలజ మాట్లాడుతూ బిసిలందరు సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యం కావాలన్నారు. బిసి మహిళా కమిటి అధ్యక్షురాలుగా కూచురి అనురాధ, ఉపాధ్యక్షురాలుగా కూచురి నర్సమ్మ, ప్రధాన కార్యదర్శిగా గోవా అలవేలు, కార్యదర్శిగా చాకలి చిట్టి, సహాయ కార్యదర్శిగా చాటి చిట్టిలను ఏన్నుకున్నారు. బీసిసేన కమిటి అధ్యక్షులుగా బోయ శేఖర్, ఉపాధ్యక్షులుగా మంగలి తరుణ్, ప్రధాన కార్యదర్శిగా బూత శివ, కార్యదర్శిగా కురువ శివ, కోశాధికారిగా నందరాజు గౌడ్ సలహాదారులుగా కూతురి కృష్ణయ్య గౌడ్, సలహాదారులుగా ఎల్.రామలింగంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసిసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలోనే తీరుతున్న సొంతింటి కల : చల్లా



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఫరూఖ్‌నగర్ మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చల్లా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి బాటలు వేస్తున్నాయని, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, సబ్సిడిపై వంటగ్యాస్ వంటి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అర్జున్, వట్టెల మాధవి, ఎర్రోళ్ల సునీత, రంగంపల్లి సురేష్ గౌడ్, హరికృష్ణ యాదవ్, సాయికుమార్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ వట్టెల మల్లేష్ యాదవ్, ఎర్రోళ్ల అశోక్, గోదా రమేష్ యాదవ్, చీపిరి గణేష్, రంగంపల్లి శ్రీధర్ గౌడ్, మంగలి రమేష్, శంకరయ్య, కమ్మరి రవిచారి, మల్లేష్ గౌడ్, మంగలి మహాదేవ్, కటిక గణేష్, సిద్ది రవితేజ, సిద్ది శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## దోమల బెడద నివారణకు జిహెచ్‌ఎంసి ముమ్మరంగా ఫాగింగ్







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో దోమల బెడద నివారణకు ఫాగింగ్ చర్యలను జిహెచ్‌ఎంసి ముమ్మరం చేసింది. వర్షాకాలం ముందే దోమల బెడద నివారణ చేసి, రానున్న వర్షాకాలంలో దోమల నివారణను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు దోహద పడుతుందనే ఉద్దేశ్యంతో ప్రయోగాత్మకంగా కొన్ని సర్కిళ్లలో ఫాగింగ్ చర్యలను పెద్ద ఎత్తున చేపట్టామని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో గోషామహల్ సర్కిల్‌లో దత్తాత్రేయ నగర్, ముసారాంబాగ్ డివిజన్‌లో అరోరా కాలేజ్ వెనుక భాగంలో ఫాగింగ చేపట్టారు. అంబర్ పేట్ డివిజన్‌లో పటేల్ నగర్, న్యూ పటేల్ నగర్ చెన్నారెడ్డి నగర్, కాకతీయ లైన్, బాబు నగర్ పాలిటెక్నిక్ రోడ్డు, ఆకాష్ నగర్ కుమార్ నగర్, ఓవైసీ నగర్ ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టారు. కొన్ని ప్రాంతాలలో వీఎంఎఫ్ యంత్రాల ద్వారా, మరికొన్ని ప్రాంతాల్లో పిఎంఎఫ్ యంత్రాల ద్వారా ఫాగింగ్ పెద్ద ఎత్తున చేపట్టారు. సరూర్‌నగర్ సర్కిల్ గడ్డిఅన్నారం డివిజన్. కాప్రా సర్కిల్‌లో వెంకటేశ్వర నగర్, మంగాపురం కాలనీ, కృష్ణ నగర్ కాలనీలో మీర్‌పేట్ హెచ్‌బి కార్పొరేటర్ జెర్రీ పోతుల ప్రభుదాస్ ఫాగింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ముషీరాబాద్ సర్కిల్ దోమల్‌గూడ, ఉప్పల్ సర్కిల్ స్వరూప్ రెడ్డి నగర్, జీడిమెట్ల డివిజన్ వెన్నెల గడ్డ, నాగోల్ డివిజన్ అరుణ కార్పొరేటర్ పాల్గొన్నారు. పటాన్ చెరువు రాఘవేంద్ర కాలనీలో మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## మిస్ వరల్డ్ వేడుకకు 'మెట్రో రైల్' విస్తృత ప్రచారం







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ వేడుకలలో హైదరాబాద్ మెట్రో రైల్ కూడా నేను సైతం అంటూ భాగస్వామ్యం అయ్యింది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మెట్రోరైల్ కూడా ఈ కార్యక్రమాన్ని అందరికి చేరవేయాలన్న సంకల్పంతో విస్తృత ప్రచారం చేపట్టింది. తెలంగాణలోని వివిధ పర్యాటక ప్రాంతాల ప్రాశస్త్యాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు ప్రపంచ సుందరీమణులను తెలంగాణాకి పరిచయం చేసేలా అటు హైటెక్ సిటీ నుండి నాగోల్ వరకు ఇటు మియాపూర్ నుండి ఎల్.బి. నగర్ వరకు పలు ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లు, మెట్రో స్తంభాలు, రహదారులకు ఇరువైపులా ఉన్న మెట్రో రైలింగ్‌లపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆకర్షణగా నిలిచాయి. మెట్రో రైళ్లలో స్క్రీన్‌లపైన, మెట్రో స్టేషన్ ప్లాట్ ఫామ్‌లు కాన్ కోర్స్‌లలో ప్రకటనల బోర్డుల పైనా మిస్ వరల్డ్ వేడుకలను ప్రతిబింబించేలా విస్తృతంగా ప్రచారం చేపట్టింది. ఇక రహదారుల నుండి స్టేషన్లలోకి వెళ్ళే ప్రవేశ ద్వారం వద్ద సంప్రదాయ చిత్రాలతో కూడిన ఆర్చ్‌లను ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు మరింత వన్నె తెచ్చింది. రోజూ దాదాపు నాలుగున్నర నుండి అయిదు లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యాలకు చేరుస్తున్న మెట్రో రైల్ ఈ ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ కార్యక్రమం ద్వారా తెలంగాణ వారసత్వ సంపదను నలుగురికీ తెలియజేసే బృహత్ కార్యక్రమంలో పాల్గొంటోందని మెట్రోరైల్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మి నరసింహస్వామి ఆధ్యాత్మిక సంరంభం, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన అమ్రాబాద్ పులుల అభయారణ్యం, ఐక్యరాజ్య సమితి గుర్తించిన వారసత్వ ప్రాంగణం రామప్ప దేవాలయం, తెలంగాణ సంప్రదాయాలకు కీర్తి పతాకగా నిలిచిన బోనాలు, బతుకమ్మ, చార్మినార్ వంటి విశేషాలతో కూడిన ఆకర్షణీయ దృశ్యాలను 'మెట్రో రైల్' ఈ వేడుకల సందర్భంగా మరింత విస్తృత ప్రచారం కల్పించిందన్నారు.

## నారాయణపూర్ ఎన్‌కౌంటర్ మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పజెప్పాలి

### తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఛత్తీస్‌గడ్‌లోని నారాయణపూర్ జిల్లా ఇంద్రావతి నది ఒడ్డున ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు వెంటనే అందించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి ఎం.నారాయణ, రిసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆజాద్, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నేత చంద్రమౌలిలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శవాలను కుటుంబీకులకు ఇవ్వటానికి నిరాకరించినందుకు నిరసనగా ఆదివారం అంబేద్కర్ విగ్రహం ట్యాంక్‌బండ్ దగ్గర అన్ని ప్రజా సంఘాలు సామూహికంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ..28 మంది మావోయిస్టులు చనిపోతే ఆ శవాలన్నీ నారాయణపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గుట్టలుగుట్టలుగా పడి ఉన్నాయన్నారు. కొద్దిశవాలను మాత్రమే ఛత్తీస్‌ఘడ్‌లోని ఆదివాసి కుటుంబాలకు అందజేశారని, మిగతా శవాలన్నీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు మృతదేహాలను ఇప్పటివరకు కుటుంబాలకు అందజేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగి ఐదు రోజులు గడుస్తున్నప్పటికీ కుటుంబీకులకు అందజేయకపోవడం వలన ఆ శవాలు దుర్భరమైన వాసనతో కుళ్ళిపోయి , పురుగులు పట్టి గుర్తుపట్టలేని స్థితికి చేరుకున్నాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, నవీన్, సంగీతల శవాలను ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోకి తీసుకురావడానికి వీలులేదని ఆయా కుటుంబీకులను బెదిరించి తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. అదే మాదిరిగా తెలంగాణకు చెందిన మావోయిస్టు పార్టీ నాయకులైన వరంగల్ చింతగుట్టకు చెందిన రాకేష్, షాద్‌నగర్‌లోని వేముల నర్సకు చెందిన భూమిక మృతదేహాలను ఆయాకుటుంబాలకు అప్పజెప్పడానికి ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం నిరాకరించడాన్ని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ప్రభుత్వం బాధ్యత వహించి ఆ రెండు మృతదేహాలను తెలంగాణలోని ఆయా కుటుంబాలకు అప్పజెప్పే దిశగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు ప్రతీకార చర్యలకు పూనుకోవద్దని డిమాండ్ చేశారు. ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం అన్ని శవాలను వెంటనే కుటుంబీకులకు అందజేయాలి. ఆ శవాలను ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు అన్ని నిబంధనలను పూర్తి చేసిన తర్వాత కూడా ఇప్పుడు ఇస్తాం అప్పుడు ఇస్తాం అంటూ సాగదీస్తున్నారని ఆరోపించారు. శవాలు కుళ్ళిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉందన్నారు.అలాగే కుటుంబీకులను బెదిరించటాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రుల సంఘం రాంబాబు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ గాదె ఇన్నయ్య భారత్ బచావో తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు కమిటీ సభ్యుడిగా నల్లెల్ల కిషోర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగుదేశం కడప మహానాడు, అలంకరణ కమిటీ సభ్యునిగా నగర పార్టీ ప్రధాన కార్యదర్శి నల్లెల్ల కిషోర్, కన్వీనర్‌గా చంద్రగిరి ఎంఎల్‌ఏ పులివర్తి నాని, ఎం. వెంకటేశ్వర్లను నియమించారు. మహానాడు ప్రాంగణంలో అలంకరణపై చర్చించామని కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, ప్రదీప్ గౌడ్, శ్యామ్ కుమార్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. మహానాడు ప్రాంగణంతో పాటు సభ జరిగే పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆలంకరణను పెద్ద ఎత్తును చేస్తున్నామని నల్లెల్ల కిషోర్ చెప్పారు.



## బోధనేతర సంఘం అధ్యక్షుడిగా రాజు



**ప్రజాపక్షం/గండిపేట:** రాజేంద్రనగర్ నియోజకవర్గము లోని ప్రొఫసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ బోధనేతర సంఘం ఎన్నికల్లో అసోసియేట్ అధ్యక్షునిగా గెలుపొందిన రాజును ఆదివారం కిస్మత్పూర్ లోని ఎస్ ఈ ఆర్ పి సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. దేవాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని అసోసియేట్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన రాజును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే గొప్ప వ్యక్తిగా రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు అనంతయ్య, భగవాన్ దాస్ వనం నరసింహ లీడర్ నరసింహ కేసదానంద్ డ్రైవర్ సత్యం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

### టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని తెలంగాణ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్(టియుఎఫ్ఐడిసి) చల్లా నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అనుమతి సర్టిఫికెట్లను స్థానిక నాయకులతో కలిసి చల్లా నరసింహారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఆశలు, ఆకాంక్షల కోసమైతే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాము వాటిని గత బిఆర్ఎస్ ప్రభుత్వం వమ్ము చేసిందన్నారు. తెలంగాణ ప్రజల పరిస్థితులను గుర్తించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందని తెలిపారు.ఇండ్ల నిర్మాణం పైన లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. నిరుపేదలందరికీ ఇల్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని,అర్హులైన వారు ముందుకు వస్తే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని చెప్పారు.అనంతరం అంబేద్కర్ నగర్ లో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్ , మీర్పేట్ కార్పొరేషన్ మాజీ ఫ్లోర్ లీడర్ చల్లా కవిత బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బాలమణి రామచందర్, మాజీ ఎంపిటిసి సిద్దాల దశరథ, మాజీ సర్పంచ్ పాండు గౌడ్, కుమార్, సోషల్ మీడియా డిపార్ట్మెంట్ ఐత రాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరుతో దత్తత తీసుకుని విస్మరించారు

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొత్తూరు:** గత పాలకులు అభివృద్ధి పేరుతో గ్రామాలకు దత్తత తీసుకొని విస్మరించారని, అభివృద్ధి చేసింది ఎక్కడ లేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. ఆదివారం కొత్తూరు మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటించారు. ఏళ్ల తరబడి విద్యుత్ సమస్య పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తరువాత సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను తీర్చినందుకు ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ప్రజలు ఏర్పాటు చేసిన సత్కార సభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కొత్తూరు మున్సిపాలిటీని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెపి విస్మరించారని ఆరోపించారు. పదేళ్ల కాలంలో విద్యుత్ హైటెన్షన్ విద్యుత్ వైర్ల సమస్యను ఏమాత్రం పట్టించుకోలేదని అవేదన వ్యక్తం చేశారు. స్థానిక నేతలు అప్పటి మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను తీసుకు వచ్చి ఎన్నికల్లో ప్రచారం చేయించారని, వారి మాటను నమ్మిప్రజలు నష్టపోయారని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యే గా విజయం సాధించిన తరువాత విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య ను దూరం చేశారని, చేసిన అభివృద్ధిని మాత్రమే తాను చెప్పుకుంటున్నానని, అది చూసి జీర్ణించుకోలేక ఆరోపణలు చేయడం సరికాదని హెచ్చరించారు. గత పాలకులు ఫోటోలకు పోజులు ఇవ్వడమే తప్పా అభివృద్ధి చేసిందేని లేదని విమర్శించారు. సోషల్ మీడియాలను అడ్డం పెట్టుకొని ఇష్టారాజ్యంగా ప్రచారం చేసుకున్నారే తప్పా అభివృద్ధి చేసిందేమి లేదన్నారు. రాజకీయాలకతీతంగా అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకు కృషిచేస్తున్నాన న్నారు. చైర్మన్‌గా ఉన్న వ్యక్తి స్థానిక పరిశ్రమల్లో వసూళ్లకు పాల్పడుతున్నారని, అన్ని విషయాలు తనకు తెలుసని హెచ్చరించారు. జూన్‌లో ఆరు లైన్ల పై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. కొత్తూరు మున్సిపాలిటిలో అభివృద్ధి పనులను అడ్డుకొని కొంతమంది రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా కొంతమంది అసత్య ప్రచారాలు చేస్తున్నారని, క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి వచ్చి చూస్తే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ఆరవ వార్డు కౌన్సిలర్ హేమ దేవేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# ఆరోగ్యం




బాలల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో తల్లిదండ్రులు, గురువులు కీలక పాత్ర పోషించాలి..

## బాలల వికాసం..

'నేటి బాలలే రేపటి పౌరులు' అనేది నిత్యం అంటున్న... వింటున్నదే అయినప్పటికీ, నిజంగానే బాలల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తున్నామా అన్నదే ప్రశ్న. బాలల ఆరోగ్యం అనేది 0 నుండి 18 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న పిల్లల శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ శ్రేయస్సును సూచిస్తుంది. ఈ వయస్సు వారిలో ఆరోగ్యకరమైన అభివృద్ధి మన దేశ భవిష్యత్తుకు మూలస్తంభంగా నిలుస్తుంది. బాలల ఆరోగ్యానికి ముఖ్య అంశాల్లో మొదటికి శారీరక ఆరోగ్యం. పిల్లలకు ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉన్న ఆహారం అవసరం. పాలు, పండ్లు, కూరగాయలు, గింజలు వంటి పోషకాహారం అవసరం. టీకాలు సమయానికి వేయించటం ద్వారా అనేక వ్యాధుల నుండి రక్షణ కల్పించాలి. ఆటలద్వారా శరీరం తదుపరి అభివృద్ధికి ఉపకరిస్తుంది. ఇలాంటి వ్యాయామం పిల్లలకు తప్పక ఉండాలి. చదువు పేరుతో ఆటలకు దూరం చేయడం తరచు పెద్దలు చేస్తున్న అతిపెద్ద నేరం. చేతులు కడుక్కోవడం, శుభ్రత పాటించడం వంటి ఆరోగ్య సూత్రాలను చిన్నప్పటి నుండే నేర్పించడం కూడా అవసరమే. ఇక రెండోది మానసిక ఆరోగ్యం. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా మాట్లాడాలి. ఒత్తిడి లేదా భయాల కారణంగా పిల్లలు నలుగురిలో కలవలేకపోతే, ఆ విషయాన్ని గుర్తించి సానుకూలంగా స్పందించాలి. వారికి ధైర్యం చెప్పి, అందరితో కలిసేలా చొరవ చూపాలి. ఆడుకోవడం, క్రియాశీలంగా ఉండటం మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇతరులతో మెరుగైన సంబంధాలు పెంచుకోవడం, స్నేహితులతో కలసి ఆటలు ఆడడం, పాఠశాలలో అనుసంధానం పెంచుకోవడం, సమాజంలోని విలువలు నేర్చుకోవడం పిల్లలకు అవసరం. ఈ విషయాల్లో పెద్దలే మార్గదర్శకం చేయాలి. బాలల ఆరోగ్య సమస్యలు (సాధారణంగా ఎదురయ్యేవి) విషయానికి వస్తే, ఎక్కువ మంది పోషణ లోపం (malnutrition)తో బాధపడుతుంటారు. అంతేగాక, గర్భస్థ స్థాయి నుండి తగిన సంరక్షణ లోపం కూడా ఉంది. వ్యాధులు (అంటు వ్యాధులు, సాంప్రదాయ వ్యాధులు) తరచు పిల్లలను వేధిస్తుంటాయి. ఇటీవల కాలంలో, మానసిక ఒత్తిడి, ఉల్లాసం లోపం పెరిగాయి. బాల్యవివాహం, బాల కార్మిక వ్యవస్థ వల్ల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో, బాలల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో తల్లిదండ్రుల, గురువులు కీలక పాత్ర పోషించాలి. తల్లిదండ్రులు ప్రేమతో, శ్రద్ధతో, ఆరోగ్యకరమైన అలవాట్లను బోధిస్తూ పిల్లలను ఎదగనివ్వాలి. అదే విధంగా గురువులు పాఠశాలలో విద్యతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వం కూడా ఈ మహాయజ్ఞంలో భాగస్వామ్యం తీసుకోవాలి. పోషకాహార కార్యక్రమాలు (అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకాలు) అమలులో ఉండాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన బాలల ప్రపంచం సాధ్యమవుతుంది.

## మళ్లీ కొవిడ్ కలకలం!



ప్రపంచ వ్యాప్తంగా మళ్లీ కొవిడ్ కలకలం మొదలైంది. కొన్ని దేశాలు ఇప్పటికే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయి. కొవిడ్ 19 కొత్త వేరియంట్లు పుట్టుకురావడంతో, తిరిగి యాక్టివ్ కేసులు నమోదవుతున్నాయి. ముఖ్యంగా కొత్త వేరియంట్లు జెఎన్.1, ఎన్‌బి.1.8.1, ఎల్ఎఫ్.7, హెచ్‌కెయు5 సిఒవి2 విజృంభిస్తున్నాయి. ఫలితంగా కేసులు పెరుగుతున్నాయి. ఈనెల 23న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్న ఒక పల్మనాలజిస్ట్‌కు కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ కావడంతో ఇక్కడ కూడా ఆందోళనలు పెరుగుతున్నాయి. అయితే, ఈ కేసు మినహా ప్రస్తుతం తెలంగాణలో క్రియాశీలకు కొవిడ్ కేసులు లేవు. ప్రజలు ఇప్పటికే వైరస్‌పై రోగనిరోధక శక్తిని అభివృద్ధి చేసారని ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న పరిస్థితిని పరిశీలిస్తే, జెఎన్.1 వేరియంట్ ప్రస్తుతం ఉన్న కేసుల్లో 53 శాతం కేసులకు కారణమవుతోంది. ఈ వేరియంట్ అధిక వ్యాప్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ, తీవ్రమైన లక్షణాలు లేకపోవడం కొంత ఊరటనిస్తున్నది. తక్కువగా కనిపిస్తున్నాయి. ఎన్‌బి.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్లు కూడా వెలుగులోకి వచ్చాయి. తమిళనాడులో ఎన్‌బి.1.8.1ను, గుజరాత్‌లో ఎల్ఎఫ్.7ను గుర్తించారు. ఇవి జెఎన్.1 వేరియంట్‌కు అనుబంధంగా పేర్కొంటున్నారు. అందుబాటులో ఉన్న వివరాలను అనుసరించి దేశ వ్యాప్తంగా సుమారు 300 యాక్టివ్ కేసులు దేశంలో ఉన్నాయి. కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. కాగా, కొవిడ్ వేరియంట్స్ ప్రస్తుతం అదుపులోనే ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ప్రకటించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని వివరించింది.

వైరస్ మ్యూటేషన్లు, కొత్త వేరియంట్స్ కొన్ని ప్రాంతాల్లో వ్యాపిస్తున్నాయని గుర్తించారు. ఇవి వేగంగా వ్యాపిస్తాయి కాబట్టి జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా, చాలా మందికి గతంలో వేసిన వాక్సిన్ల ప్రభావం తగ్గిపోయే అవకాశం ఉంది, బూస్టర్ డోసులు అవసరం కావచ్చు. కొవిడ్ గతంలో సృష్టించిన విధ్వంసాన్ని మరచిపోవడం కూడా సమస్యకు కారణమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. మాస్కులు ధరించకపోవడం, సామాజిక దూరాన్ని పాటించకపోవడం వల్ల వ్యాప్తి మళ్లీ పెరగవచ్చని స్పష్టం చేస్తున్నారు. మళ్లీ కేసులు పెరిగితే ఆసుపత్రులపై ఒత్తిడి రావచ్చు. కాబట్టి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అన్ని విధాలా ఉత్తమం.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..



**మాస్క్ ధరించండి:** ప్రజాభారిత ప్రాంతాల్లో మాస్క్ ధరించడం కొనసాగించండి.

**హ్యాండ్ శానిటైజర్ ఉపయోగించండి:** చేతులను తరచుగా శుభ్రంగా ఉంచండి.

**లక్షణాలు ఉంటే పరీక్షించుకోండి:** జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, డయేరియా వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోండి.

**ప్రభుత్వ సూచనలు పాటించండి:** ఆరోగ్య శాఖ సూచనలు అనుసరించండి.

ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలో ఉన్నప్పటికీ, అప్రమత్తంగా ఉండడం అవసరం. ప్రభుత్వం, ఆరోగ్య శాఖలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. మీరు ఆరోగ్యంగా ఉండేందుకు పై సూచనలు పాటించండి.

## హెల్త్ అంటే ఏమిటి?



ఈ ప్రశ్న వినడానికి కొంత హాస్యాస్పదంగా ఉన్నప్పటికీ, చాలా మందికి స్పష్టమైన అవగాహన ఉండదనేది నిజం. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధులేదనేది మాత్రమే కాక, శారీరక, మానసిక మరియు సామాజిక పరంగా సంపూర్ణమైన నాణ్యతా స్థితిని సూచిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నిర్వచనం ప్రకారం, ఆరోగ్యం అనేది కేవలం వ్యాధి లేకుండా ఉండటం మాత్రమే కాదు, శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సు సమృద్ధిగా ఉండే స్థితి.

### ఆరోగ్యంలోని ముఖ్యాంశాలు..

శారీరక ఆరోగ్యం: శరీరం బలంగా, వ్యాధుల లేని స్థితిలో ఉండడం. శ్రద్ధగా ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, సరైన నిద్ర వంటి విషయాలు దీన్ని ప్రభావితం చేస్తాయి.


మానసిక ఆరోగ్యం: మనస్సు ప్రశాంతంగా ఉండటం, ఒత్తిడిని తట్టుకోవడం, భావోద్వేగాలను నియంత్రించుకోవడం, సానుకూలంగా ఆలోచించగలగడం.

సామాజిక ఆరోగ్యం: ఇతరులతో సత్సంబంధాలు కలిగి ఉండటం, సమాజంలో భాగస్వామిగా చక్కగా కలసిమెలసి జీవించడం.

### ఆరోగ్యానికి అవసరమైనవి..

సుమారైన పోషకమైన ఆహారం, నిత్య వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, తగినంత నిద్ర, శుభ్రత, వ్యసనాల నుండి దూరంగా ఉండటం, పర్యావరణం శుభ్రంగా ఉండటం వంటి చర్యలు అత్యవసరం. సరళంగా చెప్పాలంటే, ఆరోగ్యం అంటే శరీరం, మనస్సు, మన సమాజ జీవితం ఆనందమయంగా ఉండడం.

## జంతువుల నుంచి మనుషులకు..



ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో, చైనాలోని ఉహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (డబ్ల్యుఐవి) పరిశోధకులు గుర్తించిన ఒక కొత్త బ్యాట్ కరోనా వైరస్‌ను గుర్తించారు. దీనిని హెచ్‌కెయు5 సిఒవి2గా పిలుస్తున్నారు. ఇది మెర్బెకోవైరస్ ఉపజాతికి చెందింది. దీనిలో ఎంఇఆర్ఎస్‌సిఒవి (మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ వైరస్) కూడా ఉంటుంది. హెచ్‌కెయు5 సిఒవి2, కొవిడ్ 19కి కారణమైన సార్స్‌సిఒవి2 మాదిరి, మానవ కణాల్లోకి ప్రవేశించడానికి ఎసిఇ2 రిసెప్టర్‌ను ఉపయోగిస్తుందని, అందుకే, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిశోధకులు అంటున్నారు. ఇది జూనోటిక్ వ్యాప్తి (జంతువుల నుండి మనుషులకు వ్యాధి సంక్రమణ) అవకాశాన్ని సూచిస్తుంది. ల్యాబ్ పరీక్షల్లో ఈ వైరస్ మానవ కణాల్లోకి ప్రవేశించగలిగినా, సార్స్ సిఒవి2తో దాని బైండింగ్ సామర్థ్యం తక్కువగా ఉంది. ఇది మానవులకు సంక్రమించే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ప్రస్తుతం, మానవుల్లో హెచ్‌కెయు5 సిఒవి2 కేసులు నమోదు కాలేదు. అయితే, ఎసిఇ2 రిసెప్టర్ వినియోగం వల్ల హెచ్‌కెయు5 సిఒవి2 ఇతర జంతు జాతులలో కూడా వ్యాప్తి చెందే అవకాశాలున్నాయి. డా. షి జెంగ్లీ నేతృత్వంలో డబ్ల్యుఐవి పరిశోధకులు హెచ్‌కెయు5 సిఒవి2ను గుర్తించారు. ఈ వైరస్, మానవ ఎసిఇ2 రిసెప్టర్‌ను ఉపయోగించి కణాల్లోకి ప్రవేశించగలదని కూడా వారు నిర్ధారించారు. లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ (ఎల్ఎస్‌హెచ్‌టిఎం)లోని ప్రొఫెసర్ డేవిడ్ హేయ్మన్ మాట్లాడుతూ, 'ప్రతి కొత్త వైరస్ పాండెమిక్‌కు దారితీయదని, కానీ జాగ్రత్త అవసరం' అని తెలిపారు. ప్రస్తుతం హెచ్‌కెయు5 సిఒవి2 మానవులకు ప్రత్యక్ష ప్రమాదం కలిగించకపోయినా, దాని లక్షణాలు జూనోటిక్ వ్యాప్తి అవకాశాన్ని సూచిస్తున్నాయి. కాబట్టి, ఈ వైరస్‌పై నిరంతర పరిశోధన, పర్యవేక్షణ అవసరం. నివారణ చర్యలు ఎంతగానో ఉపయోగపడతాయి. సాధ్యమైనంత వరకూ వణ్యప్రాణుల నుంచి దూరంగా ఉండాలి. ప్రత్యేకించి గబ్బిళాలు ఉన్న పరిసరాలకు వెళ్లకపోవడం మంచిది. అదే విధంగా ఆహార పరిశుభ్రత పాటించాలి. కూరగాయలు, పండ్లు, మాంసాహారాన్ని శుభ్రంగా కడగడం మరియు సరిగ్గా వండడం ద్వారా వైరస్ సంక్రమణను నివారించవచ్చు. ప్రభుత్వ ఆరోగ్య శాఖల సూచనలు, మార్గదర్శకాలను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

## ప్రజలకిచ్చిన హామీల అమలెప్పుడు?

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు అంజయ్యనాయక్



**ప్రజాపక్షం/డిండి :** ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలతో పాటు ఆరు గ్యారంటీలను ఎప్పటివరకు అమలు చేస్తారని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం డిండి మండలంలోని గదరాల్ తండా సిపిఐ గ్రామశాఖ మహాసభకు అంజయ్యనాయక్ ముఖ్య అతిథిగా హాజరై సిపిఐ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా విషయంలో ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి ప్రభుత్వ విధానాన్ని తెలపాలని, రైతులకు ఎన్ని పంటలకు రైతు భరోసా, ఎన్ని ఎకరాలకు వేస్తారో తేటతెల్లం చేసి రైతులకు రైతు భరోసాపై ఉన్న అపోహలను తొలగించాలన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం పట్టాలివ్వాలన్నారు. జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ 100 ఏళ్ల సిపిఐ ఉద్యమ ప్రస్థానంలో ప్రజల పక్షాన నిలబడి అధికారం లేకున్నా ఉద్యమ పంతాను ఎంచుకొని ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. సమావేశంలో సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, మండల కార్యవర్గ సభ్యులు సోమిడి శ్రీనయ్య, గ్రామ కార్యదర్శి కృష్ణనాయక్, సహాయ కార్యదర్శి పుల్లారెడ్డి, తౌక్లాపూర్ గ్రామశాఖ కార్యదర్శి చక్రి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇస్తారో స్పష్టం చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి డిమాండ్

**ప్రజాపక్షం/మరిపెడ :** రైతు భరోసా రైతులకు ఎన్ని ఎకరాల వరకూ ఇస్తారో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేయాలని మహబూబాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శి బి.విజయసారథి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ మరిపెడ మండల ఐదో మహాసభ ఒంటికొమ్ము లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అధ్యక్షన జరగ్గా జయసారథి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రబీ సీజన్ అయిపోయి ఖరీఫ్‌సీజన్ ప్రారంభం కాబోతున్నా ఇప్పటికి నాలుగు ఎకరాల లోపు రైతాంగానికి మాత్రమే భరోసా అందించారన్నారన్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీ చేయాలని, అర్హత గల వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు కొత్తగా పెన్షన్‌లు అందించాలని, ఇందిరమ్మ ఇండ్లలో ఉన్న గందరగోళాన్ని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మండల కార్యదర్శిగా మారగాని బాలకృష్ణను, సహాయ కార్యదర్శిగా అబ్దుల్ రషీద్ మరో ఏడుగురితో మండల సమితిని ఎన్నుకున్నారు. సమావేశంలో కరణం రాజన్న, మల్లెపాక యాకన్న, పగిళ్ళ అంజయ్య, అక్కినపల్లి రాములు, పాక వెంకన్న, తిప్పర్తి సైదులు, పానుగోతు వెంకన్న, మధు, లింగయ్య, రేగ నరసయ్య, గంట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




## రాజ్యాంగాన్ని, లౌకికవాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్




**ప్రజాపక్షం/సూర్యాపేట :** భారత రాజ్యాంగాన్ని, లౌకికవాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందా మని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగం అందించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం అందరికి అందని ద్రాక్షగా పాలకులు చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో సిపిఐ సూర్యాపేట పట్టణ కమిటీ నాలుగో మహాసభ బొమ్మగానిశ్రీనివాస్, చామల అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ పేదలు, దళితులు, బహుజనులకు నేటికి రాజ్యాంగ హక్కులు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛగా భావాలు వెలిబుచ్చితే అర్బన్ నక్సలైట్లు, దేశద్రోహులంటున్నారన్నారు. దేశప్రజలలో ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోయి తీవ్ర అలజడులు, పోరాటాలు నెలకొంటున్నాయన్నారు. పహల్గామ్ ఉగ్రదాడిలో అమాయక పౌరుల ఉసురుతీసిన పాకిస్తాన్ ఉగ్రవాదులను ఆపరేషన్ సింధూర్ పేరుతో మట్టుపెట్టడాన్ని సిపిఐ హర్షిస్తోందని, కాని భారత్ అంతరంగిక విషయాలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకోవడాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నామన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జూన్ 8న సూర్యాపేట జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కెవిఎల్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మావోయిస్టు నేతలను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. మావోయిస్టు పార్టీ ప్రభుత్వంతో శాంతిచర్చలు జరుపుతామని, ఆయుధాలను పక్కనపెట్టి కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత నక్సలైట్ల ఏరివేత కార్యక్రమాన్ని కేంద్రం చేపట్టడం హేయమైన చర్య అన్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ నూతన కమిటీని 22 మంది కౌన్సిల్ సభ్యులు, 14మంది కార్యవర్గ సభ్యులతో ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా బూర వెంకటేశ్వర్లు తిరిగి ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు అనంతుల మల్లేశ్వరి, రాష్ట్ర నాయకులు బొమ్మగాని నాగభూషణం, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు దంతాల రాంబాబు, దొరేపల్లి శంకర్, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి అంతయ్య, నిమ్మల ప్రభాకర్, పెంద్రకృష్ణ, దీకొండ శ్రీను, బూర సైదులు, ఎండిపాషా, ఎడెల్లి శ్రీకాంత్, సైదులు, దంతాల పద్మ, రేఖ, హేమలత, తాళ్ల సైదులు, వాడపల్లి వెంకన్న, వాడపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.


## పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడేది సిపిఐ ఒక్కటే : మర్రి వెంకటస్వామి

**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** పేద ప్రజల కోసం అనునిత్యం పోరాటాలు చేస్తూ పేదల అభ్యున్నతికి పాటుపడే పార్టీ సిపిఐ ఒక్కటేనని పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. ఆదివారం సిపిఐ ఇల్లందకుంట మండల మహాసభ మల్యాల గ్రామంలో మాదారపు రత్నాకర్ అధ్యక్షతన జరిగింది. సభకు మర్రి వెంకటస్వామి హాజరై మాట్లాడుతూ నిరుపేదలకు ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, యువతకు ఉపాధి హక్కుల సాధన కోసం, పేదల పిల్లలకు ఉచిత విద్య, వైద్యం కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. దున్నేవాడికే భూమి కావాలని భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం, బానిసత్వం పోవాలని వీరోచితంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సిపిఐ నాయకత్వం వహించిందన్నారు. పేదల డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్న మావోయిస్టులపై బిజెపి ప్రభుత్వ దమనకాండను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. మావోయిస్టులు కేంద్రప్రభుత్వంతో చర్చలకు సిద్ధమని చెప్పి లేఖలు రాసినా బిజెపి ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పేద ప్రజల కోసం పోరాడే మావోయిస్టులతో చర్చలు జరపడం చేతగాదు గానీ పాకిస్తాన్ ఉగ్రవాదులతో చర్చలు జరపడానికి మాత్రం సిద్ధంగా ఉండడం సిగ్గుచేటన్నారు. ఇటీవల చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పంజాల శ్రీనివాస్, ఇజ్జిగిరి రాంగోపాల్, బుర్ర సతీష్, తిరుపతి ఐలయ్య, శ్రీకాంత్, అనిల్, సమ్మయ్య, రవి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఆట, పాటతో ప్రజల్లో చైతన్యం

'ఇఫ్టా' జాతీయనేత స్వామి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇఫ్టా) 83వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం గోదావరిఖని భాస్కరరావు భవన్‌లో ఇఫ్టా జాతీయ నాయకులు కె.స్వామి పతాకావిష్కరణ చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ హాజరై మాట్లాడుతూ కళాకారులు ప్రజలు, కార్మిక, కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ ఆటపాటతో చైతన్యం తీసుకువస్తున్నారన్నారు. సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ మాట్లాడుతూ ఖనిలో నిర్మిస్తున్న కళాభవన్‌కు ఇఫ్టా జాతీయ నాయకులు జాకబ్ పేరుపెట్టాలని డిమాండ్ చేశారు. ఇఫ్టా జాతీయ నాయకులు కే.స్వామి మాట్లాడుతూ ఇఫ్టాకు అనుబంధంగా ప్రజానాట్యమండలి ఏర్పడి నాటి నుండి నేటివరకు ప్రజాసమస్యలపై పోరు చేస్తుందన్నారు. ప్రజానాట్యమండలి నగర అధ్యక్షుడు ఎజ్జ రాజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి వై.లెనిన్, తాళ్ళపెల్లి మల్లయ్య, మడికొండ ఓదేమ్మ, తొడుపునూరి రమేశ్ కుమార్, మార్కపూరి సూర్య, అబ్దుల్ ఘని, జూల మోహన్, నూకల మొండి, తదితరులు పాల్గొన్నారు.

## నిఘా వైఫల్యంతోనే పహల్గామ్ దాడి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** కేంద్రహోంశాఖ నిఘా వైఫల్యంతోనే కాశ్మీర్‌లో పహల్గామ్ ఉగ్రదాడిలో 26మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మా ఆరోపించారు. మండలంలోని వెల్గొండ గ్రామశాఖ సిపిఐ మహాసభను ఆదివారం ఈర్ల గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ ఉగ్రవాదులను హతమార్చాలని పౌరులజోలికి వెళ్లవద్దని సిపిఐ సూచిస్తే ఆర్ఎస్ఎస్, బిజెపినేతలు విమర్శలు చేశారని, మనదేశ వ్యవహారాల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకొని శాంతింపచేశామని చెబుతున్నారని ఇది దేశ సార్వభౌమత్వానికి అవమానం అన్నారు. ఏడురాష్ట్రాల్లో ఆపరేషన్ కగార్ పేరుతో దేశ ఆదివాసులను హతమారుస్తున్నారని విమర్శించారు. మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలన్నారు. కమ్యూనిస్టులుగా ప్రజలకు చేరువగా వారి సమస్యల కోసం పోరాటాలు చేస్తున్నారన్నారు. శ్రామిక, కార్మిక, కర్షక వర్గ నిరుపేదల పక్షాన ఫలితాలు సాధించే వరకు పోరాడుతూ గత వందేళ్ల కాలంగా ప్రజల మదిలో నిలిచి పోయింది కేవలం కమ్యూనిస్టులు మాత్రమే అని ఆయన తెలిపారు. వివిధ వర్గాలు, మతాలు, ప్రాంతాల పేరిట మనుషుల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టటం ద్వారా ఓట్లు దండుకొనే తుచ్ఛ రాజకీయాలతో పదేళ్లపైబడి కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాసోహమై కార్మిక, కర్షక, శ్రామికవర్గాలను అణచివేసే దిశగా పాలిస్తూ అత్యంత ప్రమాదకరంగా తయారైందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఒక్కటొక్కటిగా ప్రభుత్వ ప్రయివేట్ రంగ సంస్థలన్నిటిని అంబాని, ఆదానిలాంటి సంపన్న వర్గాలకు ప్రయివేటీకరణ పేరట అప్పచెప్పి వారిచ్చే డబ్బులతో ఎన్నికల్లో ఓట్లు పొందేందుకు కుటిల యత్నాలకు పాల్పడుతుందన్నారు. అధికారంతో పని లేకుండా ప్రజా పోరాటాల్లో అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ పోరాటం చేస్తున్నది సిపిఐ మాత్రమే అన్న విషయాన్ని ప్రజల్లో మరింత ముందుకు తీసుకొని వెళ్లాలన్నారు. వచ్చేనెలలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని సిపిఐ బలమున్న అన్నిచోట్ల పోటీచేసి గెలవాలని సిపిఐ మండల సహాయకార్యదర్శి ఈర్ల భూపేష్‌బాబు పిలుపునిచ్చారు. ప్రజలకు చేరువై ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ శ్రేణులు పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఈర్లచంద్రమౌళి, కృష్ణారెడ్డి, పురుషోత్తం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## సింగిల్ విండో చైర్మన్‌కు పితృవియోగం



ప్రజాపక్షం/జడ్చర్ల : సింగిల్ విండో చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ తండ్రి పాలెం ఆంజనేయులు గౌడ్ గత కొన్ని రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కిష్టారం గ్రామానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు యువ నాయకులు చించోడు అభిమాన్యురెడ్డి, జడ్చర్ల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## ప్రారంభమైన రోహిణి కార్తె ... రోళ్లు పగిలే ఎండల్లేవు



ఈసారి వేసవి కాలం ... వర్షాకాలంలా మారింది

ప్రజాపక్షం/వీపనగండ్ల : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. వాతావరణం చల్లబడింది. ఆదివారం నుంచి రోహిణి కార్తె ప్రారంభమైంది. సాధారణంగా రోహిణి కార్తెలో రోళ్లు పగిలేలా ఎండలు ఉంటాయని ప్రజల నానుడి. అయితే ఈమారు ముందుగానే నైరుతి రుతు పవనాలు కేరళను తాకడంతో ఇప్పుడు ఆ పరిస్థితి లేనట్లే కనిపిస్తోంది. మరోవైపు కాలం ముందే వచ్చేసిందని, ఆ తర్వాత వర్షాలు ముఖం చాటేస్తాయేమోనని కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా వాతావరణం మార్పు చెంది చల్లబడటం మే నెలలో ప్రజలు ఎండల నుంచి ఉపశమనం పొందారు.

## చౌడమ్మ దేవికి బోనాలు



ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో కుర్వ యాదవ్‌లు మేళాతాళాలతో, ఒగ్గు కథలు చెప్పుకుంటూ గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా బోనాలతో శ్రీశ్రీశ్రీ చౌడమ్మ దేవాలయం దగ్గరికి చేరుకుని ఆదివారం నాడు చౌడమ్మ దేవి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 30 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం బూర్గుపల్లి గ్రామ యాదవులు, చౌడమ్మ దేవికి బోనాలు సమర్పించుకుంటూ, తమ మొక్కులను చెల్లించుకుంటున్నారని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణయాదవ్ తెలిపారు. ప్రజలలో భక్తి భావం, సజీవంగా ఉన్నత కాలం శాంతిపూరిత వాతావరణంలో ప్రజలు సుఖజీవనం గడుపుతారని ధర్మాన్ని పరిరక్షిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దగొల్ల మల్లేష్, బైకని రాములు, బైకని మల్లేష్, కుర్వ శ్రీనివాస్, భరత్‌కుమార్, గోరంట్ల మల్లేశ్ యాదవ్, బైకని శ్రీశైలం, కొండల్, దశరథం, పరమేశ్, మేడిపూరి రాజు, ఎడ్ల చెన్నయ్య, మహిళలు పాల్గొన్నారు.

## యుగమానోత్సవం వాల్ పోస్టర్ విడుదల



ప్రజాపక్షం/నారాయణపేట్ : మహాత్మ శ్రీ బసమేశ్వర జయంతోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్ నగర్ పట్టణంలో నిర్వహిస్తున్న శ్రీ ఆది జగద్గురు పంచాచార్య యుగమానోత్సవ కార్యక్రమం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. పట్టణంలోని శ్రీ శివలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘ సమావేశానికి మహబూబ్ నగర్ జిల్లా నూతన అధ్యక్షులు ముక్తా శ్రీశైలం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జూన్ 16న పాలమూరు వాసవి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఉజ్జయిని కాశీ, శ్రీశైల క్షేత్ర ఆది జగద్గురులు హాజరవుతున్నారని తెలిపారు. నారాయణపేట జిల్లా వీరశైవ సమాజం సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని, గురువుల ఆశీర్వాదం పొందాలని కోరారు. అంతకుముందు వాల్ పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సమాజం సభ్యులు అవుటి రవికుమార్, మల్లికార్జున్, నాగభూషణం, గందే రవికాంత్ , రఘుబాబు, అరకం చి రవికుమార్, రాజేష్ కుమార్, సులిగెం సురేష్, శివకుమార్, శ్రవణ్ పాల్గొన్నారు.

## ఆ రోడ్డు మార్గంలో తీవ్ర ఇబ్బందులు



ప్రజాపక్షం/మక్తల్ : అమరచింత మండలం జూరాల డాం నుండి మక్తల్‌కి వెళ్లే ప్రధాన రహదారి కిష్టంపల్లి గ్రామ శివారు వరకు రోడ్డు వేశారు. ఒక కిలోమీటర్ రోడ్డుని కంకరతో నర్వ మండలం ఎల్లంపల్లి గ్రామ శివారు వరకు వేశారు. కానీ వనపర్తి జిల్లా అమరచింత మండలం మిట్ట నందిమల్ల గ్రామ శివారు నుండి కిష్టంపల్లి వరకు రోడ్డు వేయకుండా అలాగే వదిలేశారు. కావున ఆ రోడ్డు మార్గం ప్రయాణికుల వాహనాలకు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. కావున వెంటనే ఈ రోడ్డుని పూర్తి చేయగలరని ప్రజలు కోరుతున్నారు. అలాగే అమరచింత మండలంలోని చంద్ర గట్టు స్టేజినుండి నందిమల్ల వరకు రోడ్డు వేస్తామని శిలాఫలకాలు ఓపెనింగ్ చేసి శిలాఫలకాలకే పరిమితం ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్టలేదు ధర్మవరం రోడ్డు కూడా శిలాఫలకాలు పరిమితం మస్తిపురం గ్రామంలో కోటి రూపాయలతో సీసీ రోడ్డు భూమి పూజ ఓపెనింగ్‌కి పరిమితం కావున అధికారులు, ఎమ్మెల్యే స్పందించి వెంటనే పూర్తి చేయగలరని వివిధ గ్రామాలు ప్రజలు కోరారు.

## ఉపముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన ఏర్పాట్లను ఆదివారం జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పరిశీలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలంలోని గట్టుతుమ్మెన్ గ్రామంలో నూతనంగా ఏర్పాటుకానున్న 33/11కెవి సబ్‌స్టేషన్ పనులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం శంకుస్థాపన ఉంటుందన్నారు. ఈనేపథ్యంలో గట్టుతుమ్మెన్ గ్రామంలో ఏర్పాటుచేస్తున్న శంకుస్థాపన పనులు, సభ ఏర్పాట్లను కలెక్టర్ బదావత్‌సంతోష్, విద్యుత్‌శాఖల అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని 132/33 కెవి, 33/11 కెవి సబ్‌స్టేషన్ పనుల ప్రారంభానికి బల్మూర్ మండలం గట్టుతుమ్మెన్‌గ్రామంలో ప్రాంగణంలో శిలాఫలకాలను ఆవిష్కరిస్తారని తెలిపారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉదయం 9గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ప్రజాభవన్‌నుంచి రోడ్డుమార్గాన బయలుదేరి 11గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూరు మండలంగట్టు తుమ్మెన్‌గ్రామానికి చేరుకుంటారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రాంగణంలో రూ.25కోట్లతో పోల్కంపల్లిలో రూ.1.82కోట్లతో, బొమ్మనపల్లిలో రూ.1.73కోట్లతో పదరలో నిర్మించనున్న నూతన 33/11కెవి సబ్‌స్టేషన్ల శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. రూ.2.24కోట్లతో లింగాల మండలం బాకారంలో రూ.2.54కోట్ల అంచనాతో గట్టుతుమ్మెన్ గ్రామంలో రూ.2.49కోట్ల అంచనాతో ఉప్పునుంతల మండలం కంసాన్‌పల్లిలో రూ.2.74కోట్ల అంచనాతో వంగూరు మండలం ఉల్పరగ్రామంలో, రూ.1.99కోట్ల అంచనాతో అచ్చంపేట మండలం సింగారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 33/11కెవి సబ్‌స్టేషన్‌ల పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. కావున ఉపముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం ఏర్పాటుచేయాలని ఎలాంటి లోటుపాట్లులేకుండా చూడాలని సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు ఉన్నారు.

## బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/వనపర్తి : వనపర్తి పట్టణం 13వ వార్డుకు చెందిన శ్రీహరి గత కొంత కాలం క్రితం రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం వారి నివాసానికి చేరుకొని బాధితుడిని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స తీసుకోవాలని అందుకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే బాధితుడికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల చందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్టపాకుల మహేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, పట్టణ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గ్రామపాలన అధికారి పరీక్ష



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : గ్రామపాలన అధికారి పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని, జిల్లాలో మొత్తం 119మంది అభ్యర్థులకుగాను 112 మంది హాజరయ్యారని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలుర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామపాలన అధికారి పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణతీరును కలెక్టర్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ పట్టణంలోని బాలుర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో గ్రామపాలన అధికారి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రామపాలన అధికారి పరీక్షకు 119 మంది పరీక్షరాయాల్సి ఉండగా 112 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వీలుగా తరగతి గదుల్లో బెంచీలు, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీరు తదితర మౌలిక వసతులను సమకూర్చినట్లు వివరించారు. పోలీసుయంత్రాంగం పటిష్ట భద్రత ఏర్పాటుచేశారని తెలిపారు. మాల్‌ప్రాక్టీస్‌కి తావులేకుండా గ్రామపాలన అధికారి పరీక్ష పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్ష ముగిసిందని తెలిపారు.

## ముగిసిన గ్రామ పరిపాలన అధికారుల స్క్రీనింగ్ పరీక్ష

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజాపక్షం/వనపర్తి : వనపర్తి జిల్లాలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రామ పరిపాలన అధికారుల స్క్రీనింగ్ పరీక్ష సజావుగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రకటించారు. పరీక్షకు మొత్తం 97 మంది విఆర్వో , విఆర్‌ఏలు దరఖాస్తు చేసుకోగా (90) మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరయ్యారు. రెవెన్యూ గ్రామ పరిపాలన అధికారుల స్క్రీనింగ్ పరీక్ష సరళిని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పర్యవేక్షించారు. పరీక్ష జవాబు పత్రాలను స్పెషల్ మేసెంజర్ ద్వారా ఎస్కార్ట్‌తో పాటు హైదరాబాద్, జేఎన్‌టియూ విశ్వవిద్యాలయంకు చేరవేయాలని లైజన్ అధికారి భాను ప్రసాద్‌ను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంట్ గురురాజ్ , తహసీల్దార్ రమేష్ రెడ్డి, ఆర్ఐ మధు, అబ్జర్వర్ సుధీర్ రెడ్డి, పరీక్ష సజావుగా నిర్వహించడంలో పాల్గొన్నారు.

## క్రీడలు శరీర దారుఢ్యానికి దోహదం

### భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/నారాయణపేట్ : వత్తుగుండ్ల గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ విజేతకు రూ.10వేలను అందజేసిన భీష్మరాజ్ ఫౌండేషన్ భారీగా తరలివచ్చిన క్రీడాకారులు, యువకులు గ్రామస్తులు క్రీడలు శరీర దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. నారాయణపేట్ జిల్లా దామరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామంలో క్రికెట్ ట్రోఫీ వత్తుగుండ్ల సీజన్ 4 ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 19 క్రికెట్ టోర్నమెంట్ లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.15 వేలను అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతే విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులకు చేయూతనిచ్చేందుకు తమ ఫౌండేషన్ ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. టోర్నమెంట్ లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలను అందజేశారు. అంతకుముందు రాజ్ కుమార్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట నిర్వాహకులు వినయ్ కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గడ్డం, తిప్పన్న, పోలీస్ పటేల్ మధుసూదన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి హన్మంతు ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, శివరాజ్ మన్నె గోపాల్, నర్సింహనాయుడు, ఎం.సంతోష్ నందుకుమార్, వెంకటరావు, అశోక్, చామకూర నాగేష్, వై సంతోష్, క్రీడాకారులు యువకులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత స్వేరోలదే



ప్రజాపక్షం/కల్వకుర్తి : తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత స్వేరోలదని సీనియర్ స్వేరో దుబ్బ నాగేష్, నాగర్‌కర్నూల్ జిల్లా స్వేరోస్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు బండమీది కృష్ణ, శివశంకర్‌లు అన్నారు. ఆదివారం స్వేరోస్ నాగర్‌కర్నూల్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో కల్వకుర్తి డివిజన్‌లో విక్టరీడే దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. మండలంలోని రఘుపతిపేట రామగిరిగుట్టపై స్వేరో చిన్నారులు స్వేరో జెండాలతోపాటు జాతీయ పతాకాన్ని ఎగరవేసి అవకాశం ఇస్తే ఆకాశం హద్దుగా దూసుకుపోదామని ప్రపంచానికి సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా స్వేరో నాయకులు మాట్లాడుతూ స్వేరోస్ అంటేనే అసాధ్యాలను సుసాధ్యాలు చేయగలసత్తా ఉన్న హీరోలని పేర్కొన్నారు. స్వేరో ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురుకుల కార్యదర్శిగా ఎన్నో విజయాలను సాధించారన్నారు. లక్షలాదిమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులునింపిన ఘనత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌దే అన్నారు. జ్ఞానసమాజ నిర్మాణానికి ఆయనచేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆర్ఎస్‌పి అడుగుజాడల్లో నడిచేందుకు స్వేరోస్ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బండమీది కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, జాయింట్‌సెక్రటరీ ధర్మరాజు, ఆర్గనైజేషన్ సెక్రటరీ శేఖర్ పాల్గొన్నారు.

## చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవధశాలలను తక్షణమే మూసివేయాలి

### ఎస్ఐ వెంకటేశ్వర్లుకు వినతి



ప్రజాపక్షం/నారాయణపేట్ : గోరక్ష చట్టాలు అమలు చేయాలని కోరుతూ, విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ నారాయణపేట్ జిల్లా వారి ఆధ్వర్యంలో నారాయణపేట్ ఎస్ఐ అందే వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విహెచ్‌పి నాయకులు మాట్లాడుతూ అక్రమంగా ఉన్న గోశాల భూములను విముక్తి చేయాలన్నారు. గుర్తింపు పొందిన గోశాలలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయాలలో గోవులను పెంచాలని కోరారు. బక్రీద్ సందర్భంగా గోరక్షకులు ఆవులను పెట్టుకొని పోలీసులకు తెలియజేసే విధంగా గోరక్షకులకు గుర్తింపు పత్రాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ప్రధాన నగరాలు పట్టణాల శివారులలో ప్రత్యేకంగా పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా తరలించబడుతున్న గోసంతతని రక్షించడమే కాకుండా రవాణా కొరకు ఉపయోగిస్తున్న ట్రక్కులను సీజ్ చేసి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కన్న వివకుమార్, జిల్లా సంయోజక, వడ్ల శ్రావణ్ కుమార్, విజయ్, సందీప్, గోరక్ష ప్రముఖ అనిల్, బాలు పాల్గొన్నారు.

## డోలారోహణ వేడుకల్లో ఎమ్మెల్యే



ప్రజాపక్షం/వనపర్తి : వనపర్తి పట్టణంలోని 13వ వార్డుకు చెందిన జస్వంత్ , సుప్రియల కుమారుడి డోలారోహణం కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై చిన్నారిని త్రివిద్‌ను ఆశీర్వదించారు. ప్రతి మనిషి జీవితంలో మొట్టమొదటి పండుగల నిర్వహించే తొట్లే కార్యక్రమాన్ని అందరితో కలిసి వేడుకగా చేసుకోవడం శుభపరిణామం చిన్నారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల చందర్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వనపర్తి మున్సిపల్ మార్కెట్ చైర్మన్ పుట్టపాకుల మహేష్ , మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు నీరు..నీడ..మెడికల్ కిట్టు ఎక్కడ?

### ప్రాణాలు పోతేనే వసతులు కల్పిస్తారా?

### ఎండకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఉపాధి కూలీలు



ప్రజాపక్షం/వైరా:ఉపాధి కూలీలకు నీరు లేదు. నీడ లేదు. ఉపాధి కూలీలకు ఉపాధి పనులు వద్ద ఎలాంటి భద్రత లేదు. కనీస వసతులు కూడా కరువయ్యాయి. ఉపాధి పనికి వెళ్లిన కూలీలకు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పని చేసే ప్రాంతంలో త్రాగునీరు ఉండదు. నిలవడానికి నీడ ఉండదు. ప్రమాదం జరిగితే మెడికల్ కిట్టు ఉండదు. ఇది ఉపాధి కూలీల పరిస్థితి. ఇంటి నుంచి పనికి వెళ్లే ఉపాధి కూలీలు వారి వెంట లీటర్ నుండి రెండు లీటర్ల త్రాగునీరుని తీసుకొని పోతారు. పనిచేసే సమయంలో అవి ఎక్కడ అయిపోతాయి అని కొసిరి కొసిరి వాటిని తాగుతూ ఉంటారు. కొద్దిసేపు ఎక్కడైనా స్వేదతీర్చుకుందాం అని అనుకుంటే నీడ కరువైంది. పనుల వద్ద కనిపించని టెంట్లు. దీంతో ఎండలోనే ఆ పొలం వద్ద కూర్చొని పరిస్థితి వారికి ఏర్పడింది. సరైన మెడికల్ కిట్లు కూడా ఉపాధి పని వద్ద కనిపించడం పోవడం జరుగుతుంది. ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున ఉపాధి పనికి పోతూ ఉన్నారు. పని వద్దకు వెళ్లిన కూలీలకు ఎండ తీవ్రతతో డిహైడ్రేషన్ అయితే అక్కడ వారికి అందించడానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉండటం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఉపాధి కూలీలకు నీరు నీడ వైద్యం అందుబాటులో లేదని చెప్పవచ్చును. గత కొన్ని నెలలుగా ఉపాధి కూలీల వద్ద ఏర్పాటు చేయాల్సిన టెంటు సరఫరాలు కూడా నిలిపివేబూరు. ఎవరైనా ప్రశ్నిస్తే దానికి సమాధానం ఉండదు. దీనిపై పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం ఏమైపోతుంది. ఉపాధి పని వద్ద త్రాగునీటి సరఫరా చేయాల్సిన బాధ్యత ఎవరిది? కూలీలు స్వేదతీర్చుకునేందుకు నీడను కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? ఏదైనా ప్రమాదం జరిగితే అక్కడ ఫస్ట్ ఎయిడ్ చేసేందుకు కావాల్సిన మెడికల్ కిట్టు ఏమైంది? గత కొన్ని రోజులుగా ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి. ఈ ఎండలకు ఉపాధి కూలీలు ఉక్కిరిబిక్కిరితో అల్లాడిపోన్నారు. పనికి పోకుండా ఉండాలంటే ఆర్థిక ఇబ్బందులు గుర్తు చేస్తున్నాయి. గ్రామాల్లో జరిగే ఉపాధి పనుల వద్ద పర్యవేక్షించాల్సిన బాధ్యత మండలంలో ఎవరిది? ఆయా మండలాల్లో ఉపాధి హామీ అధికారులు ఏమైపోతున్నారు. కేవలం ఫీల్డ్‌అసిస్టెంట్‌లకే బాధ్యతలు ఇస్తున్నారే తప్ప ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు వసతుల గురించి ఎందుకు ఆదేశాలు ఇవ్వడం లేదు. దీనిపై ఎందుకు మౌనం వహిస్తున్నారు. ఉపాధి పని వద్ద కూలీలు ప్రాణాలు పోతేనే స్పందిస్తారా ఒక్కసారి ఆలోచించండి. ఉపాధి పనికి పోయిన ప్రతిఒక్కరికి అన్ని వసతులు ఏర్యాపటు చేసేవిధంగా ఉండాలి. వారి ఆరోగ్యానికి భద్రత ఇచ్చే విధంగా అధికారులు పనితీరు కనిపించాలి. వారు ఆరోగ్యంగా లేకపోయి ఏదైనా ప్రమాదం అక్కడ జరిగితే ఆ కుటుంబ పరిస్థితి ఏ విధంగా ఉంటుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు సంబంధిత ఉపాధిహామీ అధికారులు, ఉపాధి పనుల వద్ద కూలీలకు త్రాగునీరు నీడ వైద్యసేవలు మెడికల్ కిట్లు ఏర్పాటు చేసే వారికి అండగా నిలవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## సిపిఐ మండల కార్యదర్శిగా చింతిరాల రవి ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/చింతలపాలెం:** సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల సిపిఐ పార్టీ మండల కార్యదర్శిగా చింతిరాల రవి వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. చింతలపాలెం మండల కేంద్రంలో శని వారం జరిగిన మండల మహాసభలో ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం 13 మందితో నూతన మండల కౌన్సిల్, ఏడుగురితో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మూడోసారి బాధ్యతలు అప్పగించడం పట్ల ప్రజా సమస్యలపై నిరంతరం సమరశీల పోరాటాలను కొనసాగిస్తూ పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు.



## నల్లగొండలో ప్రశాంతంగా గ్రామపాలన అధికారుల పరీక్ష

**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లా కేంద్రంలోని నాగార్జున కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రామ పాలన అధికారుల పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.పరీక్ష ప్రారంభమైన వెంటనే జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ కలిసి గ్రామ పాలనాధికారుల పరీక్షను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఇన్విజిలేటర్లతో పరీక్ష తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పరీక్షకు హాజరైన వారు, గైర్హాజరైన వారి వివరాలను, పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, బందోబస్తు ,తదితర అన్ని అంశాలను పరిశీలించారు. కాగా నల్లగొండ జిల్లా నుండి గ్రామ పాలన అధికారుల పరీక్షకు 276 మంది హాజరు కావలసి ఉండగా 241 మంది పరీక్షకు హాజరయ్యారు. 35 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు . గ్రామ పాలనాధికారుల పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఇన్చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అధనపు కలెక్టర్ ,గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, తహసిల్దార్ హరిబాబు ఉన్నారు.

## సిపిఐ నార్కట్‌పల్లి మండల నూతన కార్యదర్శిగా పెండ్యాల శంకరయ్య



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** ప్రజా సమస్యలపై పోరాటానికి నిత్యం ప్రజారాజ్యంలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు ముందువరుసలో ఉండాలని నూతనంగా ఎన్నుకోబడిన నార్కట్ పల్లి మండల కమిటీ కార్యదర్శి పెండ్యాల శంకరయ్య అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన 7వ మహాసభలో పలు తీర్మాలను చేసి అనంతరం నూతన మండల సమితిని ఎన్నుకోవడం జర్గింది. మండలంలో అక్కెనపల్లి వాగు నుండి ఆకారం వరకు కాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలని, నార్కట్ పల్లి ఆర్టీసి డిపోకు అదనంగా 20 బస్సులను తెప్పించాలని, నార్కట్‌పల్లి లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ని మరమ్మత్తులు చేయించి వాడుకలోకి తీసుకురావాలని, చెర్వుగట్టు దేవస్థానానికి 20కోట్లు నిధులు విడుదల చేయాలని, జూనియార్ కాలేజీ కి సొంత భవనం ఏర్పాటు చేయాలని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, బి వెల్లెంల గ్రామంలో పూర్తి చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు పంచాలని తీర్మానించడం జర్గిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ తెలిపారు.

**నూతన మండల సమితి ఎన్నిక ఏకగ్రీవం:** మండలంలో నిర్వహించిన 7 వ మహాసభ విజయవంతంగా జరుపుకున్న అనంతరం పార్టీ మండల సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జర్గింది. నూతన మండల కార్యదర్శిగా పెండ్యాల శంకర్, సహాయ కార్యదర్శిగా వంగాల నాగయ్య, వనం వాసుదేవులు తోపాటు 11 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నకోవడం జరిగిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ తెలిపారు.

## జూన్ 6నసిపిఐ మండల మహాసభ



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మర్రిగూడ మండల కేంద్రంలో జూన్ 6న జరుగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల 15 వ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి కోరారు.ఆదివారం సిపిఐ కార్యాలయంలో మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు,ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ మధ్యతరగతి,బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం పార్టీ పాటుపడుతుందని అన్నారు.ఈ మహాసభను సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొంటారని తెలిపారు మండలంలోని వివిధ గ్రామాల నుంచి సిపిఐ ప్రతినిధులు పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సురేష్,కార్యవర్గ సభ్యులు బుర్ర శేఖర్,ఎరకల నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** కొండమల్లేపల్లి గ్రామ బొడ్రాయి పండుగ తృతియ వార్షికోత్సవంలో ఆదివారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలు నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని అన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం బొడ్రాయి పండుగను నిర్వహించుకోవడం ఆనంద దాయకం అని అన్నారు. కొండమల్లేపల్లి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.





## సాగర్‌లో పర్యాటకుల సందడి...

**ప్రజాపక్షం/నందికొండ:** ఆదివారం సాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది వేసవి సెలవులు రావడం అందులో వాతావరణం చల్లబడడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరెందుకు ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ లో ఆదివారం పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్ అందాలను తిలకించడానికి వచ్చారు ఆదివారం మొత్తం రెండు ట్రిప్పులు వేసిన టూరిజం శాఖ విద్యార్థులు,పర్యాటకులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. వారు లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడినుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. నాగార్జునసాగర్ నుండి కృష్ణానది మధ్యలో ఉన్న నాగార్జున కొండ ఐలాండ్ వరకు లాంచి ప్రయాణం తమకు ఎంతో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించిందని ప్రయాణికులు తమ అనుభూతిని పంచుకున్నారు.

## సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు

### సిపిఐ శ్రేణులకు గన్నా చంద్రశేఖర్ దిశా నిర్దేశం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(మఠంపల్లి):** సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు కొనసాగుదామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం మఠంపల్లి మండల సిపిఐ మహాసభ వర్ధాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. నీ, నా, తన, మన స్వార్ధం లేని నూతన సమాజాన్ని నిర్మించాలని, అన్నార్తుల, ఆక్రందనలు లేని దోపిడిలేని నవ సమాజం నిర్మాణం చేపట్టాలని, రైతన్నకి గిట్టుబాట ధరకు చట్టబద్ధత కల్పించాలని, నిరుద్యోగ యువత భృతి కోసం ఉద్యమించాలని, హరిజన, గిరిజన, ముస్లీం మైనార్టీలకై ప్రతి కార్యకర్త ఉద్యమించాలని ఆయన కోరారు. మఠంపల్లి మండలంలో గత నాలుగు దశాబ్దాలుగా తిష్ట వేసుకుని ఉన్న అనేక సమస్యలు పరిష్కారం కోసం పాలకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, ఆ హామీలను అమలు చేయాలని, కొత్త పెన్షన్ కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు పాలకులు కృషి చేయాలని, తెలంగాణలో కాంగ్రెస్ ఏర్పడిన సందర్భంగా ప్రజా పాలనలో అనేక దరఖాస్తులు తీసుకున్నారని వాటి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని, మఠంపల్లి మండలంలో ఉన్న పోడు భూముల రైతులకు పట్టాలిచ్చి వారికి కూడా రైతు బరోసా అందించాలని, అలాగే చివరి భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ అమరవీరుల ఆశయ సాధన కోసం కృషి చేస్తామని, మండల వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తామని, భవిష్యత్‌లో కూడా కార్మిక హక్కులు, రైతన్నల హక్కులు, విద్యార్థి, యువజన హక్కులపై ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేస్తామన్నారు. అమరారపు మట్టయ్య అధ్యక్షత వహించిన ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, మఠంపల్లి మండల సిపిఐ కార్యదర్శి అమరారపు పున్నయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, హుజూర్‌నగర్ సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, వల్దాసు రామయ్య, జలాలుద్దీన్, అలీబాబా, చలువాది సుబ్బారావు, అమరారపు వెంకటయ్య, చిన్న జాను, జానీబాషా, పెద్ద సైదులు, మీరావలి, సతీష్, సైదా, బూర రామకృష్ణ పాల్గొన్నారు.



## దోబీఘూట్ భూమి అన్యక్రాంతం

### మాభూమి మాకు ఇప్పించాలని కోరుతూ రజకుల వినతి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తిరుమలగిరి మున్సిపాలిటి కేంద్రంలో సర్వే నెంబర్ 495లో ప్రభుత్వం కేటాయించిన దోభిఘాట్ భూమి 27 కుంటలు అన్యక్రాంతమైంది. దీనిని తిరిగి తమకు ఇప్పించాలని కోరుతూ తిరుమలగిరి రజక సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌ను, ప్రజాప్రతినిధులను కోరారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం అధ్యక్షులు పులిమామిడి సోమన్న ,ప్రధాన కార్యదర్శి పులిమామిడి బిక్షం లు మాట్లాడుతూ తమ పూర్వికుల నుండి సర్వే 495లోని ప్రభుత్వ భూమి 27 కుంటల్లో ఓడల బావిని నిర్మించి అక్కడ బట్టలు ఉతుకుతూ వ్యవసాయం చేస్తూ జీవనం సాగించడం జరిగిందని తెలిపారు. నీటి వసతి లేక బట్టలు ఉతుకుటకు చెరువుల వద్దకు వెళ్లి ఉతుకుతుండటంతో తమకు ప్రభుత్వం కేటాయించిన 27 కుంటల భూమి కబ్జాకు గురైందన్నారు. గత ప్రభుత్వం మోడల్ దోభిఘాట్ నిర్మాణం కోసం అప్పటి తహసిల్దార్ ఇదే భూమిని సర్వే చేసి అధికారికంగా పత్రాలు కూడా తయారుచేసి జిల్లా కలెక్టర్‌కు పంపడం జరిగిందన్నారు. భూముల విలువ పెరగడంతో ధోభిఘాట్ భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన భూమిని కబ్జాదారుల నుండి ఇప్పించాలని తాము అధికారుల చుట్టు తిరుగుతున్నామని, ఐనా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిని తమకు ఇప్పించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో తిరుగలగిరి రజక సంఘం మండల కార్యదర్శి పులిమామిడి వెంకన్న పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి






**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ ప్రైవేట్ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యంతో మరో ఓ బాలింత మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి కోదాడ పట్టణంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీతిరుమల ప్రైవేట్ హాస్పిటల్ లో తెలంగాణ ఉద్యమకారుడు రాయపూడి వెంకటనారాయణ కుమార్తె హిమబిందు రెండో కాన్పుకోసం ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్చారు. శనివారం నార్మల్ డెలవరీ చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెను ఆసుపత్రులోని ఐసియులో వైద్యులు ఉంచారు. హిమబిందును చూపాలని ఆమె కుటుంబ సభ్యులు వైద్యులను కోరగా కొంత సమయం తర్వాత చూసేందుకు అనుమతి ఇస్తామని చెప్పారు. ఇలా ఆమెను చూడకుండా మాటలతో మభ్యపెడుతుండటంతో వారిని నిలదీయగా ఆమె మృతి చెందినట్లు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. వైద్యులు మాత్రం తమ తప్పేమిలేదని చెబుతున్నారు. ఈ ప్రైవేట్ హాస్పిటల్ గతంలో చికిత్సకు వచ్చిన వారు అనేకమంది మృత్యువాత పడ్డారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల చెంత చేరుతూ సదరు హాస్పిటల్ నిర్వాహకులు కాలం వెల్లదీస్తూ ఇలాంటి విపత్తు నుండి బయటపడుతున్నారు. దీనికి తోడు సామాజిక సేవల పేరుతో రక్తదాన శిబిరాలు నిర్వహించి సొమ్ము చేసుకుంటున్నారే ఆరోపణలు యాజమాన్యంపై ఉన్నాయి. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆసుపత్రి వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పారదర్శకంగా రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపిక : రమేష్



**ప్రజాపక్షం/మునగాల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా స్వయం ఉపాధి రుణాల కోసం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేని యువత లక్షలాదిమంది నిరుద్యోగులు, యువత యువ వికాసం పథకంలో దరఖాస్తులు చేసుకున్నారని, ఈ ఎంపిక పారదర్శకంగా జరగాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పథకంలో రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి స్వయం ఉపాధి రుణాలు, యూనిట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా నిరుద్యోగ యువత విద్యా ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటి సభ్యులు సతీష్, సైదులు, మండల అధ్యక్షులు ఖాధర్, గడ్డం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పి గారూ స్పందించండి... మాకు న్యాయం చేయండి

### ఆత్మకూర్ (ఎస్) ఎస్ఐ బెదిరింపువల్లే నా భర్త ఆత్మహత్యాయత్నం
### మా భూమిని అక్రమించిన వారికి అండగా ఉంటూ మమ్మల్ని వేధిస్తున్నారు
### విలేకరుల ముందు బోరున విలపించిన బాధిత కుటుంబం

**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్):** ఆత్మకూర్ (ఎస్) ఎస్ఐ తమ భూమిని అక్రమించిన వారికి అండగా ఉంటూ మమ్మల్ని బెదిరింపులకు గురి చేస్తూ వేధిస్తున్నాడని దీంతో నాభర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చావు బతుకుల మధ్య ఉన్నాడని జిల్లా ఎస్‌పి స్పందించి మా భూమిని మాకు అప్పగించి న్యాయం చేయాలని ఆత్మకూర్ ఎస్ మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహడ్ గ్రామానికి చెందిన సూరం ధనలక్ష్మి వేడుకున్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణ జనరల్ ఆసుపత్రిలో ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన తన భర్తను చూపుతూ విలేకరుల ముందు బోరున విలపిస్తూ తనగోడును వెల్లబోసుకున్నారు. తనభర్త సూరం సైదులు అరోగ్యం బాగోలేదని మాకు గ్రామంలోని సర్వే నెంబర్ 118, 119లో 14 ఎకరాల భూమి ఉందని, మా భూమి పక్కనే మా ఆడబిడ్డ భర్త రాంపల్లి రాంబాబుకు ఎకరం భూమి ఉందన్నారు. ఆయన మా భూమికి ముప్పావు ఎకరం భూమి వరకు కబ్జా చేశారని, ఇదేమిటని అడిగితే నాపై, నా భర్తపై దాడిచేసి మముల్నికొట్టి మా ఒంటిపై ఉన్న బంగారం గొలుసు లాక్కెళ్లారని తెలిపారు. దీంతో తాము పోలీసులను ఆశ్రయించామని నాడు పోలీసులు స్పందించకపోవడంతో ఉన్నతాధికారులకు విషయాన్ని తెలపగా వారు చట్టప్రకారం తేల్చుకోవాల్సిందిగా సూచించారని తెలిపారు. దీంతో తాము ఆర్టీఏ చట్టం కింద పెట్టామన్నారు. తాము చట్టప్రకారం వెళుతుండటంతో ఆడబిడ్డ రాంపల్లి ఉమా రాంబాబులు తిరిగి ఎస్ఐ పై ఒత్తిడి తేస్తూ మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇటీవల మా పెద్ద ఆడబిడ్డ నా భర్త ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చూసేందుకు రాగా ఆమె కుమారిడితో రాంపల్లి రాంబాబు గొడవకు దిగారని, ఇదే విషయమై తాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా మీరే దాడిచేసి మీరే ఫిర్యాదు చేస్తున్నారా అంటూ ఎస్ఐ అనరాని మాటలు అన్నాడని తెలిపారు. చీటికి మాటికి మమ్ముల్ని స్టేషన్‌కు పిలిపించి నా కూతురు, కుమారుడిపై కేసు పెడతామంటూ వారిని చదువుకోనివ్వనంటూ బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై నా భర్త ఆవేదనకు గురై పోలీసులు పట్టించుకోవడంలేదంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అన్నారు. నా భర్త చావు బతుకుల మధ్య ఉన్నాడని, నా భర్తకు ఏదైనా జరిగితే దానికి ఎస్ఐ బాధ్యత వహించాలని అన్నారు. దీనిపై జిల్లా ఎస్‌పి సమగ్ర విచారణ చేసి మా భూమిని మాకు అప్పగించాలని కోరారు.



## రహదారిపై అండర్ పాస్‌లను పెంచాలి



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి పరిధిలో జాతీయ రహదారి 65 నెంబర్‌పై నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ కారణంగా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అదనంగా మరో రెండు ప్రాంతాలలో అండర్ పాస్ నిర్మాణాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం స్థానిక బిజెపి నాయకులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. సుమారు కిలో మీటరు మేర నిర్మిస్తున్న వంతెనకు కేవలం ఒకే దగ్గర అండర్ పాస్ నిర్మాణం చేపట్టడం వల్ల పట్టణ ప్రజలు ఇరు వైపుల వెళ్ళాలంటే అనేక సమస్యలకు గురి కావల్సి వస్తుందని, ముఖ్యంగా పాదచారులు ఒకవైపు నుండి మరోవైపు వెళ్ళాలంటే చాలా దూరం నడిచి వెళ్ళాల్సి ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. బస్టాండ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీప ప్రాంతాలలో మరో రెండు అండర్ పాస్ నిర్మాణాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, కనీసం పాదచారులు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు వెళ్ళేలా నిర్మాణం కోసం చొరవ తీసుకోవాలని వారు కోరారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో నాయకులు గుండాల నరేష్‌గౌడ్, మాస శ్రీనివాస్, కందాటి చంద్రారెడ్డి, ముక్కాముల పరమేష్, ఆగు అశోక్ తదితరులున్నారు.

**ఎంఎల్ఏకు విన్నపం:** ఇదే రోజు ఉదయం పట్టణానికి చెందిన అఖిల పక్ష పార్టీలు, వ్యాపారస్థులు, వివిధ వర్గాల ప్రజలు కలిసి అండర్ పాసింగ్‌ల నిర్మాణ విషయంపై స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశంను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఎంఎల్ఏ ఈ విషయంపై మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిని వెంటనే సంప్రదించి సమస్యను వివరించడం జరిగింది. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని వారు హామీ ఇచ్చారు.

## మద్యపానాన్ని నిషేదించాలి

**ప్రజాపక్షం/మునగాల:** తెలంగాణ రాష్ట్రంలో తెలుగింటి ఆడపడుచుల పసుపు కుంకుమలను దోచుకుంటున్న మద్యాన్ని సంపూర్ణంగా నిషేదించాలని, లేనిచో బిసి ఉద్యమనేత ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో బిసి సంఘాల ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని సెక్రటరీయేట్‌ను ముట్టడిస్తామని బిసి విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో విఫరీతమైన మద్యం షాపులు, బెల్టుషాపులు వల్ల ఎంతోమంది యువకులు తాగుడుకు బానీసై చనిపోతున్నారని, కొంతమంది మద్యంసేవించి వాహనాలు నడపడం వల్ల యాక్సిడెంట్లు జరిగి అనేక మంది ప్రాణాలు గాలిలో కలిశాయని అన్నారు. దీంతో భార్యలు, తల్లిదండ్రులు, చిన్న పిల్లలు అనాధలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ సంఘాలతో ఉద్యమాలు చేసి హైద్రాబాద్ సెక్రటరియేట్‌ను ముట్టడిస్తామన్నారు.

# క్రీడ

# సూపర్ కింగ్స్ ఆల్‌రౌండ్ షో..




## గుజరాత్‌కు రెండో హార్ట్‌బ్రేక్..

ఐపిఎల్ 18వ సీజన్ చివరి లీగ్ మ్యాచ్‌లోనూ గుజరాత్ టైటాన్స్‌కు ఓటమి తప్పలేదు. టాపార్డర్‌నే నమ్ముకంటూ వరుస విజయాలు సాధిస్తూ ప్లే ఆఫ్స్ చేరిన ఆ జట్టు.. సొంత గడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్ల ధాటికి కుప్పకూలింది. భారీ ఛేదనలో టాపార్డర్‌లోనే 3 వికెట్లు కోల్పోయిన గుజరాత్.. రవీంద్ర జడేజా (217), నూర్ అహ్మద్(321)ల స్పిన్‌కు విలవిలలాడింది. ఈ ఇద్దరూ తిప్పేయడంతో 83 పరుగుల తేడాతో సీఎస్కే జయకేతనం ఎగురవేసింది. ఈ ఎడిషన్‌కు విజయంతో వీడ్కోలు పలికింది. గత మ్యాచ్‌లో 200 ప్లస్ లక్ష్యాన్ని అందుకోలేక లక్నో చేతిలో చిత్తైన గిల్ బృందానికి తాజా పరాజయం శరాఘాతమే. ప్లే ఆఫ్స్ చేరుకోలేదనే బాధలో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ ఎట్టకేలకు మురిసింది. లీగ్ దశ చివరి పోరులో గుజరాత్ టైటాన్స్‌ను వాళ్ల సొంత గడ్డపైనే ఓడించిన సీఎస్కే గెలుపు సంబురాలు చేసుకుంది. బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో 330 రన్స్ కొట్టిన చెన్నై.. అనంతరం బౌలర్ల విజృంభణతో ఆతిథ్య జట్టును 147కే కట్టడి చేసింది. 83 పరుగుల భారీ విజయంతో టోర్నీకి వీడ్కోలు పలికింది ధోనీ సేన. మరోవైపు.. గత పోరు లక్నో చేతిలో కంగు తిన్న గిల్ బృందానికి.. ఈ ఓటమి రెండో హార్ట్ బ్రేక్ కానుంది. వరుసగా రెండో మ్యాచ్‌లో 200 ప్లస్ ఛేదనకు సిద్ధమైన గుజరాత్ టైటాన్స్‌కు చెన్నై పేసర్లు భారీ షాక్ ఇచ్చారు. భీకర ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్(13) ను అన్షుల్ కంబోజ్ మూడో ఓవర్లోనే పెవిలియన్ చేరాడు. 24కే తొలి వికెట్ పడిన వేళ జోస్ బట్లర్(5), సాయి సుదర్శన్(41 నాటౌట్)తో కలిసి జట్టును ఆదుకుంటాడని అనుకుంటే.. అతడిని ఖలీల్ వెనక్కి పంపాడు. వరుసగా రెండు వికెట్ల షాక్ నుంచి తేరుకునేలోపే.. డేంజరస్ హిట్టర్ రూథర్‌ఫోర్డ్(0)ను అన్షుల్ డకౌట్ చేశాడు. అంతే.. గుజరాత్ 5వ ఓవర్ మూడో బంతికే మూడో కోల్పోయింది. తద్వారా ఈ సీజన్‌లో శుభ్‌మన్ గిల్ సేన తొలిసారి పవర్ ప్లేలో మూడు వికెట్లు కోల్పోయింది. కష్టాల్లో పడిన జట్టును ఓపెనర్ సాయి సుదర్శన్(41), షారుక్ ఖాన్(19)లు ఆదుకునే ప్రయత్నం చేశారు. శివం దూబే వేసిన 10వ ఓవర్లో సాయి వరుసగా రెండో ఫోర్లు కొట్టగా.. షారుక్ ఖాన్ స్ట్రెయిట్‌గా సిక్సర్ బాదగా స్కోర్ 80 దాటింది. 10 ఓవర్లకు ఓవర్లకు గుజరాత్ స్కోర్.. 853. దాంతో, అప్పటికీ ఆ జట్టుకు గెలుపుపై ఆశలు ఉన్నాయి.

### జడ్డూ జాదూ..

క్రీజులో పాతుకు పోయిన సాయి, షారుక్‌లను విడదీసిన జడేజా గుజరాత్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. స్ట్రాటజిక్ బ్రేక్ తర్వాత బంతి అందుకున్న జడ్డూ.. తొలుత షారుక్‌ను పెవిలియన్ చేర్చాడు. దాంతో, నాలుగు వికెట్ 55 పరుగుల భాగస్వామ్యాన్ని విడగొట్టాడు. అదే ఓవర్లో నాలుగో బంతికి సాయి పెద్ద షాట్ ఆడి శివం దూబేకు చిక్కాడు.
అంతే.. 86 వద్ద గుజరాత్ ఐదో వికెట్ పడింది. ఆ తర్వాత నూర్ అహ్మద్ (321) తన స్పిన్ మ్యాజిక్ చూపిస్తూ రషీద్ ఖాన్(12), గెరాల్డ్ కొయెట్జీ(5), రాహుల్ తెవాటియా(14)లను ఔట్ చేసి గుజరాత్‌ను ఓటమి అంచుల్లోకి నెట్టాడు. అన్షుల్ కంబోజ్ వేసిన 19వ ఓవర్లో సాయి కిశోర్ ధోనీకి క్యాచ్ ఇవ్వడంతో గుజరాత్ 147కే ఆలౌటయ్యింది.

### బ్రెవిస్, కాన్వే విధ్వంసం

చివరిదైన లీగ్ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు చెలరేగారు. ఆకలిగొన్న సింహాల్లా గుజరాత్ టైటాన్స్ బౌలర్లపై విరుచుకుపడి బౌండరీలతో విజృంభించారు. ఓపెనర్లు డెవాన్ కాన్వే(52), ఆయుష్ మాత్రే (34) రెచ్చిపోయి ఆడారు. వరుసగా 6, 6, 4, 4, 6తో 24 పరుగులు పిండుకున్నాడు. మాత్రేతో కలిసి 44 రన్స్ జోడించిన కాన్వే.. అనంతరం.. ఉర్విల్ పటేల్(37)తో కలసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. దూకుడుగా ఆడిన ఉర్విల్ రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించాడు. సాయి కిశోర్ బౌలింగ్‌లో సిక్సర్ బాదిన ఉర్విల్.. ఆ తర్వాత క్రీజు వదిలి పెద్ద షాట్‌కు యత్నించి మిడాఫ్‌లో శుభ్‌మన్ గిల్ చేతికి దొరికాడు. దాంతో, 107 వద్ద చెన్నై రెండో వికెట్ పడింది.
ఆఖర్లో కుర్రాడు డెవాల్డ్ బ్రెవిస్(57) ఆకాశమే హద్దుగా ఆడాడు. ఫోర్లు, సిక్సర్లతో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన బ్రెవిస్.. చెన్నై స్కోర్ 200 దాటించాడు. డెత్ ఓవర్లలో జడేజాతో కలిసి శివాలెత్తిపోయాడు. సిరాజ్ వేసిన 19వ ఓవర్లో 6, 4 బాది హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కాన్వే, బ్రెవిస్ మెరుపులతో, చెన్నై నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి పరుగులు చేసింది.

## క్లాసెన్, హెడ్ విధ్వంసం..

ఐపిఎల్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ స్కోరు చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 278 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (105; 39 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్స్‌లు) 'శత' క్కొట్టగా.. ట్రావిస్ హెడ్ (76; 40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగాడు. అభిషేక్ శర్మ (32; 16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపూ మెరుపులు మెరిపించాడు. ఇషాన్ కిషన్ (29; 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 2, వైభవ్ అరోరా ఒక వికెట్ పడగొట్టారు. వైభవ్ అరోరా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో రెండే పరుగులు రాగా.. తర్వాత నుంచి హైదరాబాద్ బ్యాటర్ల విధ్వంసం మొదలైంది. వైభవ్ వేసిన మూడో ఓవర్‌లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ బాదిన హెడ్. హర్షిత్ బౌలింగ్‌లో మూడు ఫోర్లు బాదాడు. నరైన్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు బాదిన అభిషేక్ తర్వాత బంతికే ఔటైపోయాడు. కాసేపటికే హెడ్ అర్ధ శతకం (26 బంతుల్లో) అందుకున్నాడు. మరోవైపు, క్రీజులోకి వచ్చిన క్లాసెన్ కూడా దూకుడుగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వరుణ్ బౌలింగ్‌లో క్లాసెన్ మూడు ఫోర్లు బాదేయడంతో 10 ఓవర్లకు స్కోరు 139/1కి చేరింది. హర్షిత్ బౌలింగ్‌లో క్లాసెన్ వరుసగా 4, 6, 6 కొట్టి 17 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకున్నాడు. తర్వాత నరైన్ బౌలింగ్‌లో హెడ్. రస్సెల్‌కు చిక్కాడు. క్లాసెన్, ఇషాన్ జోరు కొనసాగించడంతో 18 ఓవర్లకు స్కోరు 250 దాటింది. దీంతో సన్‌రైజర్స్ తన పేరిట ఉన్న 287/3 స్కోరు రికార్డును తిరగరాస్తుందేమో అనిపించింది. అయితే, తర్వాతి ఓవర్లో వైభవ్ ఇషాన్‌ను ఔట్ చేసి ఏడు పరుగులే ఇచ్చాడు. చివరి ఓవర్‌లో 17 పరుగులే రావడంతో కొత్త రికార్డు నమోదు కాలేదు.



# రీల్

## ఆ నలుగురిలో నేను లేను

### థియేటర్ల బంద్ వివాదంపై స్పందించిన అల్లు అరవింద్



'ఆ నలుగురు'లో నేను లేను... ఆ నలుగురులో నన్ను కలపకండి... ఆ వ్యాపారం వదిలేశాను. పదిహేను వందల థియేటర్లు ఉంటే నాకు పదిహేను మాత్రమే ఉన్నాయి. తెలంగాణాలో ఒక్క థియేటర్ మాత్రమే ఉంది' అని అల్లు అరవింద్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో జరుగుతున్న పరిణామాలపై నిర్మాత అల్లు అరవింద్ క్లారిటీ ఇచ్చారు. రెండు రోజులుగా సినిమా ఇండస్ట్రీలో జరుగుతున్న విషయాల గురించి మీకు అవగాహన ఉంది. మీడియాలో ఆనలుగురు అనే ఓ ప్రచారం ఉంది. ఆ నలుగురికి నాకు సంబంధం లేదు. నేను ఆ నలుగురిలో లేను. గత పదిహేను సంవత్సరాల క్రితం ఆ నలుగురు అనే సంబోదన స్టార్ట్ అయ్యింది. అది ఎవరూ పట్టించుకోవడం లేదు. పదిమంది దగ్గర ప్రస్తుతం థియేటర్‌లు ఉన్నాయి. ఆ నలుగురు వ్యాపారం నుంచి కోవిడ్ సమయంలోనే బయటికి వచ్చేశాను. తెలంగాణలో నాకు ఒక్క థియేటర్ మాత్రమే ఉంది. ఏఏఏ ఏషియన్ థియేటర్ మాత్రమే వుంది. ఆంధ్రాలో కూడా అన్ని థియేటర్స్ ఎప్పుడో వదిలేశాను. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో పదిహేను వందలు థియేటర్స్ ఉంటే మా దగ్గర కేవలం పదిహేను మాత్రమే ఉన్నాయి. ఈ థియేటర్‌లు కూడా లీజు రెన్యూవల్ గడువు ముగిసిన తరువాత లీజు కంటిన్యూ చేయడం లేదు. పాత అలవాటు ప్రకారం ఆ నలుగురిలో నా ఫోటోను వాడుకుంటున్నారు. జూన్1 నుంచి థియేటర్స్ మూసివేస్తాం అనే అంశంపై సినిమాటోగ్రఫీ మంత్రి రియాక్ట అయిన విధానం చాలా సమంజసంగా ఉందని నాకు అనిపించింది. నేను ఈ థియేటర్స్ అంశానికి సంబంధించిన ఏ మీటింగ్‌లో పాల్గొనలేదు. నా గీతా డిస్ట్రిబ్యూషన్ సంబంధించిన వ్యక్తులు కానీ, నాతో అసోసియేట్ అయిన మనుషులు కానీ ఈ మీటింగ్‌కు వెళ్లొద్దని చెప్పాను. థియేటర్స్‌కు చాలా కష్టాలు ఉన్నప్పుడు ఇండస్ట్రీపెద్దలతో మాట్లాడి సమస్యలు, సామరస్యంగా పరిష్కరించుకోవాలి. థియేటర్స్ మూసివేస్తున్నాం అనడం కరెక్ట్ కాదు. పవన్ కల్యాణ్ సినిమా విడుదల సమయంలో థియేటర్స్ మూసి వేస్తామని చెప్పడం దుస్సాహసం. ఎవరో ఇటీవల మనది ప్రభుత్వానికి సంబంధం లేని రంగం అని అంటుంటే విన్నాను. ప్రభుత్వానికి సంబంధం లేని పరిశ్రమ అయితే గత చీఫ్ మినిస్టర్‌ను సినీ పరిశ్రమలోని పెద్ద పెద్ద వాళ్లంతా వెళ్లి ఎందుకు కలిశారు? ఏ వ్యాపారం అయినా సవ్యంగా చేసుకోవాలంటే ప్రభుత్వ సహకారం లేకుండా జరగదు. ఇప్పుడు ప్రభుత్వంను వెళ్లి కలవకపోవడం సరికాదు. మనకు కష్టం వస్తే తప్ప మనం ప్రభుత్వం దగ్గరికి వెళ్లమా? ఏపీ మంత్రి దగ్గర నుంచి వచ్చిన నోట్ ఎంతో సమర్థనీయంగా ఉంది. నిజంగానే సింగిల్ స్క్రీన్ థియేటర్లకు సమస్యలు ఉన్నాయి. సమస్యలు ఉన్నప్పుడు మాట్లాడుకోవాలి తప్ప ఇలా థియేటర్స్ మూసి వేస్తున్నామని చెప్పడం సరికాదు' అన్నారు. నా దగ్గర నుంచి సినిమా తీసుకువెళ్ళేది థియేటర్ ఓనర్ కాదు డిస్ట్రిబ్యూటర్. క్యూబ్ కంపెనీలో నాకు వాటా లేదు. అది సురేష్ బాబు చేతుల్లో కూడా లేదు. అందులో నేను భాగస్వామిని కాదు అని మీడియా ప్రతినిధి ఒకరు అడిగిన ప్రశ్నకు అల్లు అరవింద్ సమాధానం చెప్పారు.

## 'ఓజీ' రిలీజ్ డేట్ ఫిక్స్..




పవన్‌కల్యాణ్ అభిమానులకు శుభవార్త. సుజీత్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఓజీ'. ఈ మూవీ ఎప్పుడెప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తున్న వారి కోసం చిత్ర బృందం క్రేజీ అప్‌డేట్‌ను ఇచ్చింది. ఈ చిత్రాన్ని దసరా కానుకగా సెప్టెంబరు 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ 'ఫైరింగ్ వరల్డ్ 25 సెప్టెంబరు 25' అని పేర్కొంది. ఈ ప్రకటనతో పవన్ అభిమానులు తెగ సంబర పడిపోతున్నారు. పవన్‌కల్యాణ్ ఇప్పటికే ఒప్పుకొన్న సినిమాలను ఒక్కొక్కటిగా పూర్తి చేసే పనిలో ఉన్నారు. తాజాగా 'హరి హర వీరమల్లు' షూటింగ్ పూర్తి చేసి, 'ఓజీ' కోసం రంగంలోకి దిగారు. ఇటీవల షూటింగ్ మళ్లీ మొదలు పెట్టినట్లు చిత్ర బృందం కూడా ప్రకటించింది. వీలైనంత త్వరగా ఈ మూవీని పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ భావిస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన టీజర్ మూవీ అంచనాలను పెంచింది.

## అదే ఉంటే హారర్ సినిమా చేసేదాన్ని కాదు..

### నెపోటిజంపై అదా శర్మ కామెంట్స్



బాలీవుడ్‌లో బంధుప్రీతి (నెపోటిజం)పై తరచుగా చర్చలు జరుగుతాయన్న విషయం తెలిసిందే. ఈ విషయంపై నటి అదా శర్మ తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను సినిమా కుటుంబం నుండి వచ్చి ఉంటే.. తనను హారర్ సినిమాతో పరిచయం చేసేవారు కాదని ఆమె పేర్కొన్నారు. అదా శర్మ తన కెరీర్‌ను 2008లో విడుదలైన హారర్ సినిమా '1920' తో ప్రారంభించారు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద విజయం సాధించినప్పటికీ, ఒక నటిగా మంచి గుర్తింపు లభించలేదు. దీనిపై అదా శర్మ మాట్లాడుతూ, నేను సినిమా కుటుంబం నుండి వచ్చి ఉంటే, నన్ను పరిచయం చేయడానికి ఒక పర్ఫెక్ట్ రొమాంటిక్ సినిమా కోసం వేచి ఉండేవారు. నా కుటుంబం నన్ను హారర్ సినిమా చేయనిచ్చేది కాదు. ఎవరు తమ కెరీర్‌ను దెయ్యం పట్టినట్లు, నల్లటి పళ్లతో తెరపై కనిపిస్తూ ప్రారంభిస్తారు? ప్రముఖుల కుటుంబం నుండి వచ్చి ఉంటే, ఒక సాధారణ రొమాంటిక్ సినిమాతో నా కెరీర్ ప్రారంభమయ్యే అవకాశం ఉండేది. నేను '1920' తో ప్రారంభించాను, అందుకు నేను అదృష్టవంతురాలిని. నేను ఏదైనా కొత్తగా ప్రయత్నించినప్పుడల్లా ప్రేక్షకులు నన్ను అంగీకరించారు, బహుశా అందుకే సినీ నిర్మాతలు కూడా నన్ను విభిన్న పాత్రలలో నటించడానికి ధైర్యం చేస్తున్నారు అని అన్నారు.

# త్రివేణి సంగమంలో గవర్నర్ పుష్కర స్నానాలు

### కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో గవర్నర్ దంపతుల ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం** : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన కాళేశ్వరం త్రివేణి సంగమంలో ఆదివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు శాస్త్రక్తంగా పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి ఏక శిలా విగ్రహాన్ని దర్శించుకున్నారు. హైదరాబాద్ నుండి ఉదయం 11:02 గంటలకు హెలికాప్టర్ ద్వారా కాళేశ్వరం చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ దంపతులకు ఐటి పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే పుష్ప గుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం త్రివేణి సంగమ తీరంలో గవర్నర్ దంపతులు వేద పుష్కర స్నానం ఆచరించి నదీతీరంలో వేదపండితుల మంత్రోచ్ఛారణాల మధ్య సరస్వతీ నదీమతల్లికి సారె, చీర సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవర్నర్ దంపతులు శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు దేవాదాయ శాఖ కమీషనర్ వెంకట్ రావు స్వాగతం పలుకగా ప్రధాన రాజగోపురం వద్ద గవర్నర్ దంపతులకు ఆలయ అర్చకులు పరివట్టం, పూర్ణ కుంభం, మంగళ వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ దంపతులు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. గవర్నర్ దంపతులకు ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో ఆశీర్వచనం అందించి స్వామి వారి శేష వస్త్రలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు.అనంతరం సరస్వతీ మాత అమ్మవారి జ్ఞాపికను గవర్నర్ దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సరస్వతీ పుష్కర ఘాట్ తీరం వద్ద ప్రతి రోజు సాయంత్రం కాశీ పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరస్వతి నవరత్న మాలా హారతి వైభవాన్ని గవర్నర్ కు వివరించారు. అనంతరం పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన గవర్నర్‌అధికారులను అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, గత 11రోజుల నుండి సరస్వతీ పుష్కరాలు వైభవంగా జరుగుతున్నాయని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.భక్తుల పుష్కర స్నానాలు ఆచరించాలని ఈ సందర్భంగా గవర్నర్ సూచించారు. ఆయన వెంట రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**పుష్కర స్నానం ఆచరించిన పలువురు ప్రముఖులు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాల్లో భాగంగా పలువురు ప్రముఖులు త్రివేణి సంగమ తీరంలో పుష్కర స్నానాలు ఆచరించారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ కుటుంబ సమేతంగా కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా త్రివేణి సంగమంలో యోగానంద సరస్వతీ పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినీనటులు తనికెళ్ళ భరణి పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.




# సిపిఐ పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేట్ శక్తులకు దాసోహమై కార్మిక, కర్షక, శ్రామిక వర్గాలను అణచి వేసే దిశగా పాలిస్తూ అత్యంత ప్రమాదకరంగా తయారైందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఒక్కటొక్కటిగా ప్రభుత్వ ప్రయివేట్ రంగ సంస్థలన్నిటిని అంబాని, ఆదానిలాంటి సంపన్న వర్గాలకు ప్రయివేటీకరణ పేరట అప్పచెప్పి వారిచ్చే డబ్బులతో ఎన్నికల్లో ఓట్లు పొందేందుకు కుటిల యత్నాలకు పాల్పడుతున్న బిజెపిని అంతం చేయాల్సిందేనన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిని తప్పుడు కేసులు బనాయించటం ద్వారా వరవరరావు, దివంగత ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వాళ్లను జైళ్లల్లో మగ్గేలా చేయటమో, చివరికి ప్రాణాలు పోవటమో లాంటి విధానాలతో బిజెపి ప్రభుత్వం అణచిస వేస్తోందన్నారు. దోపిడీలు చేసే వారు అధికారంలో, ప్రజా పోరాటంలో ఉన్న వారు కారాగారాల్లో ఉండాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొందని వాపోయారు. ప్రజా సమస్యల సాధనే లక్ష్యంగా తమ జీవితాలను పణంగా పెట్టి తమ వారందరిని వదలి పెట్టి అడవుల్లో కాలం గడుపుతూ పోరాటం చేస్తున్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరిట హతమార్చే హక్కు ప్రభుత్వానికి ఎక్కడిదని ఎమ్మెల్యే కూనంనేని ప్రశ్నిస్తూ చర్చలకు సిద్ధమని చెబుతున్నా అవకాశం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. అదే విధంగా పహల్గాం ఉగ్రవాదుల దాడులను సైతం తమకు అనుకూలంగా మార్చుకొన్న బిజెపి ప్రభుత్వం హిందూ ముస్లిం విభేధాలుగా చెప్పుకోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉగ్రవాదులకు కుల, మత,ప్రాంత తేడాలు అనేవి ఉండవని, కేవలం ఇస్లాం రాజ్య లక్ష్యంగా నరమేధానికి పాల్పడుతుంటారని, ఇలాంటి ఉదంతాలు అనేక దేశాల్లో తరచు చోటు చేసుకొంటున్నాయన్నారు. ఇందుకు గాను దేశంలో వామపక్ష లౌకిక శక్తులు ఏకం కావాలన్నారు.

### ప్రజల్లో చైతన్యం తేవాలి

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు, ఓట్ల కోసం వైషమ్యాలను రెచ్చ గొట్టే తీరును ప్రజల ముందుకు తీసుకెళ్లటానికి కమ్యూనిస్టులు కృషి చేయాలన్నారు. మండల స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు నిర్వహించే మహాసభల్లో పజా సమస్యలను అధ్యయనం చేసుకొంటూ అనుసరించాల్సిన విధానాల రూపకల్పనతో నిర్మాణాత్మకంగా కదిలే సత్తా కేవలం సిపిఐకి మాత్రమే ఉందన్నారు. అధికారంతో పని లేకుండా ప్రజా పోరాటాల్లో అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ పోరాటం చేస్తున్నది సిపిఐ మాత్రమే అన్న విషయాన్ని ప్రజల్లో మరింత ముందుకు తీసుకొని వెళ్లాలన్నారు. గత వందేళ్ల కాలంలో ప్రతికూల పరిస్థితులను సైతం లెక్క చేయకుండా ప్రజల మధ్యనే ఉంటూ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ నిలుస్తన్న ఏకైక పార్టీ సిపిఐ ఉద్యమాలే అన్నారు. డబ్బులతో పని లేకుండా ఎన్నికలు జరిపితే సిపిఐ అభ్యర్థులకు విజయ ఢంకా మోగించే సత్తా ఉందన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చట్ట సభల్లో బలహీనంగా ఉన్నప్పటికి అన్ని వర్గాలను సమీకృతం చేస్తూ ముందకు వెళ్లే సత్తా ఉన్న పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. గత పదేళ్ల కాలంగా బిజెపి పాలనలో అప్రజాస్వామిక పాలన, కార్మిక, శ్రామిక, కర్షక వ్యతిరేక విధానాలు కొనసాగుతున్నాయని వీటికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు.కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, రిజర్వేషన్లు సైతం ఎత్తివేసే కుటిల యత్నాలకు పాల్పడుతోందని, సిపిఐ పోరాడి కేంద్ర ప్రభుత్వ తలలు వంచి కులగణనకు సిద్దమయ్యేలా చేసామన్నారు. సిద్ధాంత పరంగా నిస్వార్థంగా కమ్యూనిస్టులు సమరశీల పోరాట బాట పట్టాలని ఆయన పిలుపిచ్చారు. అధికారం లేక పోతే కొద్ది కాలానికే కనుమరగయ్యే రాజకీయ పార్టీల తరహాలో కాకుండా సిపిఐ వందేళ్ల కాలంలో ప్రజల మధ్యే నిరంతరం ఉంటూ బలమైనా పార్టీగా నిలిచిందన్నారు. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో అన్నివర్గాలపై నిర్బంధంతో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడ్డారని, కార్మిక యూనియన్లను అణచి వేసారన్నారు. అనంతరం వివిఎస్ బోస్, ఎండి యూసూఫ్‌లు సభను ఉద్దేశించి ప్రసంగించారు.
మహాసభకు ముందుగా ఈసిఐఎల్ చౌరాస్తా నుండి సిపిఐ శ్రేణులు కార్యస్థలి వరకు ఎర్రజెండాల చేతబట్టుకొని పార్టీ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి అమర వీరులకు జోహారులర్పించారు. సభ ప్రారంభంలో అమరులైన బాలమల్లేష్, రొయ్యల కృష్ణమూర్తి, పోటు ప్రసాద్ తదితరులకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి డిజి సాయిలు గౌడ్, సహాయ కార్యదర్శి ఉమామహేష్, ప్రజా సంఘాల నాయకులు మండల కార్యదర్శులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోలీసుల డేగ కన్ను

(మొదటి పేజీ తరువాయి)

నిఘా పెట్టారు. ఫరహాన్‌తో పాటు అతని స్నేహితులు, కుటుంబ సభ్యుల కదలికలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఫరహాన్ హైదరాబాద్‌కు ఎప్పుడెప్పుడు వచ్చాడు, ఎవరిని కలిసేవాడు అనే అంశంపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. స్వచ్ఛందసంస్థ ముసుగులో ఫరహాన్ ఉగ్రకార్యకలాపాలకు పాల్పడుతున్నాడని నసీర్, సమీర్‌లు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. ఈ సమాచారం మేరకు విజయనగరం పోలీసులతో పాటు తెలంగాణ పోలీసులు వరంగల్‌కు చేరుకుని అహీం సంస్థపై ఆరా తీస్తున్నారు. ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థలో పని చేస్తు పట్టుబడిన నసీర్, సమీర్‌లకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో ఉగ్రవాది బాదర్‌తో కూడా పరిచయాలు ఉన్నట్లు విచారణలో తేలింది. దీంతో మరో పోలీసు బృందం ఒకటిరెండు రోజుల్లో యూపికి వెళ్లనున్నట్లు తెలిసింది. అసలు ఈ బాదర్ ఎవరు, గతంలో ఇతనిపై ఏమైనా నేర చరిత్ర ఉందదా, ఉగ్ర కార్యకలాపాలపై ఆరా తీసే అవకాశాలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాదర్, వరంగల్‌కు చెందిన ఫరహాన్‌లను కూడా త్వరలో అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయి. వీరికి కూడా సౌదీ నుంచి 'ఉగ్ర' నిదులు అందాయా అనే అంశంపై పోలీసులు కన్నేసిపెట్టారు. వారి బ్యాంక్ ఖాతాలపై ఆరా తీస్తున్నారు.

# కలుపుతీతే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

లంచం డిమాండ్ చేస్తూన్నారు కొంత మంది పోలీసులు. గత ఏడాది తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అనేక పోలీసు అధికారులను అవినీతి కేసుల్లో అరెస్టు చేసింది. ఈ కేసులు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నమోదయ్యాయి. కేవలం ఒక్క పోలీసు శాఖలోనే ఎసిబి అధికారులు 31 మంది పోలీసులను లంచం తీసుకుంటుండగా పట్టుకుంది. వీరిలో కానిస్టేబుల్ స్థాయి నుంచి డిఎస్‌పి స్థాయి వరకు ఉన్నారు. ఇతర విభాగాలకంటే ముందు పోలీసు విభాగంలో ఉన్న అవినీతి పరులను ఏరివేయడమే డిజి విజయ్‌కుమార్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే అవినీతి పోలీసులపై ఫిర్యాదు చేసే బాధితుల పక్షాన ఆయన సింహస్వప్నంగా నిలుస్తున్నారు. అవినీతికి పాల్పడిన కొన్ని ముఖ్య ఘటనలు పరిశీలిస్తే సూర్యాపేట జిల్లాలో సూర్యపేట డిఎస్‌పి కె. పార్థ సారథి, టౌన్ సిఐ పి. వీర రాఘవులు లంచం డిమాండ్ చేసిన కేసులో అరెస్టు అయ్యారు. వీరి నివాసంలో 21 లైవ్ రౌండ్లు, 69 ఖాళీ బుల్లెట్లు, ఆస్తి పత్రాలు, బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) సిఐ ఒక కేసును మూసివేయడానికి రూ.15 లక్షల లంచం డిమాండ్ చేసి, రూ.3 లక్షలు స్వీకరించేటప్పుడు ఎసిబికి చిక్కారు.
మాధాపూర్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రూ.30 వేలు, మీర్‌పేట పోలీస్‌స్టేషన్లో ఓ కానిస్టేబుల్ రూ.10వేలు, చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు పోలీసులు, నాలుగు ప్రైవేట్ వ్యక్తులు కలిసి ఒక వ్యక్తిని బెదిరించి రూ.5లక్షలు వసూలు చేస్తుండగా, అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా ఇన్స్పెక్టర్ రూ.1.5 కోటి లంచం డిమాండ్ చేసి, రూ.5 లక్షలు తీసుకుంటుండగా, మెడ్చల్ జిల్లా అసిస్టెంట్ సబ్‌ఇన్స్పెక్టర్ (ఎఎస్ఐ) కె. మధుసూదన్ రావు రూ.50వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. కామారెడ్డి జిల్లాలో కానిస్టేబుల్ నిమ్మ సంజయ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుగులోత్ అశోక్ శివ నాయక్‌తో కలిసి రూ.10వేలు, ఆసిఫాబాద్ జిల్లా సబ్ ఇన్స్పెక్టర్ రాజ్యలక్ష్మి రూ.25వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

### ఫిర్యాదు చేయండి : ఎసిబి డిజి విజయ్‌కుమార్

లంచం లేదా అవినీతికి సంబంధించి ఏవైనా సమాచారం ఉంటే వెంటనే ఎ సిబి టోల్‌ఫ్రీ నంబర్ 1064 ద్వారా ఫిర్యాదు చేయాలని ఎసిబి డిజి విజయ్‌కుమార్ తెలిపారు.
సోషల్ మీడియాలో @TelanganaACB ద్వారా కూడా సమాచారం అందించాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

# బహిష్కరించిన లాలూ (మొదటి పేజీ తరువాయి)

తాను ఒక మహిళతో 12 సంవత్సరాలుగా రిలేషన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. తేజ్ ప్రతాప్ వివాహం చేసుకున్నప్పటికీ, అతని విడాకుల పిటిషన్ పాట్నాలోని కుటుంబ కోర్టులో ఇంకా పెండింగ్‌లో ఉంది. అయితే కొన్ని గంటల తర్వాత తేజ్ ప్రతాప్ పోస్ట్‌ను తొలగించాడు. తన ఫేస్‌బుక్ పేజీ 'హ్యాక్' అయిందని ఎక్స్‌లో పేర్కొన్నాడు. కాగా, తేజ్ ప్రతాప్ ప్రవర్తన, బాధ్యతారహిత వైఖరి వల్లే తొలగించానని లాలూ సోషల్ మీడియాలో తెలిపారు. తేజ్‌ప్రతాప్ ప్రవర్తన తమ కుటుంబ సంప్రదాయాలకు సరిపోలడం లేదని పేర్కొన్నారు. ఇకపై తేజ్‌ప్రతాప్‌కు పార్టీలో, కుటుంబంలో ఎలాంటి పాత్ర ఉండదని స్పష్టం చేశారు. 'వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించడం వల్ల సామాజిక న్యాయం కోసం మన సమష్టి పోరాటాన్ని బలహీనపరుస్తుంది. పెద్ద కొడుకు తేజ్ ప్రతాప్ కార్యకలాపాలు, ప్రవర్తన మా కుటుంబ విలువలు, సంప్రదాయాలకు అనుగుణంగా లేవు. అందువల్ల పార్టీ, కుటుంబం నుంచి తొలగిస్తున్నాను. ఇక నుంచి తేజ్ ప్రతాప్‌కు పార్టీ, కుటుంబంలో ఎలాంటి పాత్ర ఉండదు. 6 సంవత్సరాలపాటు బహిష్కరిస్తున్న. అతడితో సంబంధాలు కలిగి ఉన్న వారందరూ వారి సొంత నిర్ణయాలు తీసుకోవాలి' అంటూ లాలూ ప్రసాద్ యాదవ్ పోస్ట్ చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల సమయం మాత్రమే మిగిలి ఉండగానే ఈ పరిణామం జరగడం గమనార్హం. ఆర్‌జెడి లాలూ ప్రసాద్ చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ నాయకత్వంలో పోటీ చేయనుంది. ఇదిలా ఉండగా, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌ను చివరి ప్రయత్నం ఏమిటని అడిగినప్పుడు, ఆయన జాగ్రత్తగా స్పందించారు. 'నా అన్నయ్య పెద్దవాడు. ఆయన తన వ్యక్తిగత జీవితంలో ఏదైనా ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంది. కానీ మనం సహించలేని కొన్ని విషయాలు ఉన్నాయి. మా జాతీయ అధ్యక్షుడు తన పోస్ట్‌లో స్పష్టం చేశారు' అని అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు యాదవ్ అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com